
ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు

7-3-51

విషయానుక్రమణిక

7 మార్చి 1951


ఆంధ్రపత్రిక

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Fo under : K. NAGESWARA RAO

సంపుటము **43**
సంచిక **25**

వికృతి సంవత్సర మాఘ బహుళ అమావాస్య బుధవారము



న్యూయార్కు నగరంలోని "లేడర్లే శాస్త్రవిజ్ఞాన పరిశోధనా కేంద్రంలో సుప్రసిద్ధ ఆంధ్రశాస్త్ర విజ్ఞానవేత్త కీ. శే. డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావుగారి స్మారకచిహ్నంగా శిలాఫలకాన్ని ప్రతిష్ఠించారు. మరణించేనాటికి ఆయన ఆ పరిశోధనా కేంద్రంలో డైరెక్టరుగా పనిచేస్తున్నారు. 'బయో కెమిస్ట్రీ' శాస్త్రంలో డా॥ సుబ్బారావుగారివంటి ప్రతిభాశాలి మరొక రెవరూ ఈ నాడు లేరని ప్రతీతి. లోగడ వారు కొంతకాలం హార్వర్డు విశ్వవిద్యాలయంలో 'బయో కెమిస్ట్రీ' పరిశోధనా శాఖకు ప్రధానాధికారిగాకూడా పనిచేశారు.

శిలా ఫలకానికి ఎడమప్రక్క 'ఓరియంట్ వరల్డ్ ప్రెస్' సంపాదకులు డా॥పి. జి. కృష్ణయ్యగారూ, కుడిప్రక్కను, సుబ్బారావుగారి స్థానే నియమితులైన జె. హెచ్. విలియమ్సుగారూ కూర్చునివున్నారు.

ప్రభుత్వాలు, ఆయవ్యయాలు

[సీతారామ్]

★

బడ్జెట్ల పండగొచ్చింది, శాసన సభ్యులికీ, మంత్రులికీ. కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్ర ప్రభుత్వాలూ తమ తమ ఆయవ్యయాల పద్దుల్ని, ఈ సంవత్సరానికి తేలినవీ, మళ్లీ సంవత్సరానికి అంచనాలు వేసినవీ చక్కని పుస్తకాల్లో అచ్చు వేసి శాసన సభలకి అందచేశాయి. కొత్తపన్నులు, పాత ఉపన్యాసాలూ చదువుకోగల ప్రజలు చదువుకునే నిమిత్తం మార్చి నెల పొడుగునా వారానికి నాలుగు పేజీలు ఎక్కువ (అమ్మకం ధర పెంచ నక్కర లేకుండా) అచ్చు వేసుకోవచ్చునని భారత ప్రభుత్వం పత్రికాధిపతులకి అనుమతి ఇచ్చింది.

అన్ని ప్రభుత్వాలూ వచ్చే ఎన్నికల్ని ఒక కంట కనిపెట్టే బడ్జెట్లు తయారు చేశాయి. భారతప్రభుత్వం ఇండో-పాకిస్తాన్ వ్యాపారపు ఒడంబడికను కూడా దృష్టిలో పెట్టుకుంది.

మద్రాసు బడ్జెట్‌కీ, భారత ప్రభుత్వపు బడ్జెట్‌కీ చక్కని పోలిక ఒకటుంది. ఇది మిగతా అన్ని రాష్ట్రాల బడ్జెట్లకీ కూడా ఉండిఉంటుంది. ద్రవ్యానికి వచ్చిన తాకిడివల్ల, నిలవ వేసిన నిధుల్ని ప్రభుత్వాలు ఖాళీ చెయ్యడం మొదలు పెట్టాయి. భారతదేశం మూడు ముక్కలై ఒక పెద్ద ముక్క కాంగ్రెస్‌పరిపాలనలో పడినప్పుడు, అంటే 1947 ఆగస్టు 15కి, ఉన్న రొక్కం రు 275 కోట్లు. ఇది కాస్తా 1951 మార్చి ఆఖరుకి రు 65 కోట్లకి తగ్గిపోయి ఊరుకుంటుంది. 1948–49 లో మద్రాసు ప్రభుత్వంవద్ద మిగిలిన రొక్కం సెక్యూరిటీలువగైరా మొత్తం రు 87 కోట్ల 85 లక్షలు. మార్చి 1951 ఆఖరుకి రు 31 కోట్లుంటుంది. 1952 ఆఖరుకి ఇది రు 10 కోట్లకి తగ్గిపోతుంది. ఇది ఎన్నికల మీద దృష్టి పెట్టుకుని చేసిన పనేమో తెలియదు. ఏదిఏమైనప్పటికీ, 1952 మార్చి ఆఖరుకి ప్రభుత్వాలకి మిగిలే ద్రవ్యబలం చాలా తక్కువుంటుంది. కాబట్టి అప్పుడు ప్రభుత్వాలు ధనవంతులపైనా, వ్యాపారులపైనా మరింత ఆధారపడక తప్పదు. అంటే ఈ మాటు ఎన్నికల్లో, ధనవంతులు వ్యాపారులపైన కాంగ్రెస్‌కంటె ఎక్కువగా ఆధారపడేదైతేనే, ఇంకొక పార్టీ ఏదైనా ఎన్నికైనప్పటికీ, ఏడాదిపాటైనా నిలవగలుగుతుంది. అలా ఆధారపడేది కాకపోతే, ఏడాది కూడా తిరక్కముందే పడుకుంటుంది. కాంగ్రెస్‌పార్టీయే మళ్ళీ ఎన్నికోబడితే, పన్నులు పిండడంలో ఆరితేరిన మంత్రులు కొత్త కొత్త రకాల కామధేనువుల్ని సృష్టించగలరనే ధైర్యం ఒకటుంది.

మద్రాసు బడ్జెట్

మంత్రి గోపాలరెడ్డి గారు మద్రాసు శాసనసభలో బడ్జెట్‌ని 26వ తేదీని ప్రవేశపెట్టారు. వారి మహోపన్యాసం చూస్తే, ఈమధ్య ఏభై యేళ్లలో మనుషులైనవాళ్లు కనిపెట్టిన విమానాలు రేడియోలు సినీమాలు మొదలైనవాటిని గురించీ, టాగూర్ కవిత్వం గురించీ వ్యాసం వ్రాశారనిపిస్తుంది. దీన్ని కలికి చూస్తే కనిపించే విశేషాలేమిటంటే, కొత్త పన్నులు లేవు. ఈ యేడాది (1950-51) వచ్చినంతే వచ్చే యేడాదీ (1951-52) ఆదాయం వస్తుంది. అయితే ఈ యేడు రు 68 లక్షలు మిగులుంటుంది. వచ్చే యేడు రు 23 లక్షలు లోటుంటుంది. కాని ఇది ఇల్లా ఉండదని ఖండితంగా చెప్పవచ్చు. మిగతా కారణాల మాట అల్లా ఉంచి గోపాలరెడ్డిగారి కామధేనువు ఈ కాస్తా కూడా ఇవ్వక పోదు. ఇంకా పైన కూడా ఇస్తుంది.

'రాజ్యం సుభిక్షంగా ఉందని చెప్పలేను కాని, మేం చేసినది అంత హేళన చెయ్యతగ్గది మాత్రం కాదు' అన్నారు గోపాలరెడ్డి గారు. శాసన సభ్యులు ఉపన్యాసాలిచ్చారు. ఉపన్యాసాల్లో విమర్శలు ఘాటుగా లేవన్నారు గోపాలరెడ్డి గారు. నిత్యమూ ఆహారం, నూలు సప్లై, పోలీసుల అత్యాచారాలు, ప్రభుత్వం అసమర్థతల్ని గురించి సభ్యులు చేసే తీవ్ర విమర్శల కలవాటుపడిన మంత్రిగారు, అసలు వేసే తగల్లే దనుకుని ఉండాలి. అయితే ఇంకొకటి కూడా చెప్పాలి. ప్రభుత్వం వ్యయం చేస్తున్న పద్ధతీ, తంతూ విడిచిపెట్టి మిగతా విషయాలన్నిటిపైనా సభ్యులు తీవ్ర విమర్శలు చేశారు. విమర్శించవలసిన వాటిని విడిచి చేతికి (నోటికి) అడ్డువచ్చిన ప్రతి విషయాన్నీ ఎత్తి విమర్శించేసరికి మంత్రిగారికి తమపట్ల విమర్శ ఆట్టే కనిపించలేదు కాబోలు. ఇందుకు తగినట్టే మంత్రిగారి సమాధానం కూడా వచ్చిన విమర్శలకి అంటీ ముట్టకుండా ఉంది.

పన్నులు

గోపాలరెడ్డిగారు కొత్తపన్ను లేవీ వెయ్యలేదు. పాతపన్నుల్లో ఆట్టే మార్పు చెయ్యలేదు. చెప్పుకోదగిన మార్పులు మూడున్నాయి. ఎగుమతి సరుకులపైనా, రాష్ట్రాంతర వ్యాపారవస్తువులపైనా అమ్మకపుపన్ను రద్దవుతుంది. వార్తాపత్రికలపైన అమ్మకపుపన్ను రద్దవుతుంది. ఈ రెండూ మంత్రిగారి దయవల్ల వచ్చినవి కావు. రాజ్యాంగపరిషత్ నిర్ణయంవల్ల వచ్చినవి. మూడోది చేనేతవస్త్రంపైన అమ్మకపుపన్ను సగం తగ్గిస్తారు.

పన్నుల విధింపుకి సంబంధించినంతవరకూ మంత్రి గోపాలరెడ్డిగారు ప్రజలగోడుగాని కేంద్రప్రభుత్వం మందలింపుగాని వినేధోరణిలో లేరు. ప్రజల్లో ప్రతి ఒక్కరికీ అవసరమైన వస్తువులు, పప్పులు, మిరపకాయలు చింతపండు వగైరా సరుకులపైన అమ్మకపుపన్ను వసూలు చేస్తున్నారు. వీరికి ఈ సంవత్సరం వచ్చిన మొత్తం ఆదాయం రు 59 కోట్ల 70 లక్షల్లో రు 15 కోట్ల 75 లక్షలు అమ్మకపు పన్నువల్ల వచ్చినదే. వస్తువుల అమ్మకంమీద ఇంత ఆదాయం తీసుకుంటున్న ప్రభుత్వం ఈ వస్తువుల ఉత్పత్తి వృద్ధికి ఎంత కృషిచేస్తోందో అందరికీ తెలిసిన విషయమే. ఈనాడు మద్రాసు ప్రభుత్వం ధనవంతులవద్దనుంచి ఎంత పన్ను వసూలు చేస్తున్నదీ చూసి పోల్చినట్లయితే ఈ అన్యాయం బోధపడుతుంది. మద్రాసు ప్రభుత్వం జమీందార్లకిస్తున్న పరిహారం, పారిశ్రామికసహాయం పేరుమీద ధనవంతులకిస్తున్న పెట్టుబడి ధనం, మొదలైనవన్నీ, మధ్యతరగతి ప్రజలు, కార్మిక కర్షక వర్గాలవద్దనుంచి పరోక్షంగా, భూమిశిస్తు, అమ్మకపు పన్నుల రూపంగా తీసుకుంటున్న ధనంలోనుంచే తీసి ఇస్తోంది. జమీందారు బిడ్డలు మంత్రులైతే ఇటువంటి విషయాలు తెలియడం కష్టం కావచ్చును.

గోపాలరెడ్డిగారి కామధేనువుని ఇంక ఆట్టే పాడితే పాలు తగ్గిపోతాయని ఒక సభ్యుడు హెచ్చరించాడు. మంత్రిగారు కూడా 1951-52 లో వసూళ్లు పాతలెక్కనే కట్టారు కాని ఎక్కువ వసూలౌతుందని లెక్క వెయ్యలేదు. అంటే ఇప్పుడు వస్తున్నదానికంటె ఎక్కువ వసూలౌతుందనే నమ్మకం మంత్రిగారికి లేదనుకోకూడదు. (నిజం అనుకొన్నవన్నీ పైకిచెప్పడం మంత్రుల లక్షణం కాదు.) చిన్నపట్నంలో ఆవుల్ని ఆహారం పెట్టకుండా ఊరుమీదికి విడిచిపెట్టి అవి పోస్టర్లు, చీపురుకట్టలు తినేస్తే, పాలవాళ్లు నెత్తురొచ్చే వరకూ వాటి పాలు పిండుతారు. ఇలాగే మంత్రిగారీ కామధేనువుని పిండినట్లయితే, చివరికి కొనుక్కునే సత్తా తగ్గిపోయిన

ప్రజలు, వస్తువుల కొనుబడి తగ్గిస్తారనీ, దానివల్ల అమ్మకపు పన్ను వసూలు తక్కువౌతుందనీ కొందరు బెదిరించారు. ఆ భయం ఎవరికీ ఉండనక్కర్లేదు. గోపాలరెడ్డిగారికీ లేదు. కిందటి రెండు మూడేళ్లకంటే ఈ ఏడాది అన్ని వస్తువుల ధరలూ అధికంగా పెరిగిపోయే సూచనలు నిర్ధారణగా కనిపిస్తున్నాయి. మంత్రిగారి అమ్మకపుపన్ను అమ్మకం ధనంమీదే కాని వస్తువుమీద కాదు కాబట్టి, వస్తువుల ధరలు పెరుగుతున్న కొద్దీ గోపాలరెడ్డిగారి వసూలు పెరుగుతుంది. సత్తా చచ్చినవాళ్లు కొనడం మానేస్తేమాత్రం మంత్రిగారికి నష్టమేమిటి? కొనుక్కునేవాళ్ల దగ్గర పైసా మిగలకుండా వస్తువుల ధరల రూపేణా రాబట్టెయ్యడం వర్తకులు, వ్యాపారులు, మిల్లర్లు, మంత్రులు నేర్చుకున్నారు. కిందటి పర్యాయం కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల కరువుభత్యాల్ని నెలకి రెండు రూపాయలు హెచ్చించినప్పుడు వెంటనే హోటళ్లలో ఆహారాల ధరలు, బజారుల్లో ధరలు పెరిగిపోయి ఉద్యోగులికి లాభం గూబల్లోకి వచ్చింది. ప్రజలకి నిత్యానుభవమే. అందువల్ల ఈ అమ్మకపు పన్నువల్ల రాబడి ఒకవంక తగ్గే సూచన కనిపించిందంటే, మరొకవంక పెరిగే వీలు మంత్రిగారికి వర్తకులవల్లనే చిక్కుతుంది. అంతకీ ఇంకా తగ్గే దుర్గుణం కనిపించినట్లయితే, ఇంతవరకూ మంత్రిగారి హస్తం పడనివీ, ఇకముందు పడ్డానికి వీలున్నవీ అమ్మబడి కొనబడేవస్తువులు ఇంకా ఏ కొద్దో లేకపోలేదు. అవే భర్తీ చేస్తాయి.

మద్యపానదురభ్యాసంవల్ల ప్రజలు చెడిపోయి ప్రభుత్వానికి రు 17 కోట్లు సాలీనా పన్నులిచ్చేవారు. మద్యపానాన్ని నిషేధించి ప్రభుత్వం ప్రజల్ని రక్షించిందట. కాని వారు తినే ఆహారంపైన అన్ని రకాల అమ్మకపు పన్నులూ విధించి ఇప్పుడు రు 15 కోట్లుపైగా వసూలు చేస్తున్నారు. అప్పుడు వారి చెవులు నులిమి తీసుకునే ధనానికి గాను బాధ మరిచిపోయేందుకు మత్తుండేది. ఇప్పుడు నిస్సత్తువమాత్రం మిగిలింది. అందులో అవినీతి ఎంతుందో, ఇందులో నీతి ఎంతుందో మంత్రిగారికే తెలియాలి. ప్రజలకికూడా తెలిసేవుండాలి. కాని వారి బాగోగుల్ని వారే తెలుసుకోలేరని మంత్రిగారికెప్పుడూ జాలి ఎక్కువ.


వ్యాపారపు పంటలు

ఈరోజుల్లో రైతులకు అపారంగా ధనం ఆర్జించి పెడుతున్న పొగాకు, పసుపు, వేరుసెనగ మొదలైన వ్యాపారపు పంటలున్నాయి. ఇప్పుడు పండించే భూములపైన కూడా, వరి పండించే భూములపైన వసూలుచేస్తున్న శిస్తే వసూలు చేస్తున్నారు. ఇందులో న్యాయం కనిపించదు.

వ్యవసాయాదాయపు పన్ను ఒకటి విధించినట్లయితే మంచిదని ఆదివరలో ఒక విచారణసంఘం చేసిన సూచన పురస్కరించుకుని ఉత్తరప్రదేశంలో అది ప్రవేశపెట్టారు. దాన్ని ప్రకాశం మంత్రివర్గం తలపెట్టిన పాపం వల్ల కాబోలు, ఓమందూరు మంత్రివర్గం, కుమారస్వామి రాజామంత్రివర్గం తోసేశాయి. అది ప్రవేశపెట్టలేకపోతే, కనీసం వ్యాపారపు పంటలమీదైనా రాబడిపన్నువంటిది నిర్ణయిస్తే మంచిది. రాబడిపన్నులో మాదిరిగానే హెచ్చుతగ్గుల్ని బట్టి రేట్లు నిర్ణయిస్తే రాష్ట్రప్రభుత్వానికి చాలా ఆదాయం వస్తుంది. అమ్మకపు పన్నుల్తో ప్రజల్ని ఇంతగా పీడించనవసరం ఉండదు. ప్రజల కనీసావసరపు వస్తువులపైన అమ్మకపు పన్ను రద్దుచెయ్యడానిక్కూడా వీలుంటుంది. అసలే ధరలు పెరుగుతున్న రోజుల్లో అమ్మకపుపన్ను మరింత ధరల్ని పెంచేస్తోంది. ధరల్ని పెరక్కుండా అరికట్టాలంటే అవసర వస్తువులపైన అమ్మకపు పన్నులుండకూడదు. వ్యాపారపు పంటలపైన పన్ను ఆదాయంకోసమే కాదు; పన్నుల భారాన్ని సమానంగా అన్నివర్గాల మధ్యా పంచడంకోసం కూడా అవసరమౌతుంది.

వ్యయకర్తన

ప్రభుత్వం ఏయే శాఖల నిమిత్తం ఎంతెంత ఖర్చుపెడుతోందో, ఆయా శాఖలు ఏమేమి నెరవేర్చాయో, లేదా ఆ ఖర్చులవల్ల ప్రభుత్వానికికాని ప్రజలకికాని ఎంత ప్రయోజనం ఒరిగిందో, లెక్కకట్టి, ప్రకటిస్తే బాగుండునని మద్రాసు శాసనసభలో బాచిలర్ గారన్నారు. ఇంతేకాదు. శాసనసభలోని తెలుగుసభ్యులు అడగవలసినవి కొన్ని ముఖ్యప్రశ్నలున్నాయి. 1949-50 లో ఏయే స్కీములకింద, ఏ శాఖల నిమిత్తం తెలుగుజిల్లాల ఖర్చు కేర్పాటు చేసిన మొత్తమెంతో, వాస్తవంగా ఖర్చుపెట్టినదెంతో, వివరంగా తెలపాలి. అరవ జిల్లాల ఖర్చుల్ని కూడా ఇలా తెలిపితే, అప్పుడుమద్రాసు ప్రభుత్వం వ్యయకర్తనలో ఎటువంటి విధానం అవలంబించిందో తెలుస్తుంది.



శ్రీ గోపాల రెడ్డి

మంత్రి భక్తవత్సలంగారు విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని గురించి మాట్లాడినప్పుడల్లా మచ్‌ఖండ్ ప్రాజెక్టుపేరు పదేపదే చెప్తారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల్ని గురించి మాట్లాడేటప్పుడు తుంగభద్ర, రాంపేరు ఎక్కువ వినపడతాయి. తెలుగు జిల్లాల స్కీములపట్ల మరీ ఎక్కువశ్రద్ధ చూపిస్తున్నట్లుంటారు. కాని మచ్‌ఖండ్ ప్రాజెక్టునిర్మాణం నడుస్తున్న పద్ధతిచూస్తే అది పదేళ్లకైనా పూర్తి కాదుట.

1950-51 లో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిమిత్తం మొదట వేసిన ఖర్చు అంచనా రు 4 కోట్ల 77 లక్షలు. వాస్తవంగా ఇప్పటికి జరిగినఖర్చు 6 కోట్ల 75 లక్షలు. అంటే దాదాపు రెండుకోట్లు ఎక్కువ ఖర్చుపెట్టారన్నమాట. ఈ పెరుగుదలకి కారణం మలంపూరుఝా, దిగువభవాని ప్రాజెక్టులపైన అంచనాలకు మించిచురుగ్గా ఖర్చుచెయ్యడమేనని బడ్జెట్ మెమొరాండంలో చెప్పబడింది.

విశాఖపట్నంలో ఆహారోత్పత్తి వృద్ధి కార్యక్రమంకింద 1950-51 లో 28 స్కీములు తలపెట్టి ఖర్చులికి అంచనాలిచ్చారు. కాని ఒక్కస్కీము కూడా కొనసాగలేదు. మంజూరైన ధనంలో ఆట్టేఖర్చు కాలేదు. ఈ రీతిగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోంటే ఆంధ్రులకి విశ్వాసం ఎలా ఉంటుంది? విశ్వాసం లేకపోయినా ప్రభుత్వంనిశ్చింతగా పక్షపాత విధానాన్ని సాధించగలుగుతోందంటే, కళ్లుమూసుకుని ఊరుకునే తెనుగుమంత్రులుండబట్టే. దక్షిణాదిని వ్యవసాయం నిమిత్తం ఇస్తున్న విద్యు

(46-వ పేజీ చూడండి)

గృహిణి

శ్రీమతి క. రాజవల్లి

సేతూ, ఈ ఊరి చివర బంగళాలో ఎట్లా ఉంటున్నావే బాబూ! ఒక్క సందడీ లేదు. ఒక మనిషైనా కనబడదు. నీ కెట్లా ప్రొద్దు పోతుందో మాకేం తెలియడంలేదు." అని అందరూ అనేవాళ్ళే-వాళ్ళకేమి సమాధానం చెప్పాలో తోచడంలేదు. నేను చేసేగొప్ప పనేమిలేదు; కూర్చునేదిలేదు. పైమెలా జరిగిపోతుందో నాకే అవగాహన కావటంలేదు. నేనిపుడు ఆరుగురు పిల్లల తల్లిని, పెద్దది 8 ఏండ్లది. ఆఖరివాడు 8 నెలలవాడు.

ఒకొక్కొక్కరికి సంవత్సరంన్నర తేడా.


తెల్లవారి 5 గంటలు కొట్టడం మా బంట్రోతు కుయ్యి మనుకొంటూ లేవడం ఒకేసారి జరిగినాయి. ఎండలు రోజు రోజుకూ ఎక్కువవుతున్నా తెల్లవారుజామున యింకా చలేస్తూనే ఉండడంవల్ల నేను బాగా బ్లాంకెటు కప్పుకొని పడుకున్నా. అప్పుడే తెల్లవారింది కాబోల్ను దేవుడా అనుకుంటూ, కళ్లువిప్పకుండానే చంటోడ్ని జోగొట్టుతూ ఒక్క అరగంటసేపైనా పడుకోనిస్తాడేమో నని చూశా. కాని ఊహు! వాడు పడుకోనేది, నన్ను పడుకోనిచ్చేది కూడానా? ఒంటేలు కెళ్ళి బట్టంతా తడుపుకున్నాడు. ఇహ లేవడం తప్పనిసరి కదా అని 'కాస్సేపైనా పడుకోనివ్వరు,' అని సణుక్కుంటూ లేచి కూర్చుని వాడి చొక్కామార్చి క్రింద బట్టమార్చి వాడు ఏడుస్తూ ఉన్నా పడుకోబెట్టి పాలు కలుపుతూన్నా. ఇంతల్లోకే పురుక్కుమని వాడు బైలుకెళ్ళి, కాళ్లూ చేతులు కొట్టుకోవడమారంభించాడు. వళ్లంతా పులుముకొంటే కడగడం కష్టం, యింకా పనిమనిషైనా రాలేదని బట్ట మడిచేందుకు గబుక్కుని లేచేటప్పటికి నా కాలు తగిలి పాలగ్లాసు క్రింద పడి పాలు దొల్లిపోయినయి. ఏమైతే అయిందని లేచి వాణ్ని శుభ్రపరిచి, పాలు మళ్లకలిపి, వాడికి త్రాగించి, దీపం దగ్గర సాపెట్టి చేతికొక గిలకిచ్చి ప్రక్కన కూర్చున్నా. కడుపు నిండిందేమో, అత్త, తాత అని కబుర్లు సాగించాడు.

యింతల్లోకే మా సతీషుబాబు (రెండేండ్లవాడు) అమ్మాఅని ఏడుస్తూ లేచాడు. ఆలస్యమైతే పక్క తడిపేస్తాడన్న భయంకొద్దీ వాడ్ని బయట కమోడు మీద కూర్చోపెట్టుదామంటే, కాళ్లు నిగడదన్ని కూర్చోకుండా పోలూ! అనుకుంటూ యింకా గట్టిగా ఏడవడం మొదలుపెట్టాడు. "ఎంత సేపూ ఏడ్వా, పాలు తప్ప ఇంకోటి ఎరగడురా" అని చీదరించుకుంటూ వాడ్ని అక్కడే క్రిందకూర్చోపెట్టి పాలు కలుపుకొచ్చి చూతునుకదా, ఉచ్చపోసి అందులోనే కూర్చున్నాడు. వాడ్ని లేవదీసి ఒక చెంబెడునీళ్లు కాళ్లమీద క్రుమ్మరించి పాలగ్లాసు చేతికిచ్చాను.

బాగా తెల్లారిపోయింది. పనిమనిషి "తలుపు తెరవండమ్మా" అని వీధితలుపు ధనాధనా బాదుతు రంకెలేస్తూంది. వెళ్ళదానికి తలుపు తీసి వచ్చేటప్పటికి పిల్లల ఏడ్పులకైతేనేం, పనిమనిషి తలుపుచప్పుడుకైతేనేం, ఆయన హాఁ అని వళ్లు విరుచుకుంటూ లేచారు. దొడ్లోకి వెళ్లడానికి కూడా యింక 'హ్యా' మొదలెడుతుందేమోనని భయపడుతూ "పిల్లల్ని చూసుకోండి" అని అరుస్తూ, వాళ్ళేవో అంటున్నా వినిపించుకోకుండా దాటేసేను.

నా అవశ్యపాలు తీర్చుకొని వచ్చేటప్పటికి తక్కిన పిల్లలు లేవడం, ఫ్రాంసీవాళ్లు రావడం జరిగినాయి. పనిమనిషి పెట్టినకాగీ కాగని నీళ్లతో స్నానంచేసి వంటింట్లో దూరాను. టిఫిను ఏమి చేద్దామా అని ఆలోచిస్తూండగనే, జమాను "బాబుగారుండటం లేదమ్మా చాల ఏడుస్తున్నాడని" అని తీసుకొచ్చేడు. "ఏడుస్తూంటే మాగదెయ్యంలాగ కూర్చుంటె ఊరుకుంటాడా, అవీ ఇవీ కబుర్లుచెప్పి ఆడించు. బైటకు తీసుకుపో" అని వాడ్ని కసిరి పొయ్యిదగ్గర కూర్చున్నా. "పాలవాడొచ్చాడమ్మా! నీళ్లపాలు పోస్తున్నాడంటున్నారు కదూ, మీరే అడగండి" అని మరొక జమానొచ్చాడు. "ఇదుగో అబ్బాయీ యిట్లాంటి పాలుపోస్తే ఈవేళతో నే స్వస్తి. రేపటినుండి వేరేచూసుకుంటాము "అని వాడ్ని బెదరించా" "అబ్బే అబ్బే ఈవేళ మా ముసల్దిచ్చింది దొరసానీ, రేపట్నించి చూడు ఎట్లాంటివి తెస్తానో" అని వాడు కదిలాడు. వీడు కాదు మరొకడయినా యిదే తంతుకదా? గణాళ్ళ ముచ్చటకోసం వీడ్ని మాన్పించడం యెందుకనుకొంటూ వంటింట్లో కొచ్చి, ఆలోచించడమేమిటి నైజాంవాళ్లకి రొట్టెలే యిష్టముకదా, అని పిండి తడపడం మొదలెట్టాను. "అమ్మా సతీషు పళ్లపొడి ఒలకపోసేస్తు






న్నాడే. యిదిగో చొక్కామీదంతా ఎట్లా పోసుకొన్నాడో!" "అమ్మా విజయ పళ్లపొడిడబ్బాలో నీళ్లు పోసేసిందే" "ఛీ నామీద పడేటట్లు యిక్కడే ఊస్తావే అవతలకెళ్లు" నువ్వెళ్లంటె నువ్వెళ్లని పెద్దవాళ్ళిద్దరు పోట్లాడటం, యివన్నీ వింటున్నా ఏ గంగలోనన్నా కలవండని విని విననట్లు నాపని చేసుకుంటూ, కూర్చున్నా. యింతట్లోకే మా ఆయన వెళ్లి ఏదో తగవు తీర్చినట్లున్నారు కొస్త సద్దణిగింది. రెండు నిమిషాలైందో లేదో అల్లల్లో మనుకుంటూ మా విజయ (3 ఏండ్లది తడిసిన బట్టలతో వంటింట్లోకి పరుగెత్తుకొచ్చి "చూడమ్మా శాత్రములో సురేశ్ ఎట్లా తోసేశాడో బట్టలు తీసెయి" అని ఏడవటం మొదలుపెట్టిందే. యింతట్లోకే దాన్నెందుకు తోసేశావని మా పెద్దది, వసంతి, వాడ్ని కొట్టినట్లుంది; వాడు బేరుమనుకుంటూ "చూడమ్మా అక్కెంత గట్టిగా కొట్టిందో" అని వచ్చాడు. "ఏడ్చావు వెధవా ఎప్పుడూ దెబ్బలాటలు దొమ్మిలాటలు" అని వాడ్ని కసిరి, చెప్రాశీ వాడ్ని పిలిచి విజయకి వేరే చొక్కా వెయ్యరా అంటే వాడు ఒక పావుగంట వెతికి పైనేవీ లేవమ్మా పెట్లోనుంచితీ సెయ్యండని వచ్చాడు. అయ్యో దేవుడా అనుకుంటూ పొయ్యిమీదది దించేసి లేచి ఒక గౌను తీసియిస్తే అది వద్దు వేరే పూవుల పూవుల దిమ్మని ఆవిడగారి పేచీ. అనక నీళ్లు పోసుకొని వేసుకొందువుగానని ఎంత బ్రతిమిలాడినా వినలా ఆఖరికి క్రిందా, మీదా, పెట్టంతా తిరగేయగా, పువ్వులది దొరికింది. అది దాని ముఖముమీద గిరాటేసి రాబోగా ఎక్కడనుంచి చూసిందో ఒక చిన్న చిరుగుంటే, అందులో వ్రేలు పెట్టి యింకా పెద్దది చేస్తూ "యిది నాకక్కర్లేదు. చినిగిపోయింది" అని మారాం పెట్టడం మొదలెట్టింది. నా కోపం కొద్దీ కొత్త బట్టల పెట్టె తీసి ఒక క్రొత్తగౌను పారేసేసరికి మా ఆయన వచ్చి "అలా కోప్పడి కసురుకొంటె ఎట్లాగ. చిన్నపిల్లలు, వాళ్లని బుజ్జగించి సముదాయించాలి కాని" అని నన్ను మందలించేటప్పటికి నాకింకాస్త వళ్లు మండుకుపోయి ఆ సముదాయించే దేంటో మీరే చూసుకోండి నాకు తెలవదు" అని పరాపరా వచ్చేసేను. "ఇదుగో కాఫీ త్వరగా కానియ్యి. ఈవేళ ఆఫీసుకు తొందరగా వెళ్లాలి" అని నా వెనకాతల కేక. ఎట్లాగో వండటం ముగించి మా ఆయనకు, మా మామగార్కి బల్లమీద కాఫీలు పెట్టి పిల్లల్ని వంటింట్లోకి పిలిచి వాళ్లకి పెట్టుతూ కూర్చున్నా. మొదలు; "నా పీటమీద వాడు కూర్చున్నాడు; నాకీ పళ్ళెం వద్దు, ఈ రొట్టె మాడిపోయింది, కూరెందుకు పెట్టావు చక్కెర వెయ్యమంటేను" అని ఈవిధంగా పేచీలతో, సగంతిని, సగంపారేసి ఎలాగైతేనేం ముగించారు. కాలుతుంది కొంచెం ఉండమంటే ఉండకుండా వెంటనే పొయ్యమని కాఫీ పోయించుకొని గబుక్కున గ్లాసు పట్టుకొని కాలుతుందని పడేశాడు చిన్నోడు. వాడ్ని తిట్టాలో ఏం చేయాలో కూడ తెలియక ఉడుకు మోతుతనం హెచ్చిపోతూంటే, వాడికి మళ్ళీ యింత చల్లార్చి పోసి నేను తిందాంకదా అని పళ్ళెంలో రొట్టె పెట్టుకు కూర్చున్నా. బయట చంటి పిల్లోడి ఏడ్పు వినబడుతూంది. "వాడి పాలమాట మర్చే పోయా" ననుకుని కొన్ని పాలు కలిపి వాడికి పట్టించి జమాను చేతి కిచ్చేసి, నా కాఫీ ముగించుకున్నా. మా ఆయన ఆఫీసుదయ చేశారు.

తొమ్మిది కావస్తోంది పొయ్యిమీద పప్పు పడేసి. పిల్లలికి తలలు దువ్వటానికి కూర్చున్నా. ఎంతపిలిచినా ఒక్కళ్లు రారే.

(46-వ పేజీ చూడండి)



పాకిస్తానులో

ఎ. సొఫ్రోనోవ్

[ఒక సోవియట్ రచయిత అనుభవాలు]

★

5. లాహోరులో సభలు

పాకిస్తాను రచయితలకూ, పాకిస్తాను సోవియట్ సాంస్కృతికమండలివారికీ మాస్కోనుంచి బహుమానాలు తెచ్చాము. మండలికి లాహోరులో కార్యాలయం లేని కారణంచేత బహుమానాలను మేము ఉంటున్న హోటలులో ఇవ్వవలసివచ్చింది. ఈ బహుమానాలలో రెండు రకాల ఫోటోలున్నాయి. ఒక సెట్టు మాస్కోలోని థియేటరుకూ, అందులోని నటులకూ సంబంధించినది. రెండవది అక్టోబరు విప్లవం తాలూకు 32వ వార్షికోత్సవానికి చెందినది. మా మిత్రులకు సోవియట్ ప్రజాజీవితంతో—అక్కడి పట్టణాలు, ఫాక్టరీలు, కిండర్ గార్డన్, సాముదాయిక వ్యవసాయ క్షేత్రాలు, వ్యవసాయయంత్రాలు వగైరాలతో—పరిచయం కలిగించటానికి మేము చాలా సంబరపడ్డాము.

ఈ ఫోటోలన్నిటినీ మా మిత్రులు పెద్ద సైజు బంగీ కట్టి లాహోరు పట్టణ అభ్యుదయ రచయితల శాఖ కార్యదర్శి అయిన హమీద్ అఖ్తార్ ఇంటికి టాంగా మీద పట్టించుకు వెళ్లారు.

పోలీసులు హమీద్ అఖ్తార్ ఇంటికి వెళ్ళి ఈ ఫోటోలన్నిటినీ స్వాధీనపరుచుకున్నట్టు మాకు మర్నాడు తెలిసింది. అందులో యాబ్లోచ్కినా, జస్తుషెవ్ మొదలైన ప్రఖ్యాత మాలీ థియేటర్ నటుల ఫోటోలూ, సోవియట్ కిండర్ గార్డన్లూ, నర్సరీలూ, మాస్కో వీధులూ, తాష్కెంటు పార్కులూ, పునర్నిర్మాణమవుతున్న స్టాలిన్‌గ్రాడ్ నగర దృశ్యాలూ, కూబాన్ సమష్టి వ్యవసాయ క్షేత్రాలూ ఉన్నాయి.

ఇది అతిథిసత్కార ధర్మాలకు పూర్తిగా విరుద్ధం. ఇది పౌరస్వాతంత్ర్యానికి కూడా కేవలం విరుద్ధం. పాకిస్తానులో ఏ దేశంకన్న కూడా ఎక్కువ పౌరస్వాతంత్ర్యం ఉన్నదని పాకిస్తాను మంత్రి షాహాబుద్దీన్ చెప్పిన దాని కొంతమాత్రమూ అనుగుణంగా లేదు.

పాకిస్తానులో మేమున్న కాలంలో మాకు అక్కడి స్వాతంత్ర్యంగురించి తెలుసుకునే అవకాశాలు చాలా లభించాయి.

ప్రభుత్వకళాశాలలో మీర్జా తుర్సున్ జాదే సోవియట్ కళాసాహిత్యాలను గురించి ఉపన్యసించినప్పుడు మేము వెళ్లాము. తుర్సున్‌జాదే పార్సీభాషలో ప్రసంగించాడు. ఆభాష అక్కడ అందరికీ తెలుసును. హాలుమధ్య పెద్ద కుర్చీలో కూర్చుని ఉన్న ప్రొఫెసరు విద్యార్థులకేసి కోపంగా చూస్తూవచ్చాడు. దీనికి కారణం లేకపోలేదు. మా దేశంలో విద్యార్థులకు ఉచితంగా విద్య చెబుతారని తుర్సున్ జాదే చెప్పినప్పుడు విద్యార్థులు హర్షధ్వనులు చేశారు. మేము చుట్టూ కలయచూశాము. మా సమీపంలో కూర్చున్న విద్యార్థులిద్దరు భయభయంగా చేతులు నులుపుకోసాగారు. వారికి చప్పట్లు కొట్టాలనిపించింది గాని ప్రొఫెసరువారి వంక తీక్షణంగాచూస్తూండడంవల్ల భయపడ్డారు.

మేము మొట్టమొదటిసారి లాహోరులోని ఒక కళాశాల సందర్శించినప్పుడు ఉజ్బెక్ రచయిత అయిన మూసా ఆయిబెక్ ఉజ్బెకిస్తాను సంస్కృతిగురించి, కళాసాహిత్యాలను గురించి ప్రసంగించాడు. హాలు కిక్కిరిసిపోయింది. ప్రారంభంలో అతను చెప్పిన ప్రతి మాటా సభికులు శంకించారు. కాని క్రమంగా స్నేహభావం తల ఎత్తి అతని ప్రసంగం పూర్తి అయే సమయానికి అందరూ హర్షం వెలిబుచ్చారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు నెలకు 25 మొదలు 50 రూపాయలదాకా ఇచ్చుకోవాలి. మామూలు కూలి చేసుకునే వాళ్లు నెలకు 30 రూపాయలు మాత్రమే సంపాదించుకుంటారు గనకా, కనీస జీవిత ప్రమాణం 60 రూపాయలుగనకా విద్యార్థులు ఏ తరగతులనుండి వచ్చేదీ సులభంగా ఊహించుకోవచ్చు.

ఇక్కడ బ్రిటిషు, అమెరికన్ దుష్ప్రచారకులు చేసే రష్యా వ్యతిరేకప్రచారం ఎంత దూరం వెళ్ళిందంటే మేము సందర్శించిన ప్రతి కళాశాలలోనూ విద్యార్థులు మా దుస్తులు తడివి చూశారు. మా పాదరక్షలూ, చేతి గడియారాలూ, సిగరెట్లూ, చివరకు సైలూ కూడా పరీక్షించి, "ఇవి రష్యాలో తయారైనవేనా?" అని అడిగారు.

మాకు నవ్వొచ్చింది. సోవియట్ యూనియన్‌పై అభిమానం గలవారిలో సయితం బ్రిటిషువారి ప్రచారం చాలాగాఢంగా నాటుకున్నది. రష్యాలో డబ్బుకు స్వస్తి చెప్పి వస్తువుల మారకం చేస్తారుట నిజమేనా అని వారు మమ్మల్ని అడిగారు.

సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ కూలిపోయిందనీ, కేవలం బ్రిటిషు దిగుమతులమీదనే సోవియట్ యూనియన్ ఇంకా నిలబడి ఉన్నదనీ ఆర్థిక శాస్త్రాధ్యాపకులు కొన్ని కళాశాలలలో బోధిస్తున్నప్పుడు ఇటువంటి సందేహాలు కలగటంలో ఆశ్చర్యం లేదు.

ఒకనాటి సాయంకాలం హోటలు భోజనశాలలో మేము భోజనం చేస్తూండగా, పెషావరులో మాకు కనిపించిన కోమింటాంగ్ జనరల్ మా వేసుకున్న దుస్తులులాటివే వేసుకుని ఒకాయన భోజనశాల ప్రవేశించాడు. ఆయన వెంట లావుపాటి చైనా యువతీ, ఇద్దరు పిల్లలూ ఉన్నారు. ఈయన చైనానుంచి పారిపోయి వచ్చిన మరొక కోమింటాంగ్ జనరల్. మరుసటి ఉదయం ఈయన హోటలు బాల్కనీలో ఒక బల్లముందు కూచుని ఉన్నాడు. ఈయన కెదురుగా ప్రశ్న చెప్పేవాడున్నాడు. వాడు బల్లమీద పాచికలు దొర్లించి ఈ అభాగ్యుడికి జోస్యం చెబుతున్నాడు. కోమింటాంగ్ జనరల్ చాలా శ్రద్ధగా వింటున్నాడు. ఈ జనరల్ గారికి పుట్టగతు లుండవని తెలుసుకోవటానికి జోస్యం అవసరం లేదు.

త్వరలోనే మేము లాహోరునుంచి వెళ్ళిపోతామనగా లాహోరు రచయితలనూ, రైల్వే, నేతకార్మికులనూ పరిచయం చేయటానికి గాను మీటింగు ఏర్పాటు చేశారు. మీటింగుకు బయలుదేరే సమయంలో హోటలుబయట చాలామంది లోఫర్లు తారట్లాడు తున్నట్టు కనిపించింది. బయట నిలచి ఉన్న టాక్సీలలో ఎక్కి కూచున్నాము. కాని, ఏ కారణంచేతో అవి కదలలేదు. డ్రైవర్లు ఆందోళనగా టాక్సీ కేంద్రంకేసి చూపులు నిగిడిస్తూ కూచున్నారు. ఆలస్యమెందుకని మేమడిగాము. దానికి సమాధానం చెప్పకుండా ఒక డ్రైవరు దిగి బానెట్ ఎత్తి ఇంజను నేదో చెయ్యనారంభించాడు. ఇంతలో గోధుమరంగు కారొకటి వచ్చి హోటలు ముందాగి హారన్ వేసింది. మా డ్రైవరు బానెట్ దించేసి కారులో ఎక్కి తనుకూడా హారన్ వేశాడు.

తరవాత కార్లు బయలుదేరాయి. మాలో ఒకరు వెనక అద్దంలోనుంచి చూసి గోధుమ రంగు కారు మమ్మల్ని అనుసరిస్తున్న సంగతి తెలుసుకున్నారు.

"గెస్టపో!" అన్నాడతను.

ఎట్లాగైతేనేం మీటింగుహాలు చేరాం. సాయంకాలం 6 నుంచి 9 దాకా ఈ హాలును మీటింగుకోసం అద్దెకు తీసుకున్నారు.

ప్రేక్షకులలో కొందరు గోడకి జేరబడి వేసి ఉన్న బెంచీలమీద కూచున్నారు. మిగిలిన వాళ్లంతా నేలమీదనే చతికిల బడ్డారు. చిన్న వేదిక ఏర్పాటు చేసి దానిపై పూలు అలంకరించారు. చిన్న మట్టిపాత్రలో తామ్రవర్ణంగల పుష్పాలు సుత్తి-కొడవలి ఆకారంలో అమర్చారు. ముఖద్వారంపైన ఒక పోస్టరు అంటించారు. "పాకిస్తాను స్వతంత్ర రిపబ్లికు కావాలి" అని దానిపై రాసి ఉంది

మీటింగు ప్రారంభం అయేటప్పుడు అబ్దుల్లామాలిక్ లేచి, సోవియట్ రచయితలు తెచ్చిన బహుమానాలు పోలీసులు స్వాధీన పరచుకున్న సంగతి ప్రకటించాడు.

"సిగ్గు, సిగ్గు," అని కేకలు.

దీనిపై ఆక్షేపణ తెలుపుతూ తీర్మానం ప్రతిపాదించబడి తక్షణమే ఆమోదించబడింది.

ఆ తరువాత సాహిత్య గోష్ఠి ప్రారంభమయింది. మేము తెచ్చిన పుస్తకాలను నికొలాయ్ తిఖొనోవ్ పంచిపెట్టాడు. పుష్కిన్, గోర్కీ, జంబుల్, ఫదెయెవ్ పేర్లు ఆయన చెబుతుంటే హాలు హర్షధ్వానులతో మారుమోగింది.

నదీం కాస్మీ, అలీఫ్ జలాలీ, ఖసాన్ అరుద్దీన్, ఖతాన్ షాఫో మొదలైన పాకిస్తాను కవులు తమ రచనలు చదివి వినిపించారు. అలీఫ్ జలాలీ తాను రచించిన గీతాలు పాడాడు. పాబ్లో నెరూడా పాటల తర్జుమాను అరుద్దీన్ చదివాడు. "నేను ఖైదీని, కాని నా కలం స్వతంత్రమైనది. ధనికులు నా కలాన్ని కొనగోరుతున్నారు. కాని అది ఎన్నటికీ జరగదు," అన్న భావాలుగల పదాలను ఖతాన్ చదివాడు.

సోవియట్ రచయితలను చూడటానికి రైల్వే, నేత కార్మికులు 500 మందికి పైగా వచ్చారు. మా ప్రసంగాల మధ్య స్టాలిన్, సోవియట్ యూనియన్లపట్ల గౌరవం తెలిపే నినాదాలు చేశారు. స్టాలిన్ రాజ్యాంగం కింద ప్రతి పురుషుడికీ, స్త్రీకీ కూడా పనిచేసుకునేటందుకూ, విశ్రాంతి పుచ్చుకునేటందుకూ, విద్యాభ్యాసం చెయ్యటానికీ హక్కున్నదని మేము చెప్పిన మాటలు ఎంతో హర్షాన్ని రేకెత్తించాయి.

పాకిస్తాను శ్రామికులకు సోవియట్ యూనియన్ పట్ల ఎంత గాఢానురాగమున్నదీ ఈ మీటింగులో మాకు తెలిసింది. "సోవియట్ యూనియన్ వర్ధిల్లాలి!", "పాకిస్తాను స్వతంత్రం కావాలి!", "ఆంగ్లో అమెరికన్ యుద్ధకూటమి నశించాలి!" అన్న నినాదాలు రచయితలూ, కార్మికులూ కూడా అందుకున్నారు.

మర్నాడు, మేము విమానంలో వెళ్లిపోబోయేముందు గోరిషా కార్మికులపేట చూడబోయినాము. ఇక్కడ 8 వేలమంది రైల్వే కార్మికులు (వారి కుటుంబాలతో సహా 25 వేలమంది) నివసిస్తున్నారు.

ఈ నివాసాలకు సమీపంలోనే చిన్న రెండంతస్తుల మేడమీద రైల్వేపనివారి కమిటీ కార్యాలయం ఉన్నది. ఇక్కడ గోడమీద ఎర్రజెండా, లెనిన్, స్టాలిన్ చిత్రాలూ, వాటికి కాస్త కిందుగా రైల్వే పనివారి నాయకుడైన మీర్జా ఇబ్రహీం ఉన్నాయి. మీర్జా రహస్య రాజకీయ రంగంలో పనిచేస్తున్నాడు.

కార్మికులపేట ప్రవేశించాము. ఇంతకన్న భయంకరమైన దృశ్యం ఎవరూ ఊహించలేరు. కార్మికులకొరకు ప్రత్యేకంగా కట్టిన పేట అనగానే ఇళ్లూ నివాసాలూ ఉంటాయనుకుంటాం. ఇక్కడ అవేమీ లేవు. ఇక్కడ ఉన్నవల్లా కిటికీలూ, వాకిళ్లూ లేని మట్టికొంపలు. ఒక్కొక్కటి రెండుమూడు గజాల పొడుగూ, అంతే వెడల్పూ ఉన్నది. ఈ కొంపల్లో కార్మికులూ, వారి కుటుంబాలూ నివసిస్తున్నారు. ఒక్కొక్క కొంపా చూస్తూ వెళ్లాము. ప్రతి ఇంట్లోనూ మట్టి నేలా, చాప బదులు గడ్డీ, ఎక్కడన్నా ఒక చింకి కంబళీ ఉన్నాయి.

ఒక కొంపలో ఎనిమిదిమంది ఉన్నారు. అందరూ ఒకసారే పడుకోటానికి లేదు. అందుచేత కొందరు లేచిన తరవాత మరి కొందరు పడుకుంటారు.

ఒక ఇంజను డ్రైవరుండే ఇల్లు చూశాము. అతనూ, అతని భార్యా కాక ఆ కుటుంబంలో 8 మంది పిల్లలూ, మరిద్దరు వృద్ధులూ ఉన్నారు. ఈ ఇంజను డ్రైవరు నిపుణ శ్రామికుడైకూడా నెలకు 60 రూపాయలు తెస్తాడు. ఈ మట్టికొంపకు నెలకు 8 రూపాయలు అద్దె ఇస్తాడు. ఈ కుటుంబం పల్చని రొట్టెలూ, ఉప్పూ, ఉల్లిపాయలూ, నీరూ తిని బతుకుతుంది. తలకు రోజుకు ఒక రొట్టె తింటారు.

మేము చూసిన మరొక ఇల్లు మరీ భయంకరంగా ఉన్నది. అందులో చింకిగుడ్డలు కట్టుకుని చిక్కి శల్యమైన ఆడదీ, వొంగిపోయిన మగవాడూ అనేకమంది పిల్లలూ ఉన్నారు. రైలు ఆవరణలో బొగ్గులు ఒక్కొక్కటే ఏరి వాటిని అమ్మి ఈ గృహస్థు నెలకు 15 లేక 18 రూపాయలు సంపాదిస్తాడు. మనిషికి 60 రూపాయలు కనీస జీవితప్రమాణమై ఉండగా కుటుంబానికంతకూ కలిపి 18 రూపాయలు!

అతని వయసు 32 ఏళ్లేనని విని ఆశ్చర్యపడ్డాము. 60 కి తక్కువ లేనట్టు కనిపించాడు. అతని కాళ్లు వంగిపోయాయి, ఛాతీ ముడుచుకుపోయింది, జ్వరితుడి కళ్ళలాగా ఉన్నాయి అతని కళ్లు.

మరొక ఇంట్లో 8 మంది ఉంటున్నారు. ఒక స్త్రీ రగ్గు కప్పుకుని ఉన్నది. ఆమె మలేరియాతో బాధపడుతున్నది. ఆమె బంధువులు అసహాయులై ఆమెను జాలితో చూస్తున్నారు. రోగికి బాధనివారణచేసే వైద్యుడు లేడు, మందులూ లేవు. ఆమె బతికి బయటపడితే మంచిదే, లేకపోతే ఎవరేం చేయగలరు?


ఇక్కడ నివసించేవారికున్న సౌకర్యమేమంటే ఈ ఇళ్ల వెనుకనే శ్మశానం ఉంది. అయినప్పటికీ డబ్బూ, బంధువులూ లేకుండా చనిపోయినవారి శవాలకు ఒకంతట సంస్కారం జరగదు.

మేమురాకపూర్వం చాలా రోజులక్రితం గోరిషాలో ఒక ముసలిది ఆకలితో చనిపోయింది. ఉత్తరక్రియలు చేయించటానికి ముల్లా 5 రూపాయలు అడిగాడు. కానిడబ్బు లేదు. మూడురోజులు ఆ శవం ఎండలో ఆరుబయట పడిఉండి కంపుకొట్ట నారంభించిన తరువాత రైల్వే కార్మికులు చందాలు వసూలు చేసి అయిదురూపాయలు పోగుచేసి శవాన్ని పాతేయించారు.

వంకర కాళ్లూ, ఎర్రగా ఉండి నీరు కారే కళ్లూ గల పిల్లల్ని చూస్తే గుండె తరుక్కుపోతుంది—అట్టలు కట్టుకుపోయిన జుట్టూ, ముక్కుకు రాగిపోగులూ గల ఆడపిల్లలు. ఒక గుడిసెబయట 6 ఏళ్లపిల్ల ఇద్దరు చంటిపిల్లలనెత్తుకుని పోతూ కనిపించింది.

ధైర్యమూ, అందమూ, సహనమూ మూర్తీభవించిన ఈ ప్రజలు అతిఘోరమైన జీవితాలు గడుపుతున్నారు. ఎవరన్నా నోరుమెదిపితే జైలే గతి. 25 వేల మందికి ఒకే కుళాయిగల ఈ దుర్గంధపూరిత నరకకూపంలోకూడా గోడలమీద అయిదు కోణాల నక్షత్రాలూ, "చైనా అడుగు జాడ

(45-వ పేజీ చూడండి)



స్విచ్ ఆఫ్‌చేసి నెమ్మదిగా రగ్గుని కప్పుకుని పడుకున్నాను. వీధి గదిలో పడకకుర్చీమీద కూచుని శర్మ పేపరు చదువుతున్నాడు. కొంచెంగా కళ్లు మూతపడ్డాయి.

ఎవరో వొచ్చి మంచంమీద కూచుని, మెల్లగా నా చెయ్యిల్ని తడిమి పట్టుకున్నారు. తర్వాత వక్షోజాలు మెత్తగా నా వక్షాన్ని తాకినట్టయింది. నిశ్వాసం మెల్లగా విడుస్తున్నట్టుకూడా వినపడింది. వెంటనే ముసుగు తీశాను; లేవబోయాను.

పెద్ద జడొకటి నామీద పడింది. జుట్టులోంచి కమ్మని వాసనలు వెలువడుతున్నాయి. ఎవరో యౌవ్వనంలోని స్త్రీలా వుంది. ఇరవై ఏళ్లుంటాయి.

"ఎవరు?" అన్నాను ఏం అర్థంకాక. వీధిగదిలో శర్మ చదువుతూనే వున్నాడు.

"నేనా... వేణ్ని!"

తిన్నగా కూచుని అంది కృష్ణవేణి— శర్మ భార్య. అతిథిగా వెళ్ళినందువల్ల ఆ వేళ తప్పితే ఆమెని ఇదివరకెప్పుడూ చూళ్లేదు.

'ఏమిటీ దారుణం?'

అదే పైకి అన్నాను.

"ఏదో ఋణం. ఆ ఋణం తీర్పించుకుందామనే వొచ్చాను"

సన్నని వేలితో బుగ్గమీద మీటబోయింది. నేను వెనక్కి తగ్గాను.

"పాలు కొరవులేవోయ్" అంది వయ్యారంగా కూనిరాగం తీస్తూ. నా వైపు కొంచెం జరిగింది. నేను పూర్తిగా రగ్గుతీసి ఓ మూలకి ఇరికాను.

మా మాటలు విని శర్మ ఏమన్నా కదులుతాడేమో అంటే అదీ లేదు. అతను గమనించనట్టు ఊరుకున్నాడు.

"మొగవాళ్ళల్లో కూడా పతివ్రతలుంటారన్నమాట! తాకితే నా బంగారం అంటుకుంటుందా?"

నాకు వొళ్లు మండింది. ఏమిటీ సంసార వ్యభిచారం! మానవ నాగరికతలో ఒక నీతి, నియమం ఉండొద్దా?

"నీ వుద్దేశం నాకు తెలిసింది కాని, పొరపడుతున్నావు. నేను వ్యభిచారాన్ని ప్రోత్సహించే మూర్ఖుణ్ని కాను. ఆడవాళ్ళ చేతుల్లో ఆటవొస్తువుని కాదు. అడుగో నీ భర్త అక్కడికి వెళ్లు" అన్నాను.

"నా ప్రియసారంగధరా..." అని గెడ్డం పట్టుకోబోయింది. వీధిగదిలోని దీపంనించి వొచ్చే గుడ్డి వెలుతురులో ఏదో కొాదు పిశాచంలా కనపడింది.

"ఫటప్—"అని చేతినీ, మనిషినీతోసివుచ్చాను.

వొగరుస్తూ లేచి నించుంది.

"ఇందాకటి నుంచి ఏదో ఎప్పుడన్నా నాటకంలో సారంగధర వేషం వేశారనుకున్నాను. ఛీ, మూర్ఖుడా! కోరివొచ్చిన ఆడదాన్ని అనుభవించడం చేతకాని అమాయికుడా! నీ యింతోటి అందాన్ని మోహించి వొచ్చాననుకున్నావా! ఛో" అంటూ అక్కడినించి వెళ్లిపోయింది.

శర్మయింకా వీధి గదిలో పేపరు చదువుతూనే వున్నాడు. నా బెడ్డింగ్ సర్దుకుని నేను కదిలాను అతను అడ్డలేదు.



అంతా కళ్ళకి కట్టినట్టయింది. ఆవేళ ఆ స్థితిలో చూసిన కృష్ణవేణ్ని ఈవేళ ఇక్కడ ఈ స్థితిలో చూశాను.

ఏదో వింతకే సొచ్చింది రమ్మనమని డాక్టరు మూర్తిగారు కబురుచేస్తే వొచ్చాను.

కృష్ణవేణి జబ్బుల్తో ముఖమంతా నల్లబడి, జీర్ణావస్థలో పడుకునివుంది. నన్ను చూసి చేతులు జోడించి, కూచోమని సంజ్ఞ చేసింది.

పక్కని స్టూలుమీద కూర్చున్నాను. మనిషివాలిపోయి అస్థిపంజరమైంది. చేతులూ, వేళ్లూ, ముఖం, ఎముకలు తప్ప వేరేం కనపడ్డంలేదు.

డాక్టరుమూర్తిగారు అన్నారు. "ఆవిడే మిమ్మల్ని పిలిపించమని అడిగింది. మీతో ఏదో మాట్లాడాలట."

నాకు ఆశ్చర్యమేసింది. ఆరేళ్ల క్రితం జరిగిన ఆ సంఘటన తప్ప ఆమెకూ, నాకూ వేరే పరిచయం లేదు. ఏం చెబుతుంది నాతో?

ఆలోచనలో వున్న నామీద ఎముకల్లాంటి వేళ్ళు పడి స్పృహ కలిగించాయి.

"నన్ను క్షమించవూ" అంది. కళ్లల్లో నీళ్లు నిండాయి.

నెమ్మదిగా వేళ్లని నిమిరాను.

"శర్మ ఎక్కడ?" అన్నాను.

"ఏమీ తెలియదు. రెండేళ్ల క్రితం నన్ను వొంటరిగా విడిచి ఎక్కడికో పోయారు. మళ్ళీ జాడ తెలీలేదు" నీరసమైన గొంతుకతో అంది.

"అసలు ఎందుకొచ్చిందీ దురవస్థ?" జాలితో అన్నాను.

నర్సు ఏదో మందు తాగించింది ఆమె చేత.

కృష్ణవేణి గొంతుకు ఓ పాడిదగ్గు దగ్గి సద్దుకుంది. నుదిటిమీద వేలితో రాసి చూపించింది. కళ్లు లోతుగా పోయాయి. రెప్పలు నల్లబడ్డాయి.

"ఆట్టే శ్రమ నియ్యకండి ఆవిడకి". అన్నారు డాక్టరు మూర్తి.

"అబ్బే! శ్రమ లేదు చెబుతా నుండండి" అంది కృష్ణవేణి కొంచెం వూపిరి తీసుకుంటూ. తలగడ చేతికింద పెట్టుకుని, దాని మీద ఆనుకుని మా ప్రక్కకి తిరిగింది.

నేను ముఖ పరిశీలన చెయ్యసాగానూ ఆవిడ చెప్పింది.

"అసలు ఆడవాళ్ల ప్రకృతే వేరు—మానసికంగా, శారీరకంగా. అది తెల్సుకుని ఆడవాళ్లుగాని, మగవాళ్లుగాని సరిగా ప్రవర్తించనప్పుడు ఇట్లాగే జరుగుతుంది. రైలు ఇంజనుపట్టాలను తప్పితే సరిచెయ్యొచ్చును. కాని, కాలుజారిన ఆడదిమళ్లీ ఆఅడుగుతియ్యలేదు. ఆ జీవితం ఇంక అంతే! అదీ నా అనుభవం.

నా కథ విన్నాక నన్నూ నిందించరు; మీరు నా భర్తనీ నిందించరు. మనం నివ

సించే దుర్భర సమాజ పరిస్థితుల్నీ, పరిస్థితుల్ని మార్చుకోడం తెలియని మన చాతకానితనాన్ని నిందించుకోవాలంతే!

"మీకు తెల్సు ఈవేళ ప్రపంచం ఎంత దుర్భిక్షంతో మండిపోతోందో. సామాన్య మానవుడు ఏదో గతిలేక బతుకుతున్నాడు. కాని జీవచ్ఛవంలా, జీవించడానికి కాదు; జీవితాన్ని ఆనందించడానికీ కాదు; చావలేక—నిజం అంతే!

"అదే మా కుటుంబాన్ని కూర్చింది. అసలే ఉద్యోగాలకీ, అభివృద్ధికీ ఎవరో దేవుళ్ళుండాలి. అలాంటిది రెండో యుద్ధం లోకానికి వేరే రోగం తెచ్చిపెట్టింది. అది అధికార మదాంధత—దానికి తోడు కామాంధత!

"అప్పుడు మిలిటరీలో పని చేసేవారు ఆయన. మేం ఎక్కడో బారక్సులో ఓ మూల సామాన్య కుటుంబంగా వుండేవాళ్ళం. ఎన్నేళ్ళు పనిచేసినా ఈయన ఉద్యోగంలో ఎదుగు కనపడలేదు. తక్కిన వాళ్ళు పెద్దపెద్ద జీతాలు పొంది అభివృద్ధి చెందసాగారు. నాకు ఏదీ అర్థంకాలేదు. ఎందుకని? ఆయనకు తెలివితేటలు లేకా? ఆయన్ని ఓ సారి అడిగాను. తల భూమిలోకు దించుకుపోయినట్టు అయి, ఆయన అన్నారు 'వాళ్ళు వాళ్ళ భార్యల్ని......' నాకు అర్థమైంది. 'బాబోయ్!' అరిచాను. కళ్ళు తిరిగాయి.

"కొన్ని రోజులు దొర్లిపోయాయి. ఆ చెడ్డమాట మర్చిపోయి సూటిగా మళ్ళీ బతక్కలిగాను. ఒక రోజు సాయంత్రం ఆయన కారులో వొచ్చారు. 'త్వరగా బట్టలు వేసుకో' అన్నారు. 'ఏం' అన్నాను. 'సినిమాకి పోదాం'. 'ఏం' కారుకూడా దొరికిందేం ఈవేళ?, 'అంతా వుందలే' అని నన్ను తొందరచేశారు. నేను నిజమనుకొని నమ్మాను; బయలుదేరాను.

"కారు ఓ ఇంటి ముందర ఆగింది. ఆయన దిగకుండా 'ఆ జవానుతో వెళ్ళు' అన్నారు. నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. 'నే వెళ్ళను' అన్నాను. 'నువ్వుకూడా నన్ను చంపు. మనం జీవితంలో ఇంకెప్పుడూ సుఖించొద్దూ' ఆయన ప్రార్థించి, కళ్ళనీళ్ళు తెచ్చుకున్నారు. ఏం చెయ్యను?....

"ఆ విదేశీయుడి చేతుల్లో మసైన నా శరీరాన్ని ఆ కారే మళ్ళీ మా యింటికి చేర్చింది. నేను నాలుగు రోజులు లేవలేదు. ఆయన హోటల్లో భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళి వొస్తూ వుండేవారు. కొన్నాళ్ళల్లో ఆయనకి వేరే పెద్ద ఉద్యోగం అయింది. మా జీవితం బాగుపడింది అనుకున్నాము. తక్కిన వాళ్ళలాగే, కళ్ళు మూసుకుని, సుఖంగా బతకొచ్చు ననుకున్నాం.

"కాని, ఆ ఆఫీసరు బదిలీ కావడం, కొత్త ఉద్యోగి ఈయన్ని కిందకిదించడం ఒకసారే జరిగాయి. అప్పుడు మాకు కలిగిన విచారానికి మేరలేదు. కాని కొత్త ఉద్యోగికూడా అదే మోస్తరవడంవల్ల నీచానికి మళ్ళీ వొడబడ్డాం.

"ఈసారి ఆయనకి టూరింగ్ ఉద్యోగం దొరికింది. పది పదిహేను రోజులు ఊళ్ళో ఉండేవారు కారు. ఒకసారి వరసగా రెండు నెల్లుండిపోయారు. అప్పుడు నేను వొంటరితనాన్ని భరించలేకపోయాను. అప్పటికే ముగ్గురు మనుషులు మారిన నాకు సిగ్గనేది పోయింది. మా యింటిప్రక్కన వున్న బ్రహ్మచారి నాకర్షించి ఆ రెండు నెల్లూ గడిపాను.

"తర్వాత భర్తవున్నా అంతే. మా యింటికి వొచ్చిన అతిథులు నా ఆతిథ్యం స్వీకరించనివారెవరూ లేరు—మీరు తప్ప. మొదట ఆయన చచ్చేలా పోరారు. కాని, అప్పట్లో నన్ను ఎవరూ ఆపలేకపోదురు. అంతకీ కావాలంటె ఆయన్నించి విడిపోడానికి కూడా సిద్ధమయ్యాను. అందుకనే ఆయన పెదవి కదపలేదు.

"ఒకసారి ఎవరో మిత్రుడు వొస్తే ఆయన వొద్దన్నా-రచ్చకెవ్వద్దన్నా-సినిమాలకీ, వాటికీ తిరిగాను; ఆయనతో హోటల్లో కొన్ని రోజులు గడిపాను. వారం అయ్యాక ఇంటికి వొస్తే ఆయన లేరు. ఆయన జాడ ఇప్పటికీ తెలీలేదు.

"ఉన్న నగలూ, సామానులూ అమ్మి ఇన్నాళ్ళు బతికాను. నాలుగు రోజుల్నించి ఓ టాంగావాడు......" చిరునవ్వు నవ్వి పమిట తీసింది. వక్షం నిండా కొరుకులు, రక్కులు......మళ్ళీ వెంటనే కప్పుకుంది.

"చలంగారి మైదానం చదివావా?"

"లేదు; ఏం?"

"ఏం లేదు. అది మైదానం—కాని ఇది పట్నవాసం! మైదానం కాదు........" అంది వొగురుస్తూ వెనక్కి తిరిగి పడుకుంది.

పెద్ద దగ్గు తెర వొచ్చి ఐదు నిమిషాలు ముంచెత్తింది. కళ్ళతో నన్ను చూస్తూ, వెడతానన్నట్టు సంజ్ఞ చేసింది. తర్వాత జోడించిన చేతులు అల్లాగే వున్నాయి. కళ్ళు ముయ్యబడలేదు.


"ఎలాగా బ్రతకదు. కాని ఇప్పుడు మన శాంతి లభించి, సుఖంగా పోయుంటాయి జీవాలు" అన్నారు డాక్టరు మూర్తి గుడ్డని ముఖంమీద కప్పుతూ.

నేను లేచి చేతులు జోడించాను ప్రతి నమస్కారం చేస్తూ; కళ్ళనుండి రెండు నీటి చుక్కలు నేలమీద పడ్డాయి.


"నా కథ విన్నాక నన్ను నిందించరు, మీరు నా భర్తనీ నిందించరు. మనం నివసించే దుర్భర సమాజ పరిస్థితుల్నీ, పరిస్థితుల్ని మార్చుకోవడం తెలియని మన చాతకాని తనాన్ని నిందించుకోవాలంతే..."

ఆవిడ చెప్పిన మాటలు చెవిలో ప్రతిధ్వనించసాగాయి. ★


SPLENDID SELECTION
MADE IN FAMOUS SWISS FACTORIES
EACH GTD. FIVE YEARS




5JEWELS CHROME 30/- ROLLED GOLD 33/-
7JEWELS CHROME 35/- SUPERIOR 38/-
15 JEWELS " 44/- ROLLED GOLD 48/-




5JEWELS CHROME 28/- ROLLED GOLD 33/-
7JEWELS CHRME 33/- SUPERIOR 35/-
15 JEWELS " 42/- ROLLED GOLD 45/-



FULLY JEWELLED 19/- SUPERIOR 21/-
WITH RADIUM 21/- CENTRE SECOND 23/-
SPECIAL HIGH CLASS MACHINE 27/



5JEWELS CHROME 26/- ROLLED GOLD 32/-
7JEWELS CHROME 32/- ROLLED GOLD 36/-
15JEWELS " 48/- ROLLED GOLD 58/-



5JEWELS CHROME 22/- SUPERIOR 25/-
5 " ROLLED GOLD 30/- SUPIRIOR 33/-
15 " CHROME - 45/- ROLLED GOLD 55/-
TIME PIECE - 20/- SUPERIOR 25/-
POCKET WATCH 12/- SUPERIOR 15/-
Postage extra Free on order for two
H. DAVID & CO.
POST BOX NO 11424 CALCUTTA



ఉత్తరాలు సరిగా అందటం లేదు. ఎవరో కుఱ్ఱవాళ్లు కవర్లు చింపి వేస్తున్నారు. 'పోస్టుమన్'నే ఏ క్లాసుకి ఆ క్లాసుకొచ్చి ఇవ్వమనండి. లేదా ఉత్తరాలు ప్యూన్ ద్వారా క్లాసుకు పంపండి." అని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అయ్యవారికి నామీద కరుణ కలుగలేదు.

"ఇవాళ కూడా నాకు చేరవలసిన కవరు చింపబడే ఉంటుంద"నుకుంటూ లెటర్స్ రూము పక్కనే ఉన్న కిటికీదగ్గరకి పోతున్నాను.

అక్కడ ఎవరో కుఱ్ఱాడు కవరు పదిలంగా చించి చదువుతున్నాడు ఓ ఉత్తరం. అతని చేతిలో ఉన్న ఖాళీ కవరు మీద నా అడ్రసు ఉంది. ఊచిపుచ్చుకు దవడ మీద కొడదామన్నంత కోపం వచ్చింది. కాని ఏం లాభం? 'ఉఫ్' అంటే ఎగిరి ఊరంతా తిరిగిరాగల బలవంతుడ్ని. కాబట్టే కాస్త తగ్గి ఊరుకున్నాను.

కాని ఎంతకాలమిట్లా? ఇతరు ఉత్తరాలు చూడటమంటే వీళ్లకింత ఉబలాటం ఎందుకో?

మెదలకుండా దగ్గరికెళ్లి మర్యాదగా అడిగాను. "ఆ ఉత్తరం నాదే ఇలా ఇవ్వండి." అని.

అతను నన్ను నఖశిఖపర్యంతం చూసి "నీదేనా?" అన్నట్టు ఎగతాళిగా నవ్వి ఉత్తరం ఇచ్చేసి వెళ్లిపోయాడు.

మళ్లా ఓ రోజు ఇలాగే జరిగింది... ఒక రోజేమిటి మళ్లా మళ్లా ఇలాగే జరుగుతోంది..., ఇంకా ఊరుకుంటే ఎప్పుడూ ఇలాగే జరుగుతుంది కూడా.

ఒకనాడు ఇలాగే జరగటం వల్ల వచ్చిన కోపం అణుచుకోలేక హెడ్మాస్టర్ దగ్గరకెళ్లి అడిగాను. ఆయన నే చెప్పేది సరిగా వినిపించుకోకుండానే "నాన్సెన్స్, క్లాసుక్లాసుకీ 'పోస్టుమన్' ఎందుకు తిరుగుతాడు? మీ అందరికీ ఉత్తరాలందించటమేనా 'ప్యూను' పని?" అంటూ బయటికి గెంటాడు.

ఏదైనా ఉపాయం చూడకపోతే ఇక లాభంలేదనుకొని ఆ రోజు ఆలోచన కుపక్రమించాను.

ఒకరోజు మామూలుకంటే కాస్త త్వరగా వెళ్ళాను స్కూలుకి. ఎప్పటి మాదిరిగానే ఆ కుఱ్ఱాడు కూడా ప్రత్యక్షమయ్యాడు ఉత్తరాల దగ్గరికి.

చాటంత ముఖం చేసుకొని, చారడేసి కళ్ళతో చదువుతున్నాడు నా అడ్రసుకొచ్చిన ఉత్తరాన్ని. అతనికి ఆనందం పట్టపగ్గాలు లేకుండా ఉన్నట్టుంది. ఇరవై అయిదుపళ్లూ శుభ్రంగా కనబడుతున్నాయి— సాధారణంగా పిల్లలికి ఇరవై నాలుగు పళ్లే ఉంటాయని నేను చదువుకున్నాను. కాని ఇతనికి ఒక పన్ను మీద మరో పన్నుండటం వల్ల ఇరవై అయిదు పళ్లన వలసివచ్చింది—

ప్రతిసారి ఉత్తరం చదివి మళ్ళీ కవరులో పెట్టేసే ఆ కుఱ్ఱవాడు ఈసారి ఉత్తరం మడిచి జేబులో పెట్టుకో బోతున్నాడు. ఇక మర్యాద దక్కదని నేను ముందుకెళ్లి చెయి చాచి ఆ ఉత్తరాన్ని యాచించాను.

ఆ కుఱ్ఱాడు నావంక మామూలుకన్న మరింత హేళనగా చూసి ఉత్తరం నాకిచ్చి వెళ్లిపోయాడు.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది.

ప్రియ ప్రకాశ్‌కు,

"అహో! అనవద్యాంగా!" మీ వలపుల చిలక మీకై పలువరించగా ఆమె పలువలు వలనుండి వెలువడిన ఈ పలుకులు తలపున నిడుకొన వేడుచున్న,

మీ అనవద్యాంగియగు
ప్రేయసి ప్రమీల

రెండు రోజులు గడిచాయి. ఈ రెండు రోజులలోనూ నేను కనబడినప్పుడల్లా ఆ పిల్లవాడు నావంక వింతమృగాన్ని చూసినట్టు చూశాడు.

(14-వ పేజీ చూడుడు)

గ్యారంటీ చికిత్స
వీర్యవృద్ధి బలం కల్గించి, నపుంసకత్వం పోగొట్టుటకు 45 సం॥ల జగత్ప్రఖ్యాతి గాంచిన సంస్థ.
డాక్టర్ రత్నం సన్స్
మలక .. బిల్డింగ్స్, హైద్రాబాదు.

కథానిక:

రుధిరపూజ

త్రిలోకేశ్వరుడి ఆలయం !

విశ్వకర్మ ఎనలేని ప్రయాసకోర్చి తనే స్వతః కట్టాడట.

ఎవరో సూర్యవంశ చక్రవర్తి పరిపాలనలో హనుమంతుడే ఆ మందిరానికి రాళ్లు మోశాడని ప్రతీతి.

చరిత్రకారులు : "యీ ఆలయం 'కిరాతుల' చేత కట్టబడింది. యీ దేవత కిరాతులది" అన్నారు. ప్రజ లిలా అనుకొంటూండడం పరిపాటి.

ఒకసారి మహాయుద్ధంలో ఆ దేశం అపజయం పొందింది. ఆలయం నాల్గుగోడలు యథేచ్ఛగా మానవ రుధిరంతో చిందులాట జరిపించుకున్నాయ్... దేవతకు క్రొత్త నామకరణం క్రొత్త ఆవరణలో ప్రతిష్ఠాపన జరిగి తిరిగి జీవకళ దక్కించుకున్నారు.

ఏళ్ల తరబడి ఏ ఒడిదుడుకూ లేకుండా ప్రశాంతంగా ప్రవహిస్తూన్న భక్తివాహిని నేటినించి మరో దిక్కుకు మరల సాగింది!

'కిరాతులు' అంటరానివా రైరి, నెల యేటి ఎదురు గట్టున దూరంలో అతిదూరంలో- వారి కొంపలు. వారి హృదయాంతరాళాల్లో భక్తిప్రభావం ప్రచ్ఛన్నంగా దాగుంది. కానైతే వారికోసం ప్రత్యేకంగా ఆలయాలు వున్నవి కావు. భగవన్నామస్మరణ - భజన యిత్యాది భగవత్కైంకర్య సాధకము లన్నీ వారికి వుగ్గుపాలతోనే, అలవడినవే. అయితే నలుగురెదుటా నుడవటానికి నాలిక లేదు. కృష్ణశిలలో తమ పని తన మూలకంగా జీవకళను సర్వోత్కృష్టంగా నింపడం వాళ్లకు తెలుసు. కాని పాలకవర్గంమాత్రం వారు కారు.

శుచిగా శుభ్రంగా వుండడానికి వారి కాస్పదం లేదు. పుస్తకాల్లోంచి శ్రమకోర్చి జ్ఞాన మార్జించుకోడానికి వారి కధికారం లేదు.

పశ్చిమదిక్కులో త్రిలోకేశ్వరుడి బంగారుప్రతిమ ముఖభాగం ధగధగమని కాంతు లీనుతోంది. దానినుంచి దూరంగా- అతిదూరంగా తప్పుకు నిల్చుని దర్శనం చేసుకోవాలి. మనస్సులో-- మౌనంగా శిరస్సువొంచి ధ్యానించడానికి మాత్రం వారి కధికారముంది. యీ అధికారాన్ని ఎవరూ ఆక్షేపించలేరు కదా!

ఆలయంలో దిక్కులు పిక్కటిల్లేటట్లుగా పెద్ద గంటలు - ఢంకాలు - నగారా నౌబతులు మ్రోగుతున్నాయి.

దారిపొడుగునా ఇరుప్రక్కల వివిధ వస్తు సామ్రగి నమ్ముతూన్న అంగళ్లు.

వినేవారు పురాణ శ్లోకాలను భక్తి ప్రపత్తితో వింటూన్నారు. మరోచోట సంకీర్తన జరుగుతోంది గుంపుగా.

కాకి బంగారంలా తెల్లగా మెరిసే దుస్తులతో అలంకరించుకున్న రాజభటులు ఆలయం చుట్టూ కాపలాలో వుంటున్నారు.

ముందు ముందు మంగళవాయిద్యాలు. వెనుకనించి కళ్లు మిఱుమిట్లుగొలిపే శృంగారవిహారంతో, అత్యంత విజృంభణతో ఏనుగులమీద వరుసబారి సాగివస్తూన్నారు రాజకుటుంబం వారంతా.

ఎక్కడా జన సమూహం; ఒకటే గోల.

భక్తుల నోటినుండి 'జై త్రిలోకేశ్వరా' అంటూ వెలువడుతూన్న నినాదం అక్కడి గాలిలో పూర్తిగా విలీనమైపోయి, మరికొద్ది దూరందాకా ప్రసరింపబడుతోంది.

రేపు చతుర్దశి రోజు. రాజుగారు 'శుభపూజ' నాంది హారతు లివ్వడంకోసం ఎంతో వైభవంతో - ఉత్సాహంతో పట్టపు టేనుగుపై ఆసీనులై తరలి వొస్తూన్నారు. అందుకోసమే ఆ దోవ కిరుప్రక్కల పచ్చటి తోరణాలు కట్టేరు. ముచ్చటగా సింగారించారు.

త్రయోదశి మొదటి ఝాము హారతి సూచిస్తూ ఆలయంలోని గంటానాదం వినబడింది. ఢంకా మ్రోగింది.

ఇవ్వాళ చంద్రుడి మొహంలో ఔదాసీన్యత!

* * *

మసక మసకగావున్న వెన్నెల.

మౌనం—భీకర మౌనం!

ఒక్క ఆకు కూడా కదలాడిన శబ్దం లేదు.

గాలి అంతకంటే మౌనంగా వుంది.

ఆకాశంలో దట్టంగా మంచు కప్పుకుంది. ఏ కారణం లేకుండా వీధి కుక్కలు మొర్రో మని ఏడుస్తున్నాయి.

కానరాని దిక్కువంకకు చెవులు నిక్కపొడుచుకుని ఏవిటోగాని వింటున్నాయి——గుఱ్ఱాలు.

ఒక్కసారి అనుకోని విధంగా భూమి అంతర్భాగంలో భయానకమైన—భీకరమైన శబ్దం వినిపించింది. పాతాళలోకంలోని నాగ సంతతంతా భయంకర రణగుణ ధ్వని చేస్తున్నట్లు!—విజయభేరీ మ్రోగిస్తూన్నట్లు!

భూమి 'ఫెడీ' మన్న కఠోరశబ్దంతో పగిలింది. గడ-గడ శబ్దం—బహు వ్యాప్తమయ్యింది. కాళ్లు కట్టి బంధించిన ఏనుగ, గొలుసును ముక్కలుచేసి తెలియని దిక్కువైపు పిచ్చిగా వురక లెత్తింది.

భూకంపం!

జనసమూహ మంతా తండోపతండంగా ప్రాణదేవుని—జీవం రక్షించమని అర్థిస్తూ - అర్థంలేని అఱపుల నరచుకుంటూ ఎక్కడికో, ఎటువైపో వెఱ్రిగా పరుగెత్తుతున్నారు. యీ సమయంలో హెచ్చుతగ్గు స్థాయిపట్లకాని - మానావమానాలగురించిన ఆలోచన్లుగాని లేవిక—

అడుగున నిప్పులు గ్రక్కుకుంటున్న భూమిపైన దట్టమైన పొగ!

భూమి చారలు చారలుగా విడిపోయి వేడినీళ్ల ప్రవాహాలు వరదల్లా కొట్టుకు వస్తున్నాయి.

గట్లు తెగి చెఱువుల్లోని నీళ్లు నిమిషంలో మాయమైపోతే చెఱువులు కానరాని ఎన్నో చోట్ల చెఱువు లేర్పడ్డాయి!

ఆలయం నగారా ఖానలోని పెద్ద గంట తనంతట తనే కొట్టుకుంటూంది ఢణ్ ! ఢణ్ !!

నైసర్గిక రౌద్రావతారం మెల్లిమెల్లిగా శాంతత కొస్తూంటే ఢమం ఢమం అన్న విపరీతశబ్దం - కర్ణకఠోరమైన శబ్దం-మరోమారు వినవచ్చింది

భూమిమ్మీద మళ్లీ చల్లగాలి వీచేటప్పటికి చంద్రుడు పశ్చిమాంబుధివైపు తరలిపోతూన్నాడు. అగ్నిదేవుడి కాహుతై భగభగ మండిపోతున్న ఇళ్లనించి ఎగబ్రాకే దట్టమైన పొగ ఆ చంద్రుడి చుట్టూ ఆవరించుకుంది.

రెండోరోజు ఊరు చావుస్థితిలో వుంది- ప్రజల కనుకొలకుల్లోంచి- దుఃఖమూ- నిరాశా- భీతీ తొంగిచూస్తున్నాయి.

అనుసరణ:
శ్రీ కొంకనహారు శేషగిరి

రాజభటులు ఆలయం పహారాకోసం బయలుదేరారు. వారివెంబడే ఆలయప్రాంగణం శుద్ధిచేయడంకోసం- పవిత్ర పరచడంకోసం- గంగాజలంతో నిండిన కడవ లెన్నో-

రాజు- మంత్రి- ధురంధురుడైన జ్యోతిష్కుడు-ధర్మశాస్త్రపారంగతులైన పేరుమోసిన పండిత శ్రేష్ఠులు - ఎందరో బయల్దేరి వెళ్లేరు ...

అయితే...!

ఆలయప్రాంగణ మంతా కూడా- జీర్ణభూతమైపోయింది. గోడలన్నీ నేలమట్టమై —పైభాగం దేవతామూర్తిమీద అలా కృంగి పడిపోయింది.

"వొచ్చే పూర్ణిమ నాటి కల్లా సంస్కారం కావాలి. కాకపోతే దేవత కుపితురాలై మూర్తిని వదిలి వెళ్లిపోగలదు!" పండిత శ్రేష్ఠులన్నారు.

స్థిరపరుస్తూ రాజాజ్ఞ బయటపడింది... మంత్రి గుండెలు కొట్టుకోడం ఆగిపోయింది.

"జాతి పని 'కిరాతుల'కు తప్ప మరొకరి వల్ల కాదు. అందుచేత వారిని ఆ కార్యంకోసం నియోగించినపుడు వారి అపవిత్ర దృష్టినుండి మూర్తిని సంరక్షించడం ఓ సమస్య. దేవతామూర్తి పావిత్ర్యం మట్టిపాలైతే అలయసంస్కారంనుంచి కలిగే లాభంకూడా శూన్యమే!"

రాజాజ్ఞ ప్రకారంగా మాధు-'కిరాతుల' గుంపుకు ప్రముఖుడు - సన్నిధిలో హాజరయ్యాడు. మలినమైన పంచె- చిరిగి జీర్ణావస్థలోవున్న చొక్కా- చిరుగుల్లో స్పష్టంగా అవుపించే ఉక్కు శరీరం— వయః పరిపాకానికి తగినరీతిముదరి వేలబడిన చర్మం. దైన్యతను సూచించే—సూర్య చక్రముల్లాంటి—ఆ రెండుకళ్లూ!

విశేషగౌరవంతో తనుపట్టుకొచ్చిన ఫలపుష్పాలను సన్నిధిపాదాల కర్పిస్తూ - దూరంగా సన్నిధినోటంబడి వెలువడే ఆజ్ఞకోసం చెవులు నిక్కపొడుచుకుని వింటూ నిల్చున్నాడు.

"మాధు! నిన్ను తప్పించి దేవాలయ సంస్కారం జరగడం దుస్సాధ్యం."

"దేవత మూర్తి కరుణా కటాక్షం, ప్రభూ!" అంటూంటే ఉప్పొంగివొస్తూన్న భక్తిభావం తనలో యిముడ్చుకోలేక వొణుకుతూన్న చేతులెత్తి దేవతకు దండంపెట్టాడు మాధు!

"దేవత విగ్రహంమీద నీ దృష్టిగాని పడకూడదు. అపవిత్రమనకూడదు. అంచేత కళ్లు గట్టిగా మూసుకునే పని పూరించాలి... సాధ్యమేనా?"

"ఆజ్ఞ మహాప్రభూ! పని పూర్తయ్యేదాకా కూడా కళ్ళు తెరవను, మూర్తిని చూడను."

ఆలయం బహిరావరణలో మాధు తన పనిలో నిమగ్నుడై వున్నాడు. నాల్గుగజాలదూరంలో మరికొందరు మనుషులుకూచుని రాళ్ళను వివిధాకారాల్లోకి చెక్కుతున్నారు.

మాధు కళ్లమీదుగా కాస్తకూడా దృష్టి అగపడనట్లు బిగువుగా గంతకట్టేశారు: రాత్రింబగళ్లు ఆ ఆలయమే మాధు నివాసస్థానం!

చేతులు 'స్వామికార్యం' చేస్తూంటే మనస్సుభక్తిప్రఫుల్లితమై ఆ దేవత నిజస్వరూపంవద్ద నిజలోకంలో స్వైర విహారం చేస్తోంది. ఇటు రాజభటుల తొందర త్వరగా, అతిత్వరగా చేతిలోని కార్యం పూర్తి చేసేందుకుగాను అంతింతని కాదు.

అది'పరాత్పరుడి' కార్యావసరం!అతని కార్యాన్ని 'అతనే' చక్కబరచుకుంటాడు. అలస్యం కూడా లేకుండానే. నేను నిమిత్తమాత్రుణ్ణి. అని మృదువుగా మెల్లని కంఠంతో జవాబిస్తున్నాడు మాధు. వెన్నెలరాత్రిళ్లు సాగిపోయి యిప్పుడా స్థానాన్ని అమావాస్యానిశి గాఢాంధకారం ఆవరించుకుంది.

మాధు తన కార్యంలో నిమగ్నుడై తల్లీనుడై పోయాడు. దగ్గర ఎవ్వరూ లేరు. రాతితో మాట్లాడాలి. ఆ రాయి కనికరించి పలికి జవాబివ్వాలి...సమీపంలో, పహారా తిరిగేవ్యక్తి.

పూజారి పరుగిడుకుంటూ వొచ్చాడు.. "రేపటిరోజు ఏకాదశి, 'శుభప్రదమంచిరోజు. అసలు సుముహూర్తం వుంది. ఆ లోపుగా నీపని పూర్తవగలదా మాధూ"

"చెప్పడానికి నే నెంతటివాణ్ణి గురువుగారూ? దేవుడి కటాక్షమైనప్పుడు తనే పూర్తికాకుండా వుండగలదా? అలా ఎంత తీవ్రంగా ముగిసిపోతే అప్పుడే కబురంపించగలను..."

రోజు దొర్లింది—

ఏకాదశి తెల్లవారు మొదటి ఝాము... దేవాలయం తలుపుచాటునించి చంద్రుడి చల్లటి వెండికిరణాలు మాధు తెల్లటి వెండి జుత్తుమీద పడి దోబూచులాడుతున్నయి. పింగారబోసినట్లు దట్టమైన చంద్రకాంతి..



1 తులము టిన్నులలో అన్నిచోట్ల దొరుకును.

శ్రీ అంబాళ్ అండు కంపెని,

తపాలు పెట్టె నెం. 3. మదరాసు.

మాధు ఒక దీర్ఘనిశ్వాసం వదిలి, పహరా వాడితో "వెళ్లండి, మాధు చేగొన్నపనీ, సంపూర్తయ్యిందని కబురుచేసిరాండయ్యా, శుభ లగ్నం కొస్త దాటిపోకూడదు, ఉస్."

పహరావాడు వెళ్లిపోయాడు. మాధు యిహ తనలోని భక్తిభావోద్రేకాన్ని అణచుకోలేక పోయాడు. పహరావాడు వెళ్ళిపోయాడు. అదే తడవుగా కళ్ళకు కట్టిన గంతను ఒక్కసారిగా ఒక్క విసురుతో విప్పితీసేశాడు... హాయిగొలిపే ఆ వెన్నెల దేవతా విగ్రహం ప్రసన్నవదనం మీద ఛాయలుగా పడుతూంటే ఆ మనమోహన దృశ్యాన్ని పరికించడానికి మాధుకు వున్న ఆ రెండుకళ్ళు చాల్లేదు!

తన్మయత్వంలో మరో లోకంలో దేవతా శక్తి పాదద్వయంముందు తనహృదయం కల్మషమెరుగని పసిపిల్లాడి హృదయం అర్పించుకున్నాడు. అదీ నిజమైన హృదయార్పణ! కళ్ళనించి ధారాపాతంగా నీళ్ళు ప్రవహిస్తూన్నాయి. ఆనందబాష్పాలు... దేవతాశక్తిమీద పరమపవిత్ర "ప్రేమ" మయ సద్భావఫలిత పరమానంద బాష్పాలు.

ఈ క్షణం జీవితంలో మరువరానిది. దీర్ఘకాలంగా సతమతమవుతున్న ఓ సద్భక్తునికి భక్తబాంధవుడు దర్శనభాగ్యాన్ని సమకూర్చేడు దీర్ఘకాలానికి.

ఆ తన్మయత్వం మహారాజు ఆలయం వైపు వేగిరంగా పరువులెత్తిరావటం ఎరగడు! కోపం మితిమీరింది. ఆజ్ఞధిక్కరణ! శాసనోల్లంఘన!!

రాజుగారి ఒడిలోని రత్నఖచిత ఖడ్గం ఒక్కసారి ఝుళిపించింది—చంద్రకాంతిలో జిగేలుమని మెఱుపులా మెరిసింది. ఒకే ఒక్క వ్రేటు అంతే! మాధు శిరస్సు మొండెంనుండి వేరైపోయింది. వేడివేడి రుధిరం పొంగుతూ వొచ్చి నాల్గుదిశలకు చిమ్మింది.

ఇదే ఆ 'శుభపూజ' అంతిమ పరిణామం. మాధుఆయువుపట్టులోంచి పొంగిన ఆరక్తం దేవత చరణాలను అంటకపోలేదు. పాదద్వయాలనుకూడా ఎఱ్ఱగా మెరిసేట్లు చక్కగా కడిగాయి. అదే రుధిరపూజ!!

★

ఉత్తరాలు

(11-వ పేజీ తరువాయి)

మూడో రోజు స్కూలుకి పెందరాళే వెళ్లాను. అప్పటికే ఆకుర్రాడు వచ్చాడు. అతనూ అప్పుడే వచ్చాడు కాబోలు నా అడ్రసుగల కవరు కనబడినట్టుంది. చకచకా పోయి మహా ఆత్రంతో కవరు చింపాడు.

నే నతనికి కనబడకుండా పక్కనే ఉన్న గోడచాటున దాక్కున్నాను. అతను నన్ను గమనించలేదు.

కొంతసేపటికి ఆ ఉత్తరం అతను చదవటం పూర్తవగానే నేనక్కడికి కెళ్లాను. ఆకుర్రాడు కవరుమీద ఉన్న పోస్టుముద్రని తీక్షణంగా చూస్తున్నాడు. అతని మొహం వాడి ఉంది.

నే వెళ్లటంతోటే అతను ఒక్కసారి నా మొహంలోకి చూసి తలదించుకున్నాడు. ఆక్షణంలో అతనికి నామొహంలో ఏం కనబడ్డదో గాని అసలే వాడిపోయిన అతని ముఖం నల్లగా మాడి ఉండటం నేను గమనించాను.

అతను మెల్లగా లేచి నేనడగకుండానే ఉత్తరం నాచేతి కిచ్చి బరువుగా పెద్దపెద్ద అంగలు వేస్తూ వెళ్లి పోయాడు.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది.

మిత్రునికి,

మీ క్షేమంకోరి ఈ ఉత్తరం రాస్తున్న నన్ను క్షమించ ప్రార్థన.

ఈమధ్య నాకొక లేఖ వచ్చింది. నేను ఈ సంవత్సరం పరీక్షలో కృతార్థుడ నవవలెనంటే దేవుని పేరు తల్చుకొని పన్నెండు కవర్లలో, పన్నెండుగురికి, పన్నెండు లేఖలు వ్రాయవలయునని నాకు చేరిన లేఖలో ఉన్నది. (పేరు తెలియజేయకూడదు.)

ఇంకొక సంగతి. ఈ నా ఉత్తరం చదివినవారు తలకొక పన్నెండు లేఖల చొప్పున పన్నెండుగురికి తమ పేర్లు తెలియపరచకుండా పన్నెండు కవర్లలో లేఖలు పంపవలయునని ఉన్నది.

అట్లు చేయనివారు పరీక్షలలో కృతార్థులవకపోవటమే గాక వారి జీవితమంతయు కష్టముల పాలయ్యెదరని నాకు చేరిన లేఖలో ఉన్నది.

ఇట్లు,
మీ మిత్రుడు

తర్వాత ఓ వారం రోజులకి నాకు మరో ఉత్తరం వచ్చింది. కాని ఆ ఉత్తరం చింపబడి ఉండలేదు. సాధారణంగా నా ఉత్తరాలు చించే కుర్రవాడు అక్కడే వరండాలో కూచుని ఉన్నాడు.

నేను ఉత్తరం తీసుకుని అతనిదగ్గర కెళ్లి నవ్వుతూ, "ఈ ఉత్తరంలో ఏముందో కాస్త చూసి చెప్పండి." అన్నాను.

అతను ముఖం చిట్లించుకుని "ఇప్పటికే రూపాయిన్నర చిలుంవొదిలింది చాలదూ?" అన్నాడు.

అప్పుడే కాదు తర్వాత మరెప్పుడన్నా సరే నేను కనబడినప్పుడల్లా ఆకుర్రాడి ముఖం ముకుళించుకునేది.

అది మొదలు తర్వాత మరెప్పుడూ నా పేర వచ్చిన కవర్లు చింపబడి ఉండలేదు.

★

రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్లవెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు 100 బహుమానం. పూర్ణ విశ్వాసానికి అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.

Bharat Kalyan Aushadhalaya.
Post Bag No 6725, Calcutta. (A P)

ఆస్పత్రి నర్సు:— మీరు ఆలస్యంగా వచ్చారు. సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకి మీ భార్య కవలపిల్లల్ని కన్నది.

భర్త:— బతికిపోయాను. రెండు గంటలవేళ గనక ఇద్దరు పిల్లలతో సరిపోయింది. పన్నెండు గంటలప్పుడయితే......?

కథానిక:

గంగవెర్రులు

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

"అమ్మాయీ! చెప్పినమాట చక్కగా విను! అదీగాక నీకే తెలుసుకదా! నీఅంతట నువ్వే చూస్తున్నావు కదా, ఎన్ని సంబంధాలు వచ్చి పోతున్నాయో! ఎల్లకాలం మనవెంట తిరుగుతారనుకొన్నావా! పెళ్లి సంబంధాలు కూడ ఒక ఋతువు లాంటివే! ఎన్ని సంబంధాలు వచ్చినా ఆ అదనప్పుడే వస్తాయి కాని అది దాటిపోయిందంటే 'బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా' అన్న సామెతే అనుకో! ఈ యౌవ్వనం, ఈ పొగరు ఇవి శాశ్వతం కాదు మనకి! కాస్త దూరంగా ఆలోచిస్తే గాని మనిషి బాగుపడడు" అన్నాడు వరాహగిరి తన కూతురితో.

వరాహగిరి బ్రాహ్మణుడై పుట్టి వ్యాపారంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. అతను జవుళివ్యాపారం చేస్తాడు. జార్జిటౌన్ కాపురస్థలం. ముందుభాగం అంగడి, వెనుకభాగం కాపురముండే ఇల్లు. అతను చామంచాయగా ఉంటాడు. కుమార్తె పేరు సుకేశిని. ఆమె క్వీన్స్ మేరీ కాలేజీలో ఇంటర్ చదువుతూండేది. క్రమంగా చదువుమీద శ్రద్ధ సన్నగిలి, సంసార ప్రపంచ దృష్టి పెరగగా, చదువు మానిపించి వేసి తండ్రీ, కుమార్తెయొక్క పెళ్లికోసం తొందర పడుతున్నాడు. ఆమె చిన్నప్పుడు స్ఫోటకం పడడంచేత కొంత అందవికారంగా కనబడుతుంది. ఆస్తిపరుడు కనుక డబ్బు పోసేస్తాడనుకోండి! అందచందాలు గావలసిన యువకుల పరీక్షకేమి ఆగుతుంది.

కాబట్టి ఆమె పెళ్లి తండ్రికొక సమస్య అయిపోయింది. ఆమె మట్టుకు తాను అందవికారంగా ఉన్నానని ఎప్పుడూ అనుకోలేదు. తన కంటికి అదొక లోపంగానే కనపడలేదు. "ఏముంది. ముఖంపొడి మరొక పూత పూసి వేసేనంటే ఎవడితరం పట్టుకోడానికి!" అని అనుకొంటూంటుంది. తండ్రి అయినా అంత వెర్రిబాగులుగా పిల్లని ఎవరి ఎదుటా పెట్టడు! మునిమాపువేళ బార్ లైట్ల వెలుగులో జిగేలు జిగేలుమనిపిస్తాడు. ఏదైనా గుడ్డలవ్యాపారస్తుడు చేయవలసిన పనికదా అది! కాని ఎంత చేసినా, సహజవికారం ఆఖరికేనా బట్టబయలు కాక మానదు.

వరాహగిరి చెప్పిన మాటలు సుకేశిని బాగా వింది. అతను వట్టి అజ్ఞాని అని అతనిని గురించి ఆమెయొక్క భావముద్ర. ఆయనయొక్క ఇప్పటి పలుకులు ఆలకించగా ఆ భావం మరింత బలపడింది. కాని తండ్రిని ఎదిరించి జవాబు చెప్పలేదు. కనక "నేను ఎవరిని ఎంచేసేనేమిటి!" అని వట్టి అమాయకురాలిలాగు అంది.

"కిందటిసారి వచ్చిన కుర్రవాడిని నువ్వు వద్దనలేదమ్మా!" అన్నాడు తండ్రి కొంచెం గొంతుక బిగబట్టి.

"వాడు నా బుజాలదగ్గరకేనా రాడు. వాడి మొహం మండా! వాడికి పెళ్లేమిటి!" అంది.

"సరే! లోకంలో పొట్టి మొగుళ్లు, పొడుగు పెళ్ళాలు? పొట్టి పెళ్ళాలు పొడుగు మొగుళ్లు లేరంటావు? అదేనా నీ ఉద్దేశం? కాస్త చదువుకొన్నదానివి కదా! సరే! అయిపోయిం దేదో అయిపోయింది! ఇప్పుడు దాని గొడవ ఎందుకు! ఆ కిందటి సారి వచ్చిన యువకుడి మాట ఏమిటి?" అన్నాడు తండ్రి.

"వాడా! ఆ నల్ల యముడు! వాడి నెవరు పెళ్లాడుతారమ్మా, ప్రారబ్ధం కాకపోతే!" అని అసహ్యించుకొంది.

"సరే! అయితే వాడికిముందు వచ్చిన అతని సంగతో?"

"ఆ బోండంగాడా!" అని పకపక నవ్వింది.

"దేనికి దానికి ఏదో ఒక టొంపు ఎంచుతూ ఉంటావు! మా కాలంలో ఈ ఎంపుళ్లు గింపుళ్లు ఎరగం. పెద్దవాళ్లేవళ్లనో ఒకళ్లని చూసి ముడిపెట్టడం. అంతే! అయిపోయింది! ఈ కాలపు చిన్నవాళ్లతో వచ్చిన అల్లరే ఇది! వాళ్లకి తెలియదు; ఒకళ్లు చెప్పితే వినరు!"

తండ్రి మాటలు సుకేశిని జాగ్రత్తగా వింటూంది.

"ఇదంతా ఎందుకు చెప్పతున్నానో తెలుసా? మరొక అబ్బాయి వచ్చి చూసుకొంటాడని నిన్న మా స్నేహితుడు ఒక అతను వచ్చి చెప్పాడు. ఈమాటు వచ్చే సంబంధమేనా పాడుచేసుకోకని నేను ఉపదేశించడం. బహుశః ఆ కుర్రవాడు ఈ రోజే రావచ్చు. అందుచేత మనం సిద్ధంగా ఉండాలి" అన్నాడు.

"ఆయన పేరు?" అంది కూతురు ముసి ముసి నవ్వులతో.

"చంద్రశేఖర శాస్త్రి."

"మనిషి ఎలా గుంటాడో!"

"నేను చూసేనా, పెట్టేనా?" అన్నాడు తండ్రి గట్టిగా.

సుకేశిని అలంకరణవిషయమై ఆదుర్దా పడుతూ వెళిపోయింది. వరాహగిరి వ్యాపార విషయమై అవతలకి వెళ్ళాడు.

ఆమె ప్రత్యేకంగా అలంకరించుకొంది. మూడు రంగుల దక్షిణాదిపట్టుచీరె, చీరెకి అనుగుణమైన పట్టు రవిక! మెడలో ఒక ముత్యాలహారం వేసుకొంది. వాసన నూనె, వాలుజడ. చదువుకొన్న యువతికనుక షోకు కళ్లజోడు ధరించింది. అనుక్షణం సంబంధ యువకుడికోసం ఎదురు చూస్తూనే ఉంది. ఇంటి ముందు ఏ మోటరు కారు ఆగినా కాబోయే పెళ్లికొడుకే అని తండ్రి ఆదుర్దా పడుతున్నాడు.

చంద్రశేఖర శాస్త్రి మంచి సంప్రదాయం గల కుటుంబంలోనివాడు. చెన్నపట్టణంలోనే చిన్న సొంత లోగిలి ఉంది. ఉపాధి కేమీ లోటు లేదు. తండ్రి వకీలుగా ఉండి కుటుంబానికి ఇంత ఆసరా చూపించి మరీ దేహయాత్ర చాలించాడు. ఆ అబ్బాయి కూడ చదువులో వృద్ధిగా ఉంటున్నాడు. ఇంజినీరింగు కాలేజీలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. జీవితం మూడు పువ్వులు, ఆరుకాయలుగా ఉండడానికేమీ అభ్యంతరం లేదు. మనిషి సన్నగా ఎర్రగా ఉంటాడు. ముందు అంటకత్తిర, వెనక చిన్నపిలక. ఖద్దరు వస్త్రధారి; పంచ, షర్టు, కండువా వేసుకొంటాడు.

సంబంధం చూడడానికి వరాహగిరి గారి ఇంటికి వెళదామని శాస్త్రి పగలంతా తొందర పడుతున్నాడు. అదేమి ఖర్మమో కాని కుదరడం లేదు! ఏదో ఒక అడ్డంకి వస్తూనే ఉంది. సాయంత్రం వెళ్లక తప్పదు అనుకొన్నాడు. ఒక స్నేహితుడి కారుమీద వెళ్లడానికి ఏర్పాటు చేసుకొన్నాడు.

బయలుదేరడానికి తొందరపడుతూ వీధి గుమ్మం దగ్గరకి రాగా, ప్రబుద్ధారావు కనబడ్డాడు. శాస్త్రిని చూసి "హల్లో ఏమిటి! విశేషాలు?" అన్నాడు ప్రబుద్ధారావు.

అతన్ని శాస్త్రి ఆహ్వానించాడు. దారినిపోయేవాడు అడ్డు తిరిగి, గుమ్మం మెట్లు ఎక్కాడు. శాస్త్రి కుర్చీ చూపించగా దర్శకుడు కుర్చీమీద కూర్చుని "ఏమిటి ఈ పటాటోపం! ఎక్కడేనా ఫొటోకాని, లేకపోతే సినీమాకా, ఏమిటి కథ?" అన్నాడు.

"మరేం లేదు. చిన్న పనుంది. అంతే విశేషం" అన్నాడు శాస్త్రి, నవ్వు మొహంతో.

ప్రబుద్ధారావు శాస్త్రికి తోడి విద్యార్థి. ఇద్దరూ ఒకే తరగతి చదువుతున్నారు. కాబట్టి పరిచయం విస్తారం. కాని మనస్తత్వాలు భిన్న మవడంచేత స్నేహం ఏర్పడ లేదు.

"చిన్న పనినిగురించి కొద్దిగా మేము కూడ తెలుసుకోవచ్చా?" అన్నాడు ప్రబుద్ధారావు.

"నిరభ్యంతరంగా. పెళ్లి చూపులకి" అన్నాడు చిరునవ్వు ఆపుకొంటూ.

"ఇంకేం! కొట్టూ! ధావు! ఇంకా చెప్పావు కాదు! ఎవరు? ఏమిటి సంగతి?"

"ఒక వ్యాపారస్తుని కుమార్తె. నాకూ అంతగా విశేషాలు తెలియవు. చదువుకొంది. చూడడానికి రమ్మని కబురు పంపారు" అన్నాడు శాస్త్రి.

"కారు మీదేనా వెళ్లిరావడం?"

"కాకపోతే!"

"దర్జా కనబరచకపోతే ఎట్లాగయ్యా! అయితే నేనుకూడ వెంట రావచ్చా, యువరాజుగారి వెంట యువమంత్రి అన్నట్టుగా!"

"దాని కేముంది. ఇదేం మూతి వేస్తే ముక్కిపోయేదా, ఏమేనా? ఇద్దరం వెళ్ళి చూసివద్దాం, రా మంచో చెడ్డో కనుక్కొందాం. ఒక తలకాయకంటె రెండు తలకాయలు మెరుగని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి" అన్నాడు శాస్త్రి.

"అయితే వేషం మార్చవద్దూ! ఈ చప్రాసీగుడ్డలతో నేనా!"

"ఊఁ. కానీ!"


"వెళ్లి, ఇక్కడ ఉన్నట్టుగా వస్తాను" అని ప్రబుద్ధారావు వీధిలోకి ఒక్క గంతు వేశాడు. శాస్త్రి కారు కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రబుద్ధారావు సైకిల్ మీద ఇట్టే కొట్టుకు వచ్చాడు. అతను గులాబీ రంగు సూట్ వేసుకొన్నాడు. నెక్‌టై, కాలరు, కళ్లజోడు. తలకి వాసననూనె రాశాడు. చేతిరుమాలుకి అత్తరువు పూశాడు. షూట్ కికూడ కాస్త పట్టించాడు. కాళ్ళని నిగనిగలాడే నల్లని బూట్లు. అప్పుడే స్టీమరు



దిగివచ్చిన దొరగారిలా గున్నాడు. అతను సైకిల్ మీద రాగా అతని వెంట బొచ్చు కుక్క కూడ పరుగెత్తుకు వచ్చింది. శాస్త్రి కుక్కని ఈల వేసి పిలిచాడు. ఇంతటిలో కారు వచ్చింది. స్నేహితు లిద్దరు కారు మీద కూర్చున్నారు. కుక్క కూడా కారు ఎక్కింది.

ఇంటిఎదుట కారు నిలిచి హారన్ కొట్టగా వరాహగిరి ఇతలకి వచ్చి, స్నేహితుల కిద్దరికి స్వాగత మిచ్చి, లోపలకి తీసుకొనివెళ్లి, కుషన్‌కుర్చీలమీద కూర్చోబెట్టాడు. ఎవ రెవరో పైనం కనుక్కున్నాడు. సంబంధయువకుడైన శాస్త్రితో సంభాషిస్తున్నాడు. బార్ లైట్లు వెలుగుతున్నాయి. నేలమీద రత్న కంబళి పరిచిఉంది. మధ్య ప్రశస్తమైన చెక్కడపు పనిగల మేజాబల్ల ఉంది. చుట్టూ సోఫాలు, కుషన్ కుర్చీలు ఉన్నాయి. గోడలని నాజూకైన పెద్ద పటాలు, రెండు పెద్ద అద్దాలు ఉన్నాయి. ఇంతటిలో ఫలహారం, కాఫీ వచ్చాయి. స్నేహితులు రుచిచూశారు. సుకేశిని అలంకృతయై దివ్యమంగళవిగ్రహంలాగు వచ్చి ఒక సోఫామీద కూర్చుంది. ఆమెకి ఫలానా ఫలానా అని స్నేహితు లిద్దరిని తండ్రి పరిచయం చేశాడు. "కుక్క ఎవరిది?" అని ఆమె ప్రశ్నించగా, "సంబంధ యువకుడితో వచ్చిన స్నేహితుడిది" అని తండ్రి చెప్పాడు. సుకేశిని కుక్కని చూసి ముచ్చటపడి, దానికి రొట్టె తెప్పించి వేసింది. సంబంధయువకుడితో వచ్చిన అతని స్నేహితుడి వేషమూ, అతని వేళాకోళాలూ, అతని భాష చూసి దిగ్భ్రమ చెందింది. ఒళ్లంతా కళ్లు చేసుకొని అతనినే చూస్తూంది. చదువుకొన్న స్త్రీ అయినా కూడ ఆమె సంభాషణలోకి దిగలేదు. ప్రబుద్ధారావు యువరాజులాగు, శాస్త్రి పురోహితుడిలాగు ఆమె కళ్లకి కనబడ్డారు. కొంతసేపు కూర్చుని ఆ అమ్మాయి వెళ్లిపోయింది. మరి కొంతసేపు కూర్చుని మాట్లాడి, స్నేహితు లిద్దరూ లేచి వెళ్లి వస్తా

మని చెప్పి, వెళ్లేముందు శాస్త్రి వరాహ గిరితో "ఆతర్వాత కబురు పంపిస్తాను లెండి" అన్నాడు. ఆయన సంతోషం ప్రకటించాడు. వాళ్లు వెళ్లిపోయేటప్పుడు సుకేశిని తలుపుసందులోంచి ప్రబుద్ధారావుని. మరొకసారిచూచి సంతోషించింది.



కారులో వెళ్లుతూన్నప్పుడు దారిలో ప్రబుద్ధారావు "పెళ్లికూతురు ఏలాగుందయ్యా?" అన్నాడు.

"సంసార పక్షం. మేక్ అప్ జాస్తిగా ఉంది. ఏదో చూశాం, కాఫీతాగి, లేచి వచ్చాం, అయిపోయింది" అన్నాడు.

శాస్త్రిని ఇంటిదగ్గిర దిగబెట్టి ఆ కారు ప్రబుద్ధారావుని అతని గదిదగ్గిర దిగబెట్టింది.

సుకేశిని ఆ యువకు లిద్దరి వైనం తండ్రి నడిగి చక్కగా తెలుసుకొంది. ఆమె శాస్త్రిని మెచ్చుకోనందుకు వరాహగిరి చాల విచారించి "ఏమిటి కారణం అమ్మాయీ?" అని నిస్పృహతో అడిగాడు.

"పంచాంగంకట్ట బ్రాహ్మడిలాగున్నాడు నాన్నా!" అంది కుమార్తె.

"శివ! శివ! మన సంప్రదాయమమ్మ అది. వాళ్లు భాగ్యవంతులు. అంతేకాని యాచకులు గారు. అతను చదువుకొన్న వాడు" అని ఇంకా ఏదో చెప్పబోతూండగా ఆమె పెడమొహం పెట్టింది. అతను చేసేదేమీ లేక మనస్సులోనే అవస్థ పడ్డాడు.

సుకేశినిమనస్సు ప్రబుద్ధారావుమీద లగ్నమయింది. ఆమె కెంతసేపూ అతని మూర్తే కళ్లకి కట్టినట్లు కనబడుతూంది, అతని కేరింతాలు, నవ్వులు, హావభావాలు మళ్లీమళ్లీ జ్ఞాపకానికి తెచ్చుకొని పరవశురాలవుతూంది. అతనికి తన ప్రేమని తెలియజేసే విధాన మేమిటని ఆలోచిస్తూంది. ఆలోచించి, చివరికి తమ బట్టలకొట్టుమీద పనిచేసే కుర్రవాళ్లని అడిగి చూసింది. వారిలో కొత్తగా వచ్చిన ఒకడు కొంత నేర్పరిగా కనబడ్డాడు. వాడికి కొన్ని సంగతులు చెప్పింది. శాస్త్రి ప్రబుద్ధారావుల ఇళ్ల వైనం తెలియజేసి తాను తయారుచేసిన ప్రేమలేఖ వాడి చేతికి ఇచ్చి, ప్రబుద్ధారావుకి ఇచ్చిరమ్మంది. "సరే!" అని ఆమె ఇచ్చిన డబ్బులు జేబులో వేసుకొని, వాడు ఆ ఇళ్లకోసం వెతకడం మొదలుపెట్టాడు. శాస్త్రిఇల్లు తెలిసింది కాని ప్రబుద్ధారావు ఇల్లు తెలియలేదు. అందుచేత వాడు తిరిగి శాస్త్రి ఇంటికి వెళ్లి ప్రబుద్ధారావుగారి ఇల్లెక్కడ?" అని ప్రశ్నించాడు.

ఆ కుర్రవాడెవరో తెలియక "ఎవరు నువ్వు?" అని శాస్త్రి ప్రశ్నించాడు.

"జవుళి అంగడిలో పనిచేస్తున్నాను."

"ఎవరి అంగడి?"

"వరాహగిరిఅయ్యవారి అంగడి."

శాస్త్రి ఆశ్చర్యపోయాడు. ఉంటే నాతో పని ఉండాలి కాని ప్రబుద్ధారావుతో పనేమిటి అని ఆలోచించి "నీకు ప్రబుద్ధారావు ఎందుకు?" అన్నాడు.

కుర్రవాడు నవ్వివేసి, చేతిరుమాలు పళ్లతో పట్టుకొన్నాడు.

శాస్త్రికి చిత్రమయింది. ఏదో విశేష ముందనుకొన్నాడు. "సంగతి ఏమిటి?" అన్నాడు.

"కుర్రవాడు "ఏమీ కాదండి" అనగా, శాస్త్రి జేబులోంచి ఒక రూపాయి తీసి ఇచ్చి "ఏమిటి సంగతులు" అని ప్రశ్నించాడు.

కుర్రవాడు "ఆ అమ్మాయిగారు జాబు ఇచ్చారండి" అంటూ అతని చేతికి లేఖ అందించాడు

ఆ లేఖ తీసికొని చూడగా దానిమీద తనస్నేహితుడి చిరునామా ఉంది. అతని కేమీ తోచలేదు. కుతూహలం ఎక్కువ అయింది. "ఇప్పుడే వస్తా" నని చెప్పి, ఇంటిలోకి వెళ్లి, ఉత్తరం చింపి, చదవగా, సుకేశిని ప్రబుద్ధారావుకు రాసిన ప్రేమలేఖ! అదంతా పూర్తిగా చదువుకొని ఆశ్చర్యపోయాడు. ఇవతలినుంచి పనివాడు కేకలు పెట్టగా, మరొక కవరుమీద చిరునామా వ్రాసి, లేఖ అందులో పెట్టి, అతికించి,

సంచీ వాడిచేతికి ఇచ్చివేస్తూ, "ఆవిడ వ్రాసిన ప్రతి ఉత్తరం నాకు తీసుకొని వచ్చియియ్యి. నీకు మంచి బహుమానమిస్తా!" నని చెప్పి, మరొక రూపాయి వాడి చేతిలో పెట్టగా, పనివాడి మొహం చేటంతయింది. ప్రబుద్ధారావు ఒక్కడే ఫలానావీధిలో ఫలానాగదిలో ఉంటున్నాడని అతను చెప్పగా, వాడు ఆ ఉత్తరం తీసుకుపోయి అతనికి ఇచ్చివేశాడు.

తనని తూలనాడుతూ, ప్రబుద్ధారావుని మెచ్చుకొంటూ సుకేశిని రాసిన ఉత్తరాన్ని చదువుకొని, శాస్త్రి మొదట చాలా ఖిన్నుడైపోయాడు. తర్వాత ఉగ్రుడైపోయాడు. "ప్రబుద్ధారావుపాటివాణ్ణి కాకపోయేనా నేను, దీని దృష్టిలో! అతనికున్నపాటి అందము, తెలివితేటలు, చమత్కారము నాకు లేకపోయేయిట! అందుచేతట వాడిని వలచడం! ఏమిటి దీని రాతలు! నాకంటే నిజంగా వాడు ఏమి అందగాడని? నేను ఎర్రగా ఉంటేగా వాడు చామంచాయగా ఉన్నాడే! వాడికంటె చదువులో నేను సహస్రవిధాల మెరుగన్న విషయం దానికేమి తెలుస్తుంది, మా మార్కులు చూసినవాళ్లకి తెలుస్తుంది కాని! ఊరికే నాలుక బుజాన్ని వేసుకు తిరగడం, ఇక్కడా అక్కడా చెప్పదెబ్బలు తిని లేచి రావడం, ఇదే వాడికున్న చమత్కారాలు. ఇదంతా దానికేమి తెలుస్తుంది! అసలు సుగుణాలు ఎరగకపోతే ఇలాగే ఏడుస్తుంది! దానికి నా మీద ఉన్న దురభిప్రాయం మార్చాలి. వాడికన్న నేను అనేకవిధాల మెరుగన్న విషయం దానికి రుజువుపరిచితీరతాను. నేను ఊరుకోను. పోనీకదా అని నేను వాడిని-వీధిలో తిరుగుతూన్న వాడిని - ఉట్టినే కారుమీద కూర్చోపెట్టి ఒకమారు తిప్పి తీసుకొని వచ్చినదాని ఫలితమా ఇది! ఇదా నా గుణవర్ణన! ఛీ! ఛీ! వాడి దుష్టలక్షణాలన్నీ బైటపెట్టితీరతాను. నేనేమంత చేతకానివాణ్ణి అనుకుంది కాబోలు! నా మజా చూపిస్తా! నా వెంట బొచ్చుకుక్కని తిప్పినట్టు తిప్పిస్తా! అప్పుడుకాని దానికి తెలియదు నా గొప్పతనం!" అని ప్రజ్ఞలు పలికాడు. అతను ప్రబుద్ధారావుని తలుచుకోగా ఎంతో రోత అనిపించింది. పట్టలేనంత ఈర్ష్య అనిపించింది.


రహస్య ఉత్తర ప్రత్యుత్తరాలు సుకేశిని ప్రబుద్ధారావుల మధ్య జరుగుతున్నాయి. అసలే ప్రబుద్ధారావు చదువు ఓటుగా ఉండగా ఇప్పుడు చదువు సంధ్యలు బొత్తిగా సన్నగిల్లాయి. ఊరువెంట బలాదూరు తిరుగుతున్నాడు. దూరదూరంనుంచి సుకేశిని నీడ చూసి ఆనందిస్తున్నాడు. దారిలో రెండుమూడుసార్లు ప్రబుద్ధారావుకి శాస్త్రి ఎదురయాడు. కాని అతను పలకరించలేదు. పైగా పళ్లు ఇగిలిస్తూ వెళిపోయాడు. అతన్ని చూసి శాస్త్రి ఆగినా, అతను ఖాతరు చెయ్యకుండా సాగిపోయాడు. దీనితో శాస్త్రి అనుమానాలు మరింత బలపడ్డాయి. "వీడి ఎగురుపాటు వదులుస్తా" అనుకొన్నాడు.

శాస్త్రి ఒకటి రెండుసార్లు వరాహగిరిగారింటికి తనకి తానై వెళ్లాడు. కాని ఆయన ఇంటిలో లేకపోయాడు. శాస్త్రి వచ్చి వెళ్లినట్లు ఆయన తెలుసుకొన్నాడు. కాని తనకుమాత్రం అతనిని ఒప్పుకోలేదు కదా అని ఆ ప్రశంస అంతగా పెట్టుకోలేదు. సుకేశినివర్తన వెనుకటిలాగు లేదని తండ్రి అనుమానించాడు కాని అతనికి అంతుపట్టలేదు.

శాస్త్రి చాల తహతహలాడుతున్నాడు. ఇదివరకు ఆమెనిగురించి అతనికి ఉన్న అభిప్రాయం ఇప్పుడు మారిపోయింది. పైగా సుకేశిని తనకి అందుబాటులో ఉన్నట్లు కనపడలేదు. ఆ మెరహస్యపుటుత్తరాలు ఒక్కటొక్కటే చదివి చూస్తున్నాడు. తననితూలనాడుతూ, ప్రబుద్ధారావుని ప్రశంసిస్తూ ఉండగా అతను విచారిస్తున్నాడు. ఆమె ప్రేమకి తాను పాత్రుడు కాకపోయినందుకు పరితాపపడుతున్నాడు. అతనికి దారి, తెన్ను తోచడంలేదు. "పోనీ, ఆమె నన్ను చేసుకోకపోతే మానె! ఆ పుండాకోరుని వలవడమేమిటి, నా మొహం కాకపోతే! వాడికేమైనా నీతా, నిష్ఠా! మిలిటరీహోటళ్లకి పోయి మాంసం తింటాడనీ, రహస్యంగా తాగి తందనాలు తొక్కుతాడనీ దానికేం తెలుసు! ఈలాంటి దుష్టచేష్టలవల్లే కదా వాడికీ నాకూకూడా అసలు దోస్తీ ఏర్పడకపోవడం! వాడికి తప్పిపోవడం, నాకు కావడం ఉత్తమమే! కాని అది కాకపోయినా, ఆ తాగుమోతుచేతులలో అది పడి నాశనం కాకుండా ఉంటే సరి! అదే నేను కోరేదల్లా! వాడిచేతులలో పడడం ఏలాంటిదంటే, పిల్లిపాదాల మధ్య ఎలుక పడడం లాంటిది!" అని మననంచేసి, విచారించాడు. అతను తటాలున లేచి మేజాబల్ల దగ్గరకి వెళ్ళాడు. ఒక కాగితం తీశాడు. దానిమీద రెండే ముక్కలు రాశాడు. "నేను మీ దర్శనానికి ఇదివరలో మూడుసార్లు వచ్చాను. కాని కాలేదు. కారణం తెలియదు. తిరుగు టపాలో జవాబు వ్రాయ కోరుతున్నాను" అని లేఖ వ్రాసి, సంచీలో పెట్టి, వరాహగిరి యొక్క చిరునామా వ్రాసి, వెళ్లి, పోస్టులో పడవేశాడు.

అతను పోస్టాఫీసునుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికి, ఇంటిదగ్గర తనకోసమని వరాహగిరితాలూకు పనికుర్రవాడు కనిపెట్టుకొని ఉన్నాడు. వాడిని చూసి శాస్త్రి ఆశ్చర్యపోయి, ఆతురతతో "ఏమిటి విశేషాలు?" అని అడిగాడు. వాడు ఒక లేఖ అతనికి అందించాడు. లోపలికి వెళ్లి ఆ లేఖ విప్పి చదువుకొని, తిరిగి ఒక కొత్త కవరులో పెట్టి, పనివాడి చేతికి అందించి "ఇదిగో! నీ బహుమానం!" అంటూ రెండు రూపాయలు చేతిలో పెట్టాడు. కుర్రవాడు తన దారిని తాను చక్కాపోయాడు.

శాస్త్రి అపరిమితంగా సంతోషపడ్డాడు. ఆ లేఖ చాలా ముఖ్యమైనది. సంతోషంలోనే విచారం పొందుతున్నాడు. ఆ లేఖలో సుకేశినీ ప్రబుద్ధా



రావులు ఏర్పాటు చేసుకొన్న రహస్య సమావేశం, తదుపరి లేచిపోవడం ఇంకా మరికొన్ని ఏర్పాట్లు వివరంగా ఉన్నాయి. వాటిని తలుచుకొని శాస్త్రి ఎంతో విచారించాడు. ఆ లేఖలో అంశాలు అనగా, తేదీ, స్థలం, వేళ మొదలైనవి చక్కగా గుర్తుపెట్టుకొన్నాడు. "ఆ నాటికి నేను ఆ స్థలానికి వెళ్లి దానిని కాపాడాలి. ఈ లోపలే వాడినిగురించి ప్రొహిబిషన్ సిబ్బందికి తెలియజెయ్యాలి"అని నిర్ణయించుకొన్నాడు.

ప్రబుద్ధారావు కాలేజీలో ఇంటర్ చదివేటప్పుడు అతని కొక ఇంగ్లీషు ప్రొఫెసర్ ఉండేవాడు. ఆ ప్రొఫెసరుకి కొందరు ప్రియశిష్యులు ఉండేవారు. వాళ్లలో ప్రబుద్ధారావు ఒకడు. ఆ ప్రొఫెసరు శిష్యులకి నేర్పిన చదు వేమీ లేదు. బంగాళాలో తాగి తందనాలు తొక్కుతూంటే, శిష్యులు చుట్టూచేరి భజన చేసేవారు. క్రమంగా వాళ్లుకూడా తాగడం మొదలపెట్టారు. మాంసాహారాభ్యాసం చక్కగా అయింది. ఆ ప్రొఫెసర్ కొన్నాళ్లకి తన దేశం వెళ్ళిపోయాడు. కాని, శిష్యవర్గం మాత్రం అతని అడుగుజాడలలో నడుస్తున్నారు. ఈమోస్తరుగా ప్రబుద్ధారావు చాటుగా మాటుగా తాగి అవస్థలు పడుతూంటాడు. ఈలాగు కాలక్షేపం చేస్తున్నాడు.

శాస్త్రి వ్రాసిన ఉత్తరం వరాహగిరి చూసుకొన్నాడు. తన కుమార్తెకి వచ్చిన సంబంధా లన్నిటిలోను ఇదే ఉత్తమ మని అతను బాగా ఎరుగును, కాని, విద్యావతియైన తన కుమార్తెకి నచ్చజెప్పడ మెలాగు! అతను ఆలోచించి కుమార్తెను నిర్బంధపరిచి అతని కిచ్చి పెళ్ళిచెయ్య నిశ్చయించుకొన్నాడు. సుకేశిని ఎదుటకి రాగా "అమ్మాయీ! శాస్త్రిగారు వ్రాసిన ఉత్తరం చూడనే చూశావు కదా!" అన్నాడు.

"ఎరుగుదును" అని ఆమె మొహం చిట్లించుకొంది.

"ఇన్నాళ్లించీ ఎంత ప్రయత్నం చేస్తూన్నా మళ్ళీ ఏ సంబంధమూ రాలేదు. నీవే చూస్తున్నావు కదా!" అనాడు.

ఆమె మనస్సులో ప్రబుద్ధారావు ప్రతిబింబించాడు.

"ఎదిగిన పిల్లని ఎంతకాలం ఇంటిలో ఉంచుకోను! బంధువులకి, స్నేహితులకి కూడ విపరీతంగా కనపడతుంది" అని తన బాధ తెలుపుదు చేసుకొన్నాడు.

"ఏమి, ఉంటే ఉంటుంది? వాళ్లేమి ఆర్చేవాళ్లా, తీర్చేవాళ్ళా?" అని కుమార్తె పెద్దమాట లాడింది.

"అలాగు ప్రతిదీ తీసిపారెయ్యడానికి లేదు. జీవితమంటే పదిమందితో సంబంధించిన పని, ఎవ్వరినీ కాదని మనం ఒక్కళ్లం బతకలేము" అని అనుభవ పూర్వకంగా మాట్లాడాడు.

'నా బతుకు నేను చూసుకొంటాను' అని ఆమె మనసులో అనుకొంది.

"ఇంతకీ నేను చెప్పవచ్చే దేమిటంటే, శాస్త్రిగారి సంబంధం మనం విడిచి పెట్టుకోవద్దు. అది మన కాళ్లదగ్గరకి వచ్చిన సంబంధం! చదువుకొన్నదానివి కనక "సిరి రా మోకాలొడ్డునె" అన్న సామెత జ్ఞప్తికి తెచ్చుకో! బాగా ఆలోచించుకో! లోతుగా ఆలోచించి చూడగా మనం తల్లకిందులు పడి తపస్సుచేసినా మళ్ళా అటువంటి సంబంధం మరొకటి తేగలమని తోచదు. మనం తేలేము అనికూడ నాగట్టి నమ్మకం! ఇది ముమ్మాటికీ నిజం! ఏమంటావు?" అని మాటవరసకి ప్రశ్నించాడు.

ఆమె మనస్సులో నా ప్రారబ్ధ మెలా కాలిపోయిందో ఏమిటో!" అనుకొంది; నేలవైపు చూస్తూంది.

"అతనికి నేను మళ్లీ వచ్చి మాట్లాడవలసిందంటూ వుత్తరం రాస్తున్నాను. వింటున్నావా?" అని హెచ్చరించాడు.

నువ్వు రాసుకుంటే రాసుకో, నాకేం అన్నట్లుగా ఊరుకుంది.

మౌనం అర్ధాంగీకారం అని భావించి అతను శాస్త్రికి ఉత్తరం రాశాడు.

ప్రబుద్ధారావుతో జరగబోయే సమావేశాన్ని తలుచుకొంటూ సుకేశిని ఉవ్విళ్లూరుతూంది. ప్రబుద్ధారావుని కలుసుకొన్న వెంటనే ఆమె అతని చేతులలో వెలికిల సినిమాస్టారులాగ పడిపోవాలనీ, ఇంకా రెండు మూడు ఫోజులు అభినయించి ఆనందప్రవాహంలో ఓలలాడాలనీ ఆమె కలలు కంటూంది. సమావేశం అడ్డంకులు లేకుండా తటస్థించడంకోసం ఆమె దేవుడిగుళ్లో పది కొబ్బరికాయలు కొట్టింది.

ఈ రోజు సాయంకాలం ఆరుగంటలకే సమావేశం ఏర్పాటు. సుకేశిని ఎర్రని పట్టు రవిక, నీలిపటుచీర ధరించి నడుస్తూ సూర్యుని నీరెండిలో నృత్యంచేస్తూన్న నెమలిలాగు ఉంది. తీయని ఆలోచనలు ముసురుతూండగా ఆమె నడివీధిలో నడవడానికి సిగ్గుపడింది. దారిపక్కని నడుస్తూ సైడుకాలవలో రెండుసార్లు పడడానికి సిద్ధమయింది. తన సాహసాన్ని తలుచుకొని పరమాశ్చర్యపోయి జంకుతూంది. ఆమె చెప్పిన మర్రిచెట్టుదగ్గిరే ప్రబుద్ధారావు నిలుచుని ఎదురుచూస్తుండగా, ఆమె కోరిక మేఘమండల మెక్కి కిందికి చూసింది. ఆమెకోసం వెయ్యికళ్లతో చూస్తున్నాడు అతను. అతనిదగ్గిర కుక్కకూడా నిలబడ్డది.

శాస్త్రి తెలియబరిచిన ఆచోకీ తీసుకొని ప్రొహిబిషన్ పోలీసులు ప్రబుదారావు గదికి వెళ్లి, సోదా చేయగా రెండు ఖాళీబుడ్లు, సారాయి సగం ఉన్న మరొకబుడ్డి దొరికాయి. వాళ్లు మనిషికోసమని వెతుకుతున్నారు.

మర్రిచెట్టుదగ్గిరికి సుకేశిని వచ్చింది. ప్రబుద్ధారావుని చూసి సిగ్గుపడి తలవంచుకొని నిలుచుంది. ప్రబుద్ధారావు 'ప్రియురాలా!' అంటూ చేతులు చాచాడు, ఇంతటిలో శాస్త్రి అక్కడికి చేరాడు. ప్రబుద్ధారావుని చూసిచూడగానే అతనికి రోషంపుట్టింది. వేరే ఆలోచన లేకుండా బొచ్చుకుక్కలాగు మీద పడిపోయాడు; ఊచి పుచ్చుకొని ఒక్క లెంపకాయ వేశాడు. అతను తాగిన

ఆంధ్రపత్రిక

శ్రీ ఖరనామసంవత్సర

పంచాంగం

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణించబడిన

ఈ సంవత్సరం పంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం గుణింపబడిన రెండుపద్ధతుల తిథి, నక్షత్రాదులు వేర్వేరుగా చూపబడినవి.

కొత్తపంచాంగాలు సిద్ధమైనవి

100 పుటలు వెల ప్రతి	1-కి	0-4-0
,,	100-కి	16-0-0
,,	1000-కి	150-0-0

రైలు ఖర్చులు ప్రత్యేకం.

1000 కాపీలు ఒకేసారి కొనువారి చిరునామా ముఖపత్రమున ముద్రించబడును.

వివరాలకు వ్రాయండి:

మేనేజరు
ఆంధ్రపత్రిక, మద్రాసు-1.

కంపు కొటగా శాస్త్రికి ధైర్యం ఇనుమడించింది. 'తాగినవాణ్ణి కిందికి తోసివెయ్యడ మెంతసేపు' అనుకొన్నాడు. బుద్ధారావు రౌద్రాకారం దాల్చాడు. శాస్త్రి మెడకిచుట్టుకొన్న కండువా చేతికి దొరకగా ముందుకు లాగాడు; పిలక పట్టుకోబోయాడు, కాని దొరకలేదు. శాస్త్రి ప్రబుద్ధారావు ముందుపింఛం పట్టుకొని కిందికి లాగి వీపుమీద రెండు గుద్దులుగుద్దాడు. కిందికి తోసివేశాడు. ప్రబుద్ధారావు అప్పుడే దర్జీవాడి కొట్టుదగ్గరనుంచి తెచ్చుకున్న కొత్త తెల్లని సూటు మట్టిపాలుకాగా, కోపం రెట్టింపయింది. శాస్త్రియొక్క కాళ్లు పట్టుకొని కిందికి లాగేశాడు. వాళ్లజగడం చూసి అర్థంకాక సుకేశిని నివ్వెరపోయింది. ఆమెకు అదేదో సినీమా చూసినట్లుగా కనపడింది. వాళ్లిద్దరూ ఒకళ్లమీద ఒకళ్లు పడి కుక్కలలాగు కొట్లాడుకొంటున్నారు. ఇహాలాభం లేదని సుకేశిని మొత్తుకొంటూంది. బొచ్చుకుక్క ఇటూ అటూ పరుగెత్తి మొరుగుతూంది. అంతేగాని కరవదు. వెనక రొట్టిముక్కలు తిన్న విశ్వాసంవల్ల శాస్త్రిని ఏమీ చెయ్యడంలేదు. ఏదేనా మొత్తంమీద ప్రబుద్ధారావు బలశాలి అవడంవల్ల శాస్త్రి విధిలేక వెనకంజ వెయ్యవలసివచ్చింది. ఇంతటిలో ప్రబుద్ధారావు కోసం వెతుకుతూన్న ప్రొహిబిషన్ పోలీసులు వచ్చారు. అతన్ని ముట్టివేశారు. తగవులాటతో ప్రబుద్ధారావు అసహ్యంగా ఉన్నాడు. పోలీసులు అతన్ని వెంటపెట్టుకొని తీసుకుపోయారు.

ప్రబుద్ధారావు వట్టి తాగుమోతని తెలిసి సుకేశిని ఆశ్చర్యపోయింది. తనకి ప్రాణాపాయం తప్పినట్లుగా సంతోషించింది. "ఎరుగక గోతిలో పడేదాన్ని అయినా భగవంతుడు నన్ను దయతో కాపాడాడు. నాకు బుద్ధివచ్చింది" అనుకొంటూ, ఇంటిదారి పట్టింది.

శాస్త్రి వరాహగిరిగారి ఇంటికి వెళ్లాడు. ఆయనను కలుసుకొని జరిగిన కథంతా ఏకరువు పెట్టాడు. తాను సుకేశినిని ప్రబుద్ధారావుబారినుండి ఏలాగు కాపాడినదీ, ప్రొహిబిషన్‌పోలీసులకి అతన్ని ఎలాగు అప్పజెప్పినదీ, వర్ణించగా వరాహగిరి 'ఇంతకథ జరిగిందా!' అంటూ విస్తుపోయాడు. అతను తెప్పరిలి "నేను మీకు వ్రాసిన లేఖ అందిందా?" అన్నాడు.


"లేఖ ఏమిటి?" అని శాస్త్రి ఆశ్చర్యపోయాడు.

ఇంతటిలో వరాహగిరిపనివాళ్లుకూడా ప్రబుద్ధారావుని ఖైదుచేసినట్లుగా చెప్పారు. వరాహగిరి తన బిడ్డకి గొప్పగండం తప్పిందని చాలా సంతోషించాడు. అతని కృతజ్ఞతకి మేర లేకపోయింది. ఇంటిలో నున్న సుకేశినిని పిలిచాడు. ఆమె వచ్చి నేరస్తురాలిలాగ నిలబడింది. "నీవు చేసిన ద్రోహానికి నీకు ఎటువంటి శిక్షకూడా తక్కువే! ఈ మహానుభావుడే నిన్ను, నన్నుకూడా కాపాడాడు. లేకుంటే నీవు అడవులపాలయిపోయుందువు; నేను అపకీర్తిపాలయిపోయుండేవాణ్ణి. ఇతనికంటెనీకు వేరే దేవుడు లేడు!" అని అనగా, సుకేశిని కృతజ్ఞతాభావంతో శాస్త్రివైపు చూసింది.

"నువ్వు ఎప్పుడో బంగారు పువ్వులతో పూజచెయ్యడంబట్టే నీకిటువంటి సద్గుణవంతుణ్ణి భర్తగా భగవంతుడు ఏర్పాటు చేశాడు" అన్నాడు తండ్రి.

ఆమెరెప్పలలోంచి ఆనందం తొంగి చూసింది.

వరాహగిరి సుకేశినిచెయ్యి, శాస్త్రి చేతిలోపెట్టి "ఇదే మీకు ప్రధానం" అని ఉచ్చరించగా, శాస్త్రిశరీరంలో ఆనంద వాహిని ప్రవహించింది. సుకేశినితల సిగ్గుతో పక్కకి వంగిపోయింది. ★



పెద్దమనిషి : రాత్రి కాపలావాడు కావాలని మీరు పత్రికలో వేసిన, ఫలితం ఏమన్నా కలిగిందా?
బాంకుమేనేజరు : కలగకేం? ఆ రాత్రే మా బాంకులో దొంగలు పడ్డారు.

ఈ ఏడాది డిసెంబరులోగా మరొక లక్షమందిని వియట్‌నామ్‌సైన్యంలోకి చేర్చుకుంటారు...అమెరికా ఈ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేస్తుందట. ఈ అదనపు ఆయుధాలకయ్యే ఖర్చు, వియట్‌నామ్‌సాలీనా ఆదాయానికి సరిపోతుంది. (4 కోట్లపౌనులపైచిలుకు)......వియట్‌నామ్‌లోని ఫ్రెంచిసైన్యాలనిమిత్తం ఫ్రాన్సు ఏటేటా 16 కోట్లపౌన్లదాకా ఖర్చుపెడుతోంది. —లండన్ "టైమ్సు"

అదీ-ఇదీ

మాటకారితనం?

"అగ్రవిదేశాంగ మంత్రి చతుష్టయ సమావేశం జరపడం గురించి సాగుతున్న ఉత్తర ప్రత్యుత్తరాల సంఘర్షణలో మాస్కోది పై చెయ్యి అవుతున్నట్టు ప్రజాభిప్రాయ సేకరణద్వారా రుజువవుతున్నది. ఈ సమావేశం జరపడంలో తన ఆశయాలు నిష్కల్మషమైనవనో, లేక చర్చలలో చేర్చదగిన అంశాలను గురించి పశ్చిమ రాజ్యాలవారు అనవసరపు పేచీలు పెట్టారనో క్రెమ్లిన్ (రష్యా ప్రభుత్వ కార్యాలయం) అనేకమంది అమెరికనులనూ ఇంకా అనేకమంది యూరోపియనులనూ నమ్మించినట్లు కనిపిస్తున్నది. కనీసం చేయదగినదంతా చేశారనిపించుకోవటానికైనా పశ్చిమ రాజ్యాలు చిట్టచివరకు సమావేశానికి ఒప్పుకోవలసి ఉంటుందని వాషింగ్టన్‌లోని బాధ్యతగల అధికారులు భావించనారంభిస్తున్నారు."

—"న్యూస్ వీక్" పత్రిక

నాజీల విడుదల

"నాజీ యుద్ధ ఖైదీల విడుదలను గురించి జర్మనీలలో ఎంత వ్యతిరేక సంచలనం బయలుదేరిందంటే, అమెరికా ఆశయాలు వ్యక్తం చెయ్యడానికి గాను (అమెరికన్) హైకమిషనర్ జాన్. జె. మక్లాయ్ ప్రచారం సాగించవచ్చు."

—"న్యూస్‌వీక్" పత్రిక

కొరియాలో మకార్థరిజం!

"మూడు నాలుగు రోజుల క్రితం ఈ గ్రామంలో నాపామ్ బాంబు పేలింది... చనిపోయిన గ్రామస్తులను ఎవరూ పూడ్చిపెట్టలేదు. ఎందుకంటే ఆ పని చేసేటందుకు ఎవరూ మిగలలేదు. గ్రామంలోనూ, పొలాలలోనూ పనులు చేసుకునేవారు నాపామ్ బాంబు పేలగానే ఎక్కడివారక్కడ, ఉన్నవారు ఉన్న పాళంగా చనిపోయినారు. వీరిలో ఒకడు సైకిలు ఎక్కబోతున్నాడు. అనాధ శరణాలయంలో 50 మంది బాల బాలికలు ఆడుకుంటున్నారు. ఒక యిల్లాలు కేటలాగునుంచి ఒక కాగితం చింపి చేత్తో పట్టుకుని ఉన్నది. వీరంతా ఏపని చేస్తున్నవారు ఆ భంగిమలోనే ఉండి చనిపోయినారు."

—"న్యూయార్క్ టైమ్స్" ప్రత్యేక విలేఖరి.

చైనా వాలంటీర్ల పొదుపు

చైనావారు పొదుపు గలవారు. కొరియాలో వారి వాలంటీర్లు మనుష్యులనూ, ఆయుధాలనూ కూడా చాలా పొదుపుగా వాడుకుంటున్నారు...

ఇటీవల 26 మంది వాలంటీర్లు రాత్రిళ్లా నడిచి ఒక కొండను స్వాధీన పరచుకోవడానికి వెళ్లారు. వాళ్లు స్థావరం ఏర్పాటు చేసుకుని అన్నిటికీ సంసిద్ధులై ఉన్నారు.

దీనిమీద దాడి చెయ్యడంలో అమెరికనులు తమ కున్న బలాన్నంతా కుమ్మరించారు. మొదటిరోజు అమెరికను విమానాలు 62 సార్లు వచ్చి బాంబులు వేశాయి. రెండవ రోజున నూరుసార్లు బాంబులు వేశాయి. విరామం లేకుండా శతఘ్ని వర్షం కురిపించ బడింది. అలలు అలలుగా కాల్బలాలు మీదికి వచ్చాయి. వారు (అమెరికనులు) రాకెట్లూ, నాపామ్ బాంబులూ (మనుష్యులను ఉన్నపాళంగా మసి చేసే అతి నాగరిక మారణాస్త్రాలు!), మరఫిరంగులూ ఉపయోగించటమే కాక ఆ హడావుడిలో తమ విమానాలను కొన్నిటిని తామే కూల్చుకున్నారు కూడానూ.

ఫలితం: కొండను రక్షించిన 29 మంది వాలంటీర్లలో 5 గురికి తాత్కాలికంగా చెవుడు వచ్చింది. ఒక్కడికీ చిన్న గాయం తగల్లేదు; వాళ్లు తమ స్థావరాలను అంత తెలివిగా నిర్మించుకున్నారు. వారు ఉపయోగించిన ఆయుధాలు 1100 రైఫిల్ గుళ్ళూ, 400 మరఫిరంగి తూటా పట్టాలూ, 65 టామీగన్ క్లిప్పులూ, 14 చేతిబాంబులూ మాత్రమే. అమెరికనులలో చనిపోయిన వారి సంఖ్యా, గాయాలు తగిలినవారి సంఖ్యా కలిసి 200. ఇదికాక వారి వాహనాలు 58 ధ్వంసమయాయి. వారి హోవిట్జర్ ఫిరంగులు నాలుగు వాలంటీర్ల వశమయాయి.

—పెకింగునుంచి అలన్ విన్నింగ్టన్ అనే పత్రికా విలేకరి చేసిన కథనం.

పిడివాదం

"ప్రధాని అట్లీలోనూ, ఆయన ప్రభుత్వంలోనూ విశ్వాసం క్షీణించకుండా విశ్వప్రయత్నం చేస్తున్న నాబోటి వారికి, ఈమధ్య ఆయన 'ఫారెస్టుహిల్' లో చేసిన ప్రసంగం తీరని ఆశాభంగం కలిగించింది.

రష్యాకుగల మిలిటరీ బలసంపత్తి కేవలం దురాక్రమణ కోసమేనని, పశ్చిమ రాజ్యాల సైన్యాలు కేవలం స్వీయరక్షణ కోసమేనని వాదించటం పిడివాదులకే తగుతుంది. రష్యన్‌లు తమ సైన్యాలను రష్యన్ సరిహద్దుల్లోనే ఉంచుకొంటుండగా, బ్రిటన్, అమెరికాలు తమ సైన్యాలను ఇతర దేశాలకు పంపి రష్యన్ సరిహద్దులకు చేరువగా ఉన్న కీలకస్థావరాలను ఆక్రమించుకొంటున్నాయన్న సంగతి అట్లీకి తెలిసినంత మరెవరికీ తెలియదు.

జాతి విద్వేషాలు ప్రపంచ నాశనానికి దారితీస్తున్న యీ రోజుల్లో- వందఏళ్ల కిందట ఒక స్విస్ తత్వవేత్త రష్యన్ జాతి మీద చేసిన అనుచిత విమర్శను తిరిగి ఉద్ఘాటించే రాజకీయ నాయకుడికి బాధ్యత తెలుసనుకోవాలా, తెలియదనుకోవాలా?

నేను కమ్యూనిస్టును కాకపోయినప్పటికీ పత్రికల్లోనూ, రాజకీయ నాయకుల ద్వారానూ వెలువడే కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం మూర్ఖమైనదైనా కావాలి, అసత్యమైనా కావాలి అని తోస్తున్నది."

'న్యూస్టేట్స్‌మన్ అండ్ నేషన్' లో కెన్నెత్ రాలింగ్స్.

అమెరికనుల యుద్ధసామర్థ్యం

అమెరికనులు ఎందుకు గెలవలేరన్న దానికి చైనా వాలంటీర్లు చెప్పే సమాధానం:

కుష్టు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

"...అమెరికనులకు కందకాలలో పరుపులూ, ఆహార పదార్థాల టిన్నులూ, అత్తర్లూ కూడా ఉంటాయి. అయితే వారి యుద్ధదుస్తులు చలికి ఆగవు. వారు యుద్ధం చేసేటప్పుడు కూడా పడుకునేటప్పుడు మూరే సంచులలోనే ఉంటారు. ఇంతసుఖం మరిగిన సైనికులు యుద్ధం చెయ్యలేరు... ఈ అమెరికన్ సైనికులు యుద్ధం ఆరంభించగల రేమోగాని యుద్ధం గెలవగలవారు కారు...కొమింటాంగు కంటె ఈ అమెరికనులకు అధికంగా ఉన్నవల్లా విమానాలు. అవి నిపుణులైన సైనికులను ఓడించటానికి పనికివచ్చేవి కావు."

నిర్వచనం:

కొరియాలో 'మిలిటరీ చర్యలలక్ష్యం' అనే పదానికి అర్థం:

అమెరికన్ల పక్షాన పోరాడని ఏ సైనిక, పౌరమానవ మాత్రుడైనా సరే.

—ఫ్రెంచి పత్రిక 'లీమాండ్' ప్రత్యేక విలేఖరి.

బ్రిటన్‌లో సోషలిజం.

ఫిబ్రవరి 15వ తేదీన బ్రిటన్‌లో ఉక్కు పరిశ్రమ జాతీయం చేయబడింది. స్వంత పెట్టుబడి దారులపై లేబర్ ప్రభుత్వం ఇంత గొప్ప విజయం పొందినప్పటికీ—ఉక్కు ఉత్పత్తికి ముఖ్యకేంద్రమైన షెఫీల్డులో ఆనాడు ఎక్కడా విజయసూచకంగా జెండా లెగురలేదు. కార్మికులు తమకేమీ పట్టనట్టు తటస్థంగా ఊరుకున్నారు. దీనికేమిటి కారణం? పరిశ్రమ జాతీయం అయినప్పటికీ తమకు ఒరిగేదేమీ లేదనీ, పాత మేనేజిమెంటులో మార్పులేమీ రావనీ, అసలీహంగామా అంతా మూన్నాళ్ల ముచ్చటేనని కార్మికులు గ్రహించివుంటారా?.... నిజానికి ఉక్కు పరిశ్రమ జాతీయం అయినందుకు టోరీలుగాని, పాత యజమానులుగాని ఎక్కువ బెంగపడటంలేదు... వచ్చే ఎన్నికల్లో టోరీలు తప్పక గెలుస్తారనీ, ఉక్కు పరిశ్రమను మళ్ళీ తమది తమ కప్పగిస్తారనీ, కనక ఈ నాలుగురోజులూ ఎలాగో ఓపికపట్టి తమ పరిశ్రమను తాము జాగ్రత్తగా రక్షించుకుంటూ ఉండాలనీ, పాత యజమానులు అభిప్రాయ పడుతున్నట్టు కనిపిస్తోంది.

—న్యూ స్టేట్స్‌మన్ అండ్ నేషన్ పత్రికనుంచి.

విమర్శకులకు జి. డి. హెచ్. కోల్ జవాబు

[ఈ శీర్షికలో కిందటివారం జి. డి. హెచ్. కోల్ వ్యాస్యం ఒకదానిని ప్రచురించాం. దానిని కోల్ "న్యూ స్టేట్స్‌మన్ అండ్ నేషన్" పత్రికలో ప్రచురించాడు. ఆయన అభిప్రాయాలను విమర్శిస్తూ ఒకరిద్దరు ఆ పత్రికలోనే ప్రచురించిన లేఖలకు కోల్ ఇచ్చిన జవాబులో కొన్ని భాగాలను ఇక్కడ ప్రచురిస్తున్నాం.]

"...మిస్టర్ సీటన్-వాట్సన్ స్థూలంగా నన్ను మూడు విధాల ఆక్షేపిస్తున్నాడు: (1) దేశద్రోహిననీ; (2) అమెరికా విదేశాంగ విధానంపట్ల మాస్కో అభిప్రాయాన్ని స్వీకరిస్తున్నాననీ; (3) సోషలిస్టు బ్రిటనును నిర్మూలించడానికి సిద్ధంగా ఉన్నవారికీ, దానిని రక్షించ సిద్ధపడుతున్నవారికీ మధ్య తటస్థంగా ఉండమని దేశీయులను హెచ్చరిస్తున్నాననీనూ.

"మొదటి అంశం గురించి, నా రచన యొక్క ఉద్దేశం విధ్వంసక చర్యలు చెప్ప గొట్టమని విజ్ఞాపన చెయ్యడమా అని ఆయన అనుకుంటున్నారు. అది ఎంతమాత్రమూ కాదు. ప్రభుత్వం తప్పు చేస్తున్నదని చిత్తశుద్ధిగా నమ్మినప్పుడు దానిని ప్రతిఘటించే హక్కు నాకూ, ఇతరులకూ ఉన్నదని మాత్రమే నేను ఉద్ఘాటిస్తున్నాను. 1688 నుంచి అనులులోఉన్న రాజ్యాంగం కింద ఈ అధికారంయొక్క చరమ పరిణామం ...... తిరుగుబాటు చేసే అధికారమే అవుతుంది. కాని, అటువంటి తీవ్రపరిస్థితి కనుచూపుమేరలో ఎక్కడా లేదు. అమెరికా అవివేకంవల్ల మనం చైనాతో యుద్ధానికి దిగేపక్షంలో నేను చైనాకు విజయం కోరుతాననీ, చైనా ఓటమికి తోడ్పడ నిరాకరిస్తాననీ చెప్పాను. 'తప్పో, ఒప్పో, నాదేశాన్నే నేను సమర్థిస్తాను' అన్న సిద్ధాంతాన్ని నే నామోదించను. నా దేశప్రభుత్వానికి ఎదురుతిరగక పూర్వం నా అంతరాత్మను శోధించుకునే బాధ్యత నాపై ఉన్నదని అంగీకరిస్తాను. ఈ శోధనచాలా మాసాలుగాచేసి, నా అంతరాత్మ చెప్పిన విషయాలను బయట పెట్టాను.

"ఇది కమ్యూనిస్టులూ, తదనుచరులూ చేసేపనికాదని మిస్టర్ సీటన్-వాట్సన్ ఒప్పుకోగలరు. నా బుద్ధికీ, విశ్వాసాలకూ నిరంకుశ సిద్ధాంతాలేవీ సరిపడవు. మిస్టర్ సీటన్-వాట్సన్‌లాగా సోవియట్ యూనియన్ పేరు చెప్పినంతమాత్రానే నాకు ఆవేశం రాదంటే దానికి కారణం (సోవియట్ యూనియన్) నాయకులపైనా, విధానాలపైనా వ్యామోహం ఉండికాదు. అమెరికా విదేశాంగ విధానంగురించి మాస్కో వైఖరిని నేను ఆమోదించను కూడానూ. అమెరికా ప్రభుత్వంగాని, ప్రజలుగాని సోవియట్ యూనియనును నాశనం చెయ్యటానికిగాను మూడవ ప్రపంచ యుద్ధం లేపెట్ట నిశ్చయించారని నేను నమ్మను. అటువంటి వైఖరిగల వ్యక్తులూ, ముఠాలూ అమెరికాలో లేకపోలేదు; కాని, అమెరికా విధానం అమెరికా ప్రభుత్వాని, ఈ ముఠాలకూ గల కుట్రగా కాక, అపాయకరమైన, దుర్భరమైన అయోమయంగా ఉన్నదని నా నమ్మకం. చైనా ప్రభుత్వాన్ని గుర్తించకపోవటం అవివేకంతో కూడిన అయోమయం; కొరియా-ఫార్మోజా సమస్యలను కలగాపులగం చేసి కలగలపటం ట్రూమన్‌యొక్క ఘోరమైన అయోమయత్వం; ఐక్యరాజ్యసమితిని పశ్చిమరాజ్యాల ఏజన్సీగా తయారుచేయటం కేవల రాజకీయ బాల్యచేష్ట.

"యుద్ధోన్మాదంచేత కాక, యూరపు పరిస్థితి అర్థం కాకపోవటంచేతనే అమెరికా పశ్చిమజర్మనీని సాయుధంచేస్తున్నదని నా నమ్మకం. ప్రస్తుతం ప్రపంచ యుద్ధప్రమాదాన్ని తెచ్చిపెట్టటానికి అన్నిటికన్నా అధికంగా తోడ్పడుతున్నదేమంటే అమెరికా పత్రికలూ, రాజకీయవేత్తలూ ప్రదర్శించే ఉన్మత్తతా, దానికి అమెరికాప్రభుత్వం సులభంగా తలఒగ్గుతూ ఉండటమూనూ. రష్యా నాయకులపట్ల నాకెంత విముఖత్వమూ, అనుమానమూ ఉన్నప్పటికీ, అమెరికాప్రభుత్వంతోపాటు వారుకూడా బుద్ధిపూర్వకంగా ప్రపంచ యుద్ధం తెచ్చిపెట్టే ధోరణిలో లేరని నా విశ్వాసం. యుద్ధమంటే వారికి పెద్ద భయమనీ, అనుమానం ప్రమాదానికి దారితీస్తుంది కనుక, వారి అనుమానాల ఉపశమింప జేయాలని చెప్ప గొట్టరాదనీ నేను భావిస్తున్నాను. యుద్ధంవల్ల ప్రపంచం ఒక్కొక్క ముక్క ఊడి తమ ఒళ్లో పడే అవకాశం సన్నగిల్లుతుందని నమ్ముతూ వారు యుద్ధాన్ని ఎందుకు వాంఛించాలి? రష్యనులను గురించి మిస్టర్ సీటన్—వాట్సన్ చెప్పేది పూర్తిగా వాస్తవమయితే ప్రపంచయుద్ధం అనివార్యమే అవుతుంది. అది అనివార్యమని నేను నమ్మను. దానిని నివారించటానికే ప్రతి పెద్దమనిషీ ప్రయత్నించాలని నా నమ్మకం. అందుకే రష్యనులతో నిజమైన సంప్రతింపులు జరపాలనీ—వారు చెప్పేదంతా, చెప్పేది సాంతం వినకుండానే, ప్రచారమని కొట్టిపారవేయరాదనీ కోరుతున్నాను.

(45-వ పేజీ చూడండి)

సినిమా:

★ "పటేల్ శాంతారాంల దుమ్ములాట" ★

[ఒక ఆక్షేపణ]

శ్రీ మోహన్ రాయ్

ది 21-2-51, బుధవారము వెలువడిన మన 'ఆంధ్రపత్రిక' (వారపత్రిక)లో శ్రీ కె. కె. గారు (వీరికి పూర్తి పేరు వుంటుందని నా నమ్మకము) పైశీర్షికతో ఒక వ్యాసము వ్రాశారు. వారు నిష్కర్షగా విమర్శనాదృష్టితో ఆ వ్యాసాన్ని వ్రాసివున్నట్లయితే నేను ఈ వ్యాసము వ్రాసే అవకాశ ముండేదికాదు. వారు కొంతవరకు పటేల్‌ను సమర్థిస్తూ వ్రాశారు. ఆ వ్యాసాన్ని పూర్తిగా చదివి అర్థము చేసుకున్నవారికి తప్పకుండా అది తెలుస్తుంది. "బ్లాక్ మెయిల్" అనేదానికి నిర్వచనము వారే యిచ్చారు. వారి వ్యాసములో 1935 నుండి ప్రభాత్‌లో వున్నంత కాలము పటేల్ శాంతారాంను పొగిడినట్లు వారే ఒప్పుకున్నారు. ఈనాడు పటేల్ శాంతారాంను దుయ్యబట్టిన కారణ మేమిటి? ఇదంతా వ్రాయాలంటే పటేల్ శాంతారాంల జీవితచరిత్ర చాలవరకు వ్రాయాలి. దానికి పత్రికాధికారులు పాఠకులు తోడ్పడితే సావకాశముగ వ్రాయగలను. ఒకప్పుడు "శాంతారాం అంతటివాడు లేడు" అని ప్రచురించిన పత్రికే ఈనాడు "విద్యాగంధములేని అవివేకి" అని అంటున్నదంటే వ్యక్తిగత కక్షతో అన్నదే గదా. ఇది ఒక విధమైన బ్లాక్ మెయిల్ "అవుతుందేమో?" పటేల్ తాను 'బ్లాక్ మెయిల్' చేశానని ఋజువు చేసేవానికి రు. 25000 లు బహుమతి చేస్తానన్నాడని, పటేల్ రు 25000 లు పాడుచేసుకొనేవాడు కాదని శ్రీ కె. కె. గారు తమ వ్యాసములో ప్రచురించారు. వారికి నేను ఒక విషయము చెప్పుతాను. నేను వ్యభిచరించానని ఋజువుచేసినవానికి ఒక లక్ష రూపాయలు ఇస్తాను. ఋజువుచేసే మగధీరు డెవడయినా ఉంటే రమ్మనండి. ఎవరు ఋజువు చేయగలరు. రహస్యంగా జరిగే నా జారత్వముగురించి ఎవరికి తెలుస్తుంది. ఒకవేళ నా మిత్రు డెవడయినా నాతోపాటు వ్యభిచరించివున్నట్లయితే వాడీనాడు నాకు వ్యతిరేకముగా మీకు సాక్ష్య మివ్వగలడా? లేదు. రు 25000 లు బహుమానము ప్రచురించినంతమాత్రములో మనము పటేల్ 'బ్లాక్ మెయిల్' చేయలేదని భావించటము చాల అజ్ఞానము. (అంటే పటేల్ బ్లాక్ మెయిల్ చేశాడని నేను చెప్పటములేదు. నాకా అభిప్రాయము లేదు. నాకు పటేల్, శాంతారాంలు ఇరువురూ అభిమానులే. ఒకరు గొప్ప విజ్ఞాన పత్రికాధిపతి. మరొకరు ప్రఖ్యాత నిర్మాత, దర్శకుడు.) ఆతరువాత విషయము, శాంతారాం చిత్రచిత్ర నిర్మాణము. శ్రీ కె. కె. గారు తమ వ్యాసములో "శాంతారాం ఏనాడూ కూడా ప్రజలకు ఉపయోగించే చిత్రాలు ఇవ్వలే" దని. ఇదీ చాల దోషము. (ఇంత కఠిన పదము వాడక తప్పలేదు. క్షమించండి.) శాంతారాం గొప్ప దర్శకుడు. ఆయన చిత్రాలలో "పడోసి" "ఆద్మీ" "కోట్నీస్" అమూల్యములు. 'పడోసి' విజ్ఞానాన్ని యిచ్చే చిత్రముకాదా? 'ఆద్మీ' చిత్రాన్ని అర్థం చేసుకుని ఉన్నట్లయితే శ్రీ కె. కె. గారు ఈ వాక్యం వాడివుండరేమో? శాంతారాం ఏనాటికీ గొప్పదర్శకుడే. పటేల్ శాంతారామ్‌మీద నల్లేరుమీద బండి నడిచినట్లు నడిచాడు. అని వ్రాశారు. అక్కడ ఆపదము కంటే "పల్లేరు మీద ఆకు" అంటే బాగుండేది. పటేల్ శాంతారాంను అధోగతిపాలు చేద్దామని చేతిలో పత్రికవున్నదని ఎంత ఖరాబు చేసుకున్నా శాంతారాం ప్రతిష్ఠ ఏమీ పోదు. "ద్రౌపది," "గ్వాలన్" చిత్రాలని తీసి ఎంతో గొప్పగా వ్రాసి, వ్రాయించుకున్న పటేల్‌యొక్క తత్వం ద్రౌపది, గ్వాలన్ మాచినతరువాత నయినా శ్రీ కె. కె. గార్కి తెలియకపోవటము చాల శోచనీయము. పటేల్ వ్రాసే చిత్రవిమర్శనుబట్టి అనేకులు 'ఫిల్మిండియా' ను కొంటున్నారని, ఆచిత్రాలకే వెళ్తున్నారని, శ్రీ కె. కె. గారు వ్రాశారు. వారు విమర్శించి బాగా డబ్బు వస్తుందనుకున్నవి కొన్ని మట్టికొట్టుకుపోయినవి. అనేకసినిమాఎగ్జిబిటర్సు (ఆంధ్రలో) ఆ విధంగా ఆధారపడి చాల దెబ్బతిన్నారన్నది నా అనుభవములో నేను తెలుసుకున్నాను. పటేల్ ఎందుకూ పనికిరావన్న చిత్రాలు డబ్బుచేసుకోలేకపోయినా మంచివనిపించుకున్నవికూడ వున్నవి.

విమర్శకుడు ఎన్నడూ నిర్మాత కాలేడు. ఈ సంగతి గతనెల రూపవాణిసంపాదకులు నిష్కర్షగా వెలిబుచ్చారు.

ఇకముందైనా శ్రీ కె. కె. గారు, విమర్శించేటప్పుడు అన్నీ ఆలోచించి అన్ని విషయాలూ అర్థంచేసుకుని వ్యాసాలువ్రాస్తే అందరికీ వుపయోగిస్తవని ఆశిస్తున్నాను. ఇది నా చిన్న సలహా. క్షమించండి.

★

కె. కె. సమాధానం

శ్రీ మోహనరాయ్‌గారు నా వ్యాసంలోని ఉద్దేశాన్ని సరిగా గ్రహించలేదు. ప్రస్తుతం సినిమా చిత్రనిర్మాణం జరిగే విధానాన్నిబట్టే సినిమా పత్రికలు చిత్ర నిర్మాతలమీద చాలా ప్రభావం కలిగిఉన్నాయనీ, "సినిమా చిత్రాలు నిజంగా ప్రజలను ఉత్తేజపరచటానికే జరిగితే, అవి మన సాంఘికచరిత్రలో ఒక విశిష్టస్థానం ఆక్రమించటానికి జరిగితే, ప్రజలే వాటికి నిజమైన విమర్శకులనే పరిస్థితి ఏర్పడితే" పత్రికలకీ ప్రభావం ఉండదనీ నా అభిప్రాయం. సినిమా పత్రికాధిపతిగా పటేల్‌కున్న పలుకుబడినిగురించి గాని, చిత్ర నిర్మాతగా శాంతారాం సంపాదించుకున్న ఖ్యాతిని గురించి గాని నాకు ఆక్షేపణ లేదు. కాని పటేల్ విమర్శలను నేను మన్నించలేదు. నాకా పెద్దమనిషిమీద ఎటువంటి ప్రత్యేకాభిమానమూ లేదు. శాంతారాంమీద ప్రత్యేకమైన అగౌరవమూ లేదు. కాని శాంతారాం ఆర్జించుకున్న కీర్తికి ఆయన చిత్రాలే ఆధారమని నేను నమ్మను. ఆయన చిత్రాలను గురించి నాకుగల భావాన్ని నేను ఋజువు చేసుకోగలననుకుంటాను. శ్రీ మోహనరాయ్ గారికి ఆ చిత్రాలమీద గొప్ప అభిప్రాయం ఉంటే నాకభ్యంతరమూ లేదు. పటేల్ శాంతారాంల దుమ్ములాటకు వెనక ఉండే చిత్రనిర్మాణ పరిస్థితులు నాకు ప్రధానంగాని పటేల్ శాంతారాంల వ్యక్తిగత వివరాలూ, గొప్పతనాలూ కావు.

"బ్లాక్ మెయిల్" గురించి నేనిచ్చిన నిర్వచనం గురించి సందేహం ఉంటే శ్రీ మోహనరాయ్‌గారు లాయర్లను విచారించవచ్చు.

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో; రాజమండ్రి



హిందీ సినిమాతార

సురయ్యా

సినిమా వార్తలు

ఫిలిం విచారణ సంఘం

ఫిలిం విచారణ సంఘానికి అధ్యక్షుడైన శ్రీ ఎస్. కే. పాటిల్ గత శుక్రవారం నాడు బొంబాయిలో పత్రికా విలేఖరులతో తాము తయారుచేసిన నివేదికను గురించి కొన్ని విషయాలు తెలిపాడు.


ప్రభుత్వంవారు ఈ నివేదికను ప్రకటించిన అనంతరం చిత్ర నిర్మాణశాఖ లన్నిటిలోనూ గొప్ప పరివర్తన కలుగుతుందని ఆయన చెప్పాడు. ఫిలిం విచారణ సంఘ సభ్యులందరు ఏకగ్రీవంగా చేసిన శిఫార్సులే నివేదికలో ఉన్నవట. నివేదిక 600 పేజీ లున్నదట.

శ్రీ పాటిల్ ఇంకా ఈ విధంగా చెప్పాడు:

"చిత్రనిర్మాణ వ్యవస్థాపనకు సంబంధించిన శిఫార్సులు కొన్ని చేశాము. వీటి ఫలితంగా చిత్ర పరిశ్రమకు సారధ్యం వహించే సంస్థ ఒకటి ఏర్పడి చిత్ర పరిశ్రమకు ప్రోత్సాహ సలహా సహాయాదులు చేస్తుంది; చిత్రనిర్మాణంలో నైపుణ్యమూ, బందోబస్తూ ఉండేలాగు చూస్తుంది. చిత్రాలు ఉత్తమ తరగతికి చెందేవిగా ఉండటానికీ, చిత్రపరిశ్రమకు చెందినవారికి ప్రభుత్వంతో సరిఅయిన సంపర్కం ఏర్పడి వారు ప్రభుత్వశాఖలచుట్టూ తిరగకుండా తగిన ఏర్పాట్లు కూడా సూచించాం."

చిత్ర నిర్మాతల పెట్టుబడి అవసరాలను గురించీ, పన్నులభారం గురించి, చిత్ర నిర్మాతలకూ, డిస్ట్రిబ్యూటర్లకూ, ఎగ్జిబిటర్లకూ గల సంబంధాలను గురించీ విచారణ సంఘం చర్చించిందట. ఈ సంఘం చేసిన శిఫార్సులు అమలు జరిగినట్లయితే చిత్ర పరిశ్రమలో ఆర్థికంగా గొప్ప పరిణామం జరుగుతుందని పాటిల్ తెలిపాడు.

విద్యాబోధక చిత్రాలను గురించీ, డాక్యుమెంటరీ చిత్రాలను గురించీ కూడా విచారణసంఘం చర్చించిందట. ఇటువంటి చిత్రాలను తయారుచేసి వాటిద్వారా జాతీయ పునర్నిర్మాణం సాగించాలంటే కొన్ని సంస్థలు, శిక్షణ సంస్థలూ అవసరమని కమిటీవారు గుర్తించారట.


విజయావారి 'పెళ్లి చేసిచూడు' చిత్రంలో దొరస్వామి, పుష్పలత, [illegible]

"పెళ్ళిచేసిచూడు"

విజయ ప్రొడక్షన్సువారు ఫిబ్రవరి 28 న "పాతాళ భైరవి" షూటింగు ముగించుకుని ఆరోజునే "పెళ్ళిచేసిచూడు" అన్న చిత్రాన్ని ప్రారంభించారు. "షావుకారు" తీసిన వ్యక్తులు మళ్ళీ "పెళ్లిచేసిచూడు" లో కలుస్తున్నారు. కథా, సంభాషణలూ, నిర్వహణా చక్రపాణివి; దర్శకుడు ప్రసాద్; సంగీతం ఘంటసాల; ఆర్టిస్టు గోఖలే. అయితే "షావుకారు" లాగ కాక "పెళ్లిచేసిచూడు"లో మొదటి నుంచి చివరదాకా హాస్యం ప్రధానంగా ఉంటుంది. హాస్యనటుడు జోగారావు ఇందులో ముఖ్యపాత్ర ధరిస్తున్నాడు. జి. వరలక్ష్మి, ఎన్. టి. రామారావు, దొరస్వామి, కుందు, రంగారావు, సురభి కమల, పుష్పలత, సూర్యకాంతం, వంకయ్య మొదలైనవారు ఇతరపాత్రలు ధరిస్తున్నారు.

పాతాళభైరవి

"పాతాళ భైరవి" రికార్డింగుకూడా పూర్తిఅయిపోయింది. సెన్సారుచేసి విడుదల చెయ్యటమే తరువాయి. కె. వి. రెడ్డి డైరెక్షను కింద, ఎన్. టి. రామారావు, రంగారావు, మాలతి, రేలంగి, పద్మనాభం, సి. ఎస్. ఆర్. బాలకృష్ణ మొదలైన నటులతో తయారైన ఈ చిత్రంలో "బాక్ ప్రొజెక్షన్" ఉపయోగించబడింది.

★


విజయావారి "పా[illegible] భై[illegible]" [illegible] కలిపురుష నృత్యం.

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

15

లోకంచేత విస్మరించబడి, సాటిమానవుల అనునయ వాక్యాలకు ముఖంవాచిన ఖైదీ ఏయే బాధలకు గురౌతాడో, అన్నిటినీ డాంటే అనుభవిస్తున్నాడు. నేరం చెయ్యలేదన్న భావన వల్ల కలిగే ఆత్మాహంకారం మొదట అతనికి స్థైర్యమిచ్చింది. కాని క్రమంగా అది సడలిపోవడం ప్రారంభించింది. తాను నిజంగా దోషంచేసి ఉన్నాడేమో నని శంకించడం మొదలు పెట్టాడు. అప్పుడతన్ని దైన్యం ఆవహించింది. అయినా అతను సర్వాంతర్యామిని ప్రార్థించలేదు. మానవునే ప్రార్థించాడు. ఈ కూపంనుంచి మరొకచోటికి మార్చవలసిందని, అదెటువంటి చోటైనాసరే మార్పుచేస్తేచాలని, ఆవరణలో నడవ నివ్వాలని, చదువుకోడానికి గ్రంథాల నివ్వాలని, ప్రార్థించేవాడు. అతని కోరికల్ని అధికారులు మన్నించకపోయినా ప్రాధేయపడం మానేవాడుకాదు. కొత్తగా వచ్చిన జైలర్‌తో చనువుగా మాట్లాడేవాడు. కాని కొత్తజైలర్ నోరుమెదిపేవాడు కాదు. అయితే ఏం? మూగవానితోనైనాసరే మాట్లాడ్డం, అదొక తృప్తిగా ఉండేది. తన కంఠస్వరం తానే వినడానికి మాట్లాడేవాడు. ఒంటరిగా ఉన్నప్పుడు తనలోతాను మాట్లాడుకోడానికి ప్రయత్నించాడు. కాని భయపడిపోయాడు. డాంటే స్వేచ్ఛగా తిరిగినరోజుల్లో ఖైదీల్ని చూశాడు. దొంగలు, గజదొంగలు, హంతకులు, లేని ఉల్లాసం తెచ్చిపెట్టుకుని మొరటు కేకలతో గడపడం చూశాడు. ఆవిధంగా తనని పదిమంది ఖైదీలతో చేర్చినా కొంత నయంగా ఉండేది. రోజురోజూ జైలర్ కరుకుచూపులు తప్ప ఇంకొక ముఖమే కనిపించదు. అతని కంటె బానిసలు, హంతకులు, దోపిడిదొంగలే సుఖంగా ఉన్నారు. వాళ్లు కలిసి ఉంటారు. ఆకాశం చూడగలరు. వీచే గాలిలో తిరగగలరు. తనకి మరొక ఖైదీ తోడుగా ఉండాలని, ఒకనాడు జైలర్‌ని కోరాడు. ఎవరినిచ్చినా సరే అంగీకారమే నన్నాడు. పిచ్చెత్తిన ఫాదరీ అయినాసరే చాలన్నాడు. జైలర్ కర్కశస్వరం మాటున, మానవసహజమైన కారుణ్యం ఇంకా పూర్తిగా మణిగిపోలేదు. పైకివ్యక్తపరచకపోయినా, జైలర్ ఈయువకుని మనోవ్యథనుగుర్తించి లోలోన జాలిపడేవాడు. 34 నంబరు బందీ కోరికను గవర్నర్‌కి తెలియపరిచాడు. ఇది బందీల్ని కుట్రకిపురికొల్పడానికో, తోడుతీసుకుని పారిపోడానికో పన్నాగమని అనుమానించి గవర్నర్ నిరాకరించాడు.

మానవుల్ని ప్రార్థించి పొందగలిగిన దానిని డాంటే కడవరకూ చూసి, విఫలుడైతరవాతనే తన ధ్యానాన్ని భగవంతునిపైకి మరల్చాడు. నిత్యం కష్టాలలో కాపురంచేసే నిర్భాగ్యుల ప్రార్థనలు, పవిత్రయోచనలు అతని తలపుకు వచ్చి కొంత ఉపశాంతినిచ్చాయి. చిన్నతనంలో తల్లి నేర్పిన భగవత్ప్రార్థనలు జ్ఞప్తికి వచ్చాయి. వానిలో అతనికి నూతనార్థాలు స్ఫురించాయి. ఈమారు పవిత్రకాంక్షతో, చిత్తశుద్ధితో భగవంతుని ప్రార్థించాడు. ఒంటరితనంలో తన స్వరాన్ని తాను వినే భీతి తొలగిపోయింది. గొంతెత్తి భగవంతుని కీర్తించాడు. కీర్తించి డాంటే ఆనంద వివశుడైనాడు.

అయితే ఎంత ప్రార్థించినా డాంటే బందీగానే ఉండిపోయాడు. దైవంకూడా కనికరించలేదు! తిరిగి క్రమంగా అతన్ని నిస్పృహ ఆవహించింది. డాంటే విద్యాహీనుడు. గాంభీర్య మెరగడు. గతజీవితంలో కొద్ది సంవత్సరాలే అతనికి వెలుగునీ ఆనందాన్నీ ఇచ్చాయి. భవిష్యత్తు అనేది ఉన్నదో లేదో తెలియదు. ఆ స్వల్పకాలపు వెలుగే జీవితమంతకీ గుడ్డివెలుగు నిస్తున్నది. పంజరంలో డేగ బంధించబడినట్లు, అతని స్మృతి ఆ అల్ప వ్యవధికే పరిమితమై పోయింది. అకారణంగా, దుర్విధికుట్రవల్ల భగ్నమైపోయిన ఆ అల్పసౌఖ్యానుభవాన్ని జారిపోకుండా పట్టుకుని వేలాడుతున్నాడు. డాంటే ఎప్పుడూ శారీరకబలంపైన విశ్వాసంతో ఉండేవాడు. ఇప్పుడా విశ్వాసం నశించింది—అనేకమందికి నశించినట్లే. కాని ఈ అనుభవంకూడా అతనికి ఫలించలేదు. మతానురక్తి పోయి, నిష్ఠురకోపం అతన్ని ఆవహించింది. జైలర్‌ని అనరాని మాటలన్నాడు. వినలేక జైలర్ చెవులు మూసుకుని పారిపోయేవాడు. గోడపై తల కొట్టుకునేవాడు. క్రోధాన్ని పరిసరాలపైన తీర్చుకునేవాడు.

తనపై నేరంమోపిన ఉత్తరం విల్‌ఫర్ట్ చూపించినది జ్ఞప్తికి వచ్చేది. తన అధోగతికి హేతువు ఈశ్వరాగ్రహం కాదనీ, మానవుల ద్వేషమేననీ చెప్పుకునేవాడు. బుద్ధి కల్పన కెంతవరకు వీలుంటుందో, అంతవరకూ అన్నివిధాల శిక్షల్నీ తలపోసి తన శత్రువుల్ని మానసికంగా ఆ శిక్షలకి గురిచేసేవాడు. తన శత్రువులకి ఈశిక్షలు చాల వనుకునేవాడు. వాళ్లు చావకూడదు. బ్రతికి ఉండే యాతనలన్నీ అనుభవించాలని కోరుకునేవాడు. చావనేది భయపడవలసింది కాదని పదేపదే భావించిన అతనికి క్రమంగా ఆత్మహత్య చేసుకోవాలనే తలపుకూడా వచ్చింది.

ఆత్మహత్యాభావం అతనికి సంతృప్తి నిచ్చింది. అది భూతకాలానికీ భవిష్యత్కాలానికీ మధ్య అఖాతంవంటిది. ఈ అఖాతానికి దిగువ మట్టమనేది ఉండదు. సర్వ దుఃఖాలూ కష్టాలూ నిద్రలోవలె కళ్లు మూసుకుంటాయి. ఆపైన చైతన్యమే ఉండదు. మనోనేత్రంలో మెదుల్తున్న సర్వరూపాలూ చెగిరిపోతాయి. మృత్యుదేవత తన్ను కరుణించడానికి వచ్చి గోడమూల నిలబడి ఉన్నదని భావించేవాడు. ఆ దేవతను చూసి గత యాతనా స్మృతులు పికాపికలై పారిపోతున్నట్లుంది. ఇప్పుడాంటే గతాన్ని

అనువాదం: సీతారామ్

గురించి శాంతచిత్తంతో తలపోయగలుగుతాడు. భవిష్యత్తును గురించి తలుచుకుంటేమాత్రం గుండె చెదిరిపోయేది. అందువల్ల ఆ రెండింటిమధ్యనూ ఒక విశ్రాంతినిలయాన్ని మనస్సులో స్థాపించుకున్నాడు.

డాంటే ఇలా తలపోశాడు: "నేను స్వేచ్ఛగా ఉన్న రోజుల్లో, నా దీర్ఘ ప్రయాణాలలో, ఎన్నిమార్లు ఆకాశంలో మేఘాలావరించడం, చూశాను! తరంగాలు శివమెత్తి తాండవించడం తుఫాను చెలరేగి తన రెక్కలతో ఆకాశపు టంచుల్ని తాడించగా ఎన్నిమార్లు చూడలేదు! ఒక్కొక్కప్పుడు సముద్రాలలో, ఉవ్వెత్తుగా లేచి మీదికి వచ్చిపడుతున్నట్లు కనిపించే కొండలు గుట్టలు, మృత్యువునీడలవలె కనిపించేవి. హడలిపోయేవాడిని. వాని నుంచి తప్పించుకోడానికి సర్వయత్నాలూ చేసేవాడిని. నేనప్పుడు జీవితాన్ని ఆనందంగా గడిపేవాడిని. ఆ ఆనందాన్ని కాపాడుకోడంకోసం ప్రాణాల్ని కాపాడుకునేవాడిని. కాని ఇప్పుడదేమీలేదు. జీవితంపైన కాంక్ష జనింపచెయ్యగల ప్రతి అంశమూ నష్టమైపోయింది. జోలపాడుతూ పసిబిడ్డని నిద్రపుచ్చే దాని చిరునవ్వు నవ్వినట్లుగా, మృత్యువు నన్నుచూసి నవ్వుతోంది."

ఈ యోచనతో యువకుని చంచలభావపరంపర ప్రశాంతమయింది. ఇప్పుడు విధికి శిరసాగ్గుతున్నాడు. జీర్ణవస్త్రంవలె జీవితాన్నికూడా కోరినప్పుడు విసర్జించవచ్చును. అందువల్ల ఇంక ఈ బ్రతుకు నెట్టడం కొంత సులువయింది.

జీవితాన్ని అంతమొందించుకోడానికి రెండు మార్గాలున్నాయి. వీనిలో సులువైనపద్ధతి పై కిటికీ ఊచకి తువ్వాలు కట్టి కంఠానికి ఉరివేసుకుని వేలాడ్డం. రెండో మార్గం, ఆహారంతీసుకుంటున్నట్లు నటిస్తూ, ఆ మరణాంతంఉపవాసం చెయ్యడం. మొదటి పద్ధతి తలుచుకున్నప్పుడు డాంటేకి ఒళ్లు జలదరించింది. ఇది అతిక్షుద్రమైన దనుకున్నాడు. అందువల్ల రెండో మార్గం అవలంబించాలని నిశ్చయాని కొచ్చాడు.

కాని ఈ రీతిగా నాలుగేళ్లు గడిచిపోయాయి. చిట్టచివరికొకనాడు "నేను మరణించి తీరాలి" అని నిశ్చయపరుచుకున్నాడు. నిశ్చయం సడలిపోతుందనే భయంతో ఈసారు ఘోరప్రమాణం తీసుకున్నాడు. ఉదయం, సాయంకాలం జైలర్ తెచ్చి ఇచ్చే ఆహారాన్ని కిటికీలోనుంచి పారవేసి, తిన్నట్లు నటించాలనుకున్నాడు. ఈ మారు నిజంగానే ఆహారం పారవేశాడు. ఆ కిటికీలోనుంచి ఆకాశం కొద్దిగా కనిపిస్తుంది. అటు చూస్తూ రోజూ రెండుమార్లూ పారవేసేవాడు. మొదట రెండో ఆలోచన ఉండేదికాదు. తరవాత కొంతసేపు యోచించి అప్పుడు పారవేసేవాడు. ఆపైన చెయ్యి వెనకాడేది. పారవేసేటప్పుడు చింత కలిగేది. తరవాత పారవెయ్యడానికి మాటిమాటికీ తన ప్రతిజ్ఞను జ్ఞప్తికి తెచ్చుకోవలసి వచ్చేది. ఇదివరలో అసహ్యంపుకున్న ఆ ఆహారం నేడు ఆకలి పీడనవల్ల నోరూరిస్తోంది. పళ్లెం చేతపట్టుకుని ఒక్కొక్కప్పుడు గంటసేపు దాని వంక చూస్తూ ఉండిపోయేవాడు. దృష్టి దానిపైనే లగ్నమై ఉండేది. అప్పుడప్పుడూ కూపం పాడుగా లేదనిపించేది. భవిష్యత్తుకూడా అంత నిరాశపడవలసినది కాదని భావించేవాడు. అతనింకా యువకుడు. ఇంకా ఏభైయేళ్లయినా జీవించవచ్చును. ఈ యేభై ఏళ్లలో అనుకోని సంఘటనఏదైనా సంభవించకూడదా? ఎప్పుడో చెరసాల తలుపులు తెరుచుకుని అతనికి స్వాతంత్ర్యాన్నివ్వకపోతాయా? చేత గుప్పెడు రొట్టి తీసుకుని దానివంక తీక్షణంగా చూసేవాడు. అది పెదవులవరకూ వచ్చి ఆగిపోయేది. వెంటనే ప్రతిజ్ఞ మనస్సులో తటుక్కున మెరిసేది. తన నిశ్చయాన్ని భగ్నం చేసుకునే దైన్య స్థితిని తల్చుకుని తిరిగి స్థైర్యం తెచ్చుకునేవాడు. అకుంఠిత మనోదార్ఢ్యంతో తన ప్రతిజ్ఞను నెరవేరుస్తున్నాడు. క్రమంగా అతనికి సత్తువ తగ్గిపోయింది. ఒకనాడు లేచి నిలబడలేనంత నీరసస్థితికి వచ్చాడు. తెచ్చిన ఆహారాన్ని పై కిటికీగుండా పారెయ్యడానికి కూడా ఓపికలేకపోయింది. అతని ఆరోగ్యం చెడిపోయి ప్రమాదంలో పడ్డాడని జైలర్ భావించాడు. మరణం ఆసన్నమౌతున్నదని డాంటే ఆశపడ్డాఆ రోజు అలా గడిచిపోయింది. అతనికిమత్తు అవరిస్తున్నట్లయింది. చైతన్యం ఉడిగిపోడం అతనికి కొంత సుఖమిచ్చింది. కడుపులో నరాల నులిమిడి తగ్గుతోంది. గొంతుక కాలే దాహం తగ్గుతోంది. కళ్లు మూసుకుంటే ఏవో చక్కని కాంతులు దృష్టిలో నాట్యం చేస్తున్నాయి. అవి మృత్యుద్వారంలోని సంధ్యాకాంతులనుకున్నాడు.

ఆ రాత్రి తొమ్మిది గంటలవేళ అకస్మాత్తుగా దగ్గర గోడ కావలివైపున అస్పష్టమైన ఒక శబ్దం అతనికి వినవచ్చింది. ఈ కూపంలో అనేక రకాల కీటకాల ధ్వనులు విని నిర్లక్ష్యంగా ఊరుకోడం అతని కలవాటే. కాని నిరాహార స్థితివల్ల కాబోలు అతని జ్ఞానేంద్రియాలు ఇప్పుడు చురుగ్గా పనిచేస్తున్నాయి. లేదా ఆ శబ్దం పెద్దదై ఉండాలి. లేక ఈ క్లిష్టస్థితిలో మామూలు శబ్దాలు అలా వినిపించి ఉండాలి. తలెత్తి చెవి ఒగ్గి విన్నాడు. గట్టి గోళ్లతోనో, పళ్లతోనో, ఇనప పరికరంతోనో రాళ్లపై గీకుతున్నట్లు వినవచ్చింది.

పూర్తిగా శక్తి నశించిన ఆ యువకునికి వెంటనే స్వేచ్ఛ అనేభావం తట్టింది. ఖైదీలందరికీ కలిగే భావం ఇదేకదా! శ్రవణేంద్రియంచల్లార నున్నప్పుడే ఈ శబ్దం వినవచ్చినందువల్ల కాబోలు, డాంటేకిభగవంతుడే హెచ్చరిస్తున్నాడని తోచింది. మృత్యుగహ్వరంప్రవేశిస్తున్న అతన్ని ఈశబ్దం నివారించింది. తనను ప్రేమించే ఏ మిత్రులైనా తనకోసం వస్తున్నారేమో! దాదాపు మూడుగంటల సేపు ఈ శబ్దం వినపడింది. తరవాత ఏదో పడినట్లు గభాలున ధ్వని అయింది. ఆపైన శబ్దం ఆగిపోయింది. తరవాత మళ్ళీ కొన్నిగంటలకి శబ్దం వినవచ్చింది.

డాంటేకి ఆసక్తి హెచ్చింది. కాలక్షేపానికి ఇది బాగానే ఉంది. ఇంతలో జైలర్ హఠాత్తుగా ప్రవేశించాడు. నిరాహారదీక్ష అవలంబించిన ఈ నాలుగురోజులూ డాంటే జైలర్‌తో ఒక్కసారైనా మాట్లాడలేదు. సంగతేమిటని జైలర్ ప్రశ్నించినప్పుడు సమాధానమివ్వక ముఖం గోడవైపు తిప్పుకుని పడుకున్నాడు. కాని ఇవాళ శబ్దం విని జైలర్ అనుమానిస్తాడని డాంటే భయపడ్డాడు. ఇదమిద్ధమని తెలియని ఆ ఆశ కూడా అంతరిస్తుందనుకున్నాడు. జైలర్ ఆహారం తీసుకువచ్చాడు. డాంటే పడకపైనుంచి లేచాడు. గబగబా అదీ ఇదీ అని విచక్షణ లేకుండా బడబడ వాగటం మొదలుపెట్టాడు. ఆహారం పాడుగా వుందని, నేల తేమగా ఉందని, ఏది మనస్సుకి తట్టితే దాన్నిగురించి వాగాడు. జైలర్‌ని దూషించాడు. నీరసించిన డాంటే నిమిత్తం ప్రత్యేక శ్రద్ధతో వేడి రొట్టి తెచ్చిన జైలర్‌కి విసుగెత్తింది. సంధి పట్టుకుందనుకున్నాడు జైలర్. ఆహారం అక్కడ పడేసి వెళ్లిపోయాడు. వెళ్లిపోగానే డాంటే మళ్లీ చెవులు రిక్కించి విన్నాడు. ఈమారు శబ్దం స్పష్టంగా వినపడింది.

"ఎవరో నావంటి నిర్భాగ్యుడే" అనుకున్నాడు డాంటే. "తప్పించుకోడానికి దారి చేసుకుంటున్నాడు కాబోలు. పాపం నేనుకూడా దగ్గరుంటే సహాయంచేసేవాణ్ని కదా!"

కాని ఇంతలోనే అతని ఆశ మూసుకుపోయింది. నిత్యం దుఃఖానికే అలవడిన అతనికి ఆనందమనేది నమ్మరానిది. పక్క కూపాన్ని మరమ్మత్తు చేయిస్తున్నారు కాబోలనుకున్నాడు. అదయితే అడిగితే తెలుస్తుంది. కాని అడగడంఎలాగ? ఈమారు జైలర్ వచ్చినప్పుడు తాను మౌనంగాఉండి చూడాలనుకున్నాడు. శబ్దాన్ని జైలర్ విన్నప్పుడు అతని ముఖలక్షణాలు గమనిస్తే గ్రహించవచ్చును. కాని దానివల్లఆశ భగ్నమై పోతుందే? నీరసించిన ఆ యువకుని యోచనలు అతకలేదు. సత్తువ తెచ్చుకోవలసిన అవసరం అతనికి గోచరించింది. మెల్లిగా లేచివెళ్లి దొన్నె ఎత్తి పెదవులకు పట్టించి పులుసు తాగేశాడు. ఇప్పుడెంతో తృప్తికలిగిందతనికి.

క్రమంగా సత్తువచేరింది. అప్పుడిలా అనుకున్నాడు: "పరిశీలించి చూడాలి. కాని ఎవ్వరినీ బయటపడనివ్వకూడదు. ఎవ్వరికీ తెలియనివ్వకూడదు. నేనుగోడపైన తట్టుతాను. కూలీలే మరమ్మతు చేస్తున్నట్లయితే, విని ఒక్కసారి ఆగినా, వెంటనే మళ్లీ పని మొదలుపెడతారు. ఖైదీయే తవ్వుతున్నట్లయితే భయపడతాడు. కనుక్కుంటారని భయపడి, మళ్లీరాత్రివరకూ పని మొదలుపెట్టడు. అప్పటికి అందరూ నిద్రపోతారనే భావంతో మళ్లీ తవ్వుతాడు."

ఎడ్మండ్ మళ్లీ లేచాడు. ఒక మూలకు వెళ్లి చిన్న బెడ్డతీశాడు. శబ్దం ఎక్కడ ఎక్కువగా వినవస్తోందో చూసి గోడపైన అక్కడ బెడ్డతో తట్టాడు. వెంటనే అవతలశబ్దం నిలిచిపోయింది. డాంటే చెవులు రిక్కించి అతిజాగ్రత్తగా విన్నాడు. గంటయినా మళ్లీ ఆశబ్దం వినపడలేదు. రెండుగంటలైనా వినపడలేదు. డాంటేకి ఆశపుట్టింది. రొట్టెముక్క కొంత కొరికి తిన్నాడు. కొద్దిగా నీరు తాగాడు. తన పూర్వపు బలమంతా తిరిగికోలుకున్నట్లయింది.

ఆ రోజంతా ఏ శబ్దం లేకుండా గడిచిపోయింది. రాత్రి పడింది. అయినా శబ్దం లేదు. అమితానందంతో డాంటే అనుకున్నాడు "ఖైదీయే!"

రాత్రంతా శబ్దం వినపడలేదు. రాత్రి ఒక్క క్షణంకూడా డాంటేకి కంటిపైన కునుకు లేదు. మర్నాడు ఉదయం జైలర్ ఆహారం తీసుకొచ్చాడు. డాంటే గబగబా తినేశాడు. శబ్దం వినవస్తుందని ఆశతో కూచున్నాడు. గోడపై తట్టినది ఇంకొక ఖైదీయేనని గ్రహించలేకపోయిన ఆ ఖైదీ అవివేకానికి డాంటే చికాకుపడ్డాడు.

మూడు రోజులు— డబ్భైరెండు గంటలు, గడిచిపోయాయి. డాంటే నిమిషనిమిషమూ లెక్కపెడుతున్నాడు. చివరి కొకనాడు సాయంకాలం, జైలర్ ఆహారమిచ్చి వెళ్లిపోయిన తరవాత, డాంటే చెవిని గోడ కానించి ఆలకిస్తున్నప్పుడు తలకు చిన్న అదురు దెబ్బ తగిలినట్లయింది. డాంటే వెనక్కి ఒక అడుగు వేశాడు. రెండుసార్లు అటూ ఇటూ పచారుచేశాడు. మళ్ళీ చెవి గోడ కానించి విన్నాడు. ఇంక సందేహం లేదు. అవతలవైపున ఎవరో ఏదో చేస్తున్నారు. అయితే ఈమారు శబ్దం అస్పష్టంగా ఉంది.

ఇది కనిపెట్టినప్పుడు డాంటేకి చెప్పరాని ధైర్యం కలిగింది. రెండో ఖైదీకి సహాయపడాలని నిశ్చయించుకున్నాడు. గోడపై ధ్వని వస్తున్నచోటికి దాపునే ఉన్న పడక ఎత్తాడు. తేమగా ఉన్న సిమెంటును గోకెయ్యడానికి వీలైన పరికరంకోసం చుట్టూ గాలించాడు. సిమెంటు గోకేస్తే ఒక రాయి తీసెయ్యటానికి ప్రయత్నించవచ్చును. పదునైన పరికరం ఏదీ కనిపించలేదు. పై కిటికీకి ఊచలున్నాయి. కాని వాటిని కదల్చడంకూడా అసంభవమని అతనికి తెలుసును. గదిలో ఉన్నవి పడక, కర్ర కుర్చీ, ముక్కాలి పీట, ఒక లోటా, ఒక కూజా. పడక కిందచట్రానికి ఇనుప బద్దలున్నాయి. కాని అవి స్క్రూలతో కర్రలో గట్టిగా బిగించబడినాయి. స్క్రూడ్రైవర్ ఉంటే కాని అవి రావు. కుర్చీ, పీట పనికిరావు. ఇదివరలో లోటాకి పట్టుకోడానికి చెవి ఉండేది. అది కాస్తా తీసేశారు. ఇంక మిగిలినది ఒక్కటే. కూజాని బద్దలు కొట్టాలి. ఒకపెంకుతో పని ప్రారంభించాలి. కూజా నెత్తి గట్టిగా నేలకేసి కొట్టాడు. ముక్కముక్కలైంది. ముక్కల్లో పదునైనవీ, గట్టివీ రెండుమూడు పెంకు లేరాడు. మళ్ళీపడక వేసి ముక్కల్ని దానికింద దాచాడు.

రాత్రిపడిన తరవాత పడక ఎత్తేసి, డాంటే ఒక పెంకుతో గోడగీకడం మొదలుపెట్టాడు. కాని చీకటిలో అట్టే పని సాగలేదు. అదీకాక పెంకులు పదునుపోయి మొద్దుబారాయి. గట్టిరాయి కాబోలు పెంకులకు తగిలింది. అంతటితో పని ఆపుచేసి, పడకని యథాస్థానంలో చేర్చి పగటి వెలుగుకోసం నిరీక్షించాడు. ఆశతోపాటు అతనికి అపారమైన ఓరిమికూడా వచ్చింది.

తెల్లవారింది. జైలర్ వచ్చాడు. నీళ్లు తాగుతున్నప్పుడు చెయ్యి జారికూజా బద్దలైందని డాంటే చెప్పాడు. తిట్టుకుంటూ కొత్త కూజాతీసుకురావడానికి జైలర్ వెళ్లాడు. అయితే పాతకూజా పెంకులు ఎత్తి పారెయ్యలేదు. త్వరలోనే తిరిగివచ్చి కొత్తది ఇచ్చి, ఈమారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించి వెళ్లిపోయాడు. తలుపుల గరగర ఈమారు గుండెల్లో మంట రెచ్చగొట్టేబదులు, ఆనందాన్ని రేకెత్తించింది. కొంతసేపైన తరవాత పడక ఎత్తేశాడు.

కిటికీలోనుంచి వచ్చిన గుడ్డివెలుగులో చూశాడు. ఇంతవరకూ తాను చెక్కినది ఒక్కరాతిపైనని చూశాడు. చుట్టూ ఉన్న సిమెంటు తవ్వనే లేదు. తేమవల్ల ఇక్కడ సిమెంటు మెత్తబడింది. దాన్ని ఇప్పుడిట్టే చెక్కేశాడు. అర్ధగంటలో గుప్పెడు సిమెంటు తీశాడు. ఇన్నాళ్లుగా ఈపనికి పూనుకోనందుకు డాంటే తన్ను తాను నిందించుకున్నాడు. ఆశా నిరాశల్లోనూ, ప్రార్థనలోనూ తన కాలాన్నింతవరకూ వ్యర్థపరిచాడు. ఇంతవరకూ ఈ కూపంలో గడిపిన ఇన్నేళ్లలోనూ ఎంత పనిసాధించ గలిగి ఉండేవాడు! ఈ యోచనతో అతనిలో కొత్త ఉత్సాహం, పట్టుదల కలిగాయి. మూడురోజులు అతి జాగ్రత్తగా కృషిచేసి రాతిచుట్టూ సిమెంటు చెక్కేశాడు. ఈగోడలో గతుకులరాళ్లు పేర్చబడి ఉన్నాయి. మధ్యమధ్యమాత్రం చెక్కబడిన రాళ్లున్నాయి. ఇప్పుడు సిమెంటు పోయి బైటపడినది చెక్కబడిన రాయి. దీన్ని కదిలించి ఊడబెరకాలని డాంటే ప్రయత్నించాడు. ముందు గోళ్లుపయోగించాడు. కాని ప్రయోజనం లేకపోయింది. నెరదల్లో కూజా పెంకులు పెట్టి ఎత్తడానికి చూశాడు. కాని పెంకులు ముక్కలైనాయి. గంటసేపు వృథా యత్నాలు చేసి చివరికి డాంటే లేచి నిల

బడ్డాడు. ముఖాన చెమట తుడుచుకున్నాడు. అప్పు డతనికొక ఉపాయం తట్టింది. చిరునవ్వు నవ్వాడు.

జైలర్ ఎప్పుడూ ఒక రేకుపళ్లెంలో పులుసు తీసుకొస్తాడు. ఈ పళ్లానికి ఇనపకాడఉంది. ఇప్పుడది తీసుకోవా లనుకున్నాడు డాంటే. ఆ ఇనపకాడకోసం తన జీవితంలో పదేళ్లు వెచ్చించడానికి కూడా వెనుదియ్యడు. జైలర్ రేకుపళ్లెంతో పులుసు తీసుకొచ్చి ఒక మూకుడులో పోసేవాడు. ఆహారంతీసుకోగానే డాంటే మూకుడు కడిగిఉంచేవాడు. ఆరోజు సాయంత్రం మూకుడు తీసి, ముక్కాలి పీటకీ ద్వారానికీ మధ్యగాదారిలో ఉంచాడు. జైలర్ తలుపుతోసుకువచ్చి మూకుడు తొక్కాడు. అది పగిలిపోయింది. పులుసు పొయ్యడానికి ఇంకొకపాత్రకోసం జైలర్ చుట్టూచూశాడు. ఏదీ కనిపించలేదు.

"ఆ పళ్లెం ఇక్కడెందు కుంచకూడదు? రేపుపొద్దున్న వచ్చి నప్పుడు తీసుకుపోదువుగాని" అన్నాడు డాంటే.

ఇంకోమూకుడు తీసుకు రావడానికి సంకోచిస్తున్న జైలర్‌కి ఇది నచ్చింది. పళ్ళాన్ని అక్కడ వొదిలేసి వెళ్లిపోయాడు. డాంటే ఆనందంతో వొణికిపోయాడు. గబగబా పులుసూ మాంసం కాజేశాడు. జైలర్ మళ్లీ మనస్సు మార్చుకుని రావచ్చుననే ఉద్దేశంతో సరిగ్గా ఒక గంటసేపు చూశాడు. తరవాత పక్క ఎత్తేశాడు. చెక్కినచోట రాతికింద పళ్ళెంకాడని పెట్టిఎత్తడానికి ప్రయత్నించాడు. రాయి కొద్దిగా కదిలింది. గంటసేపు ఇలా కష్టపడిన తరవాత రాయి ఊడివచ్చింది. అడుగున్నర మేర కంత ఏర్పడింది.

చెక్కిన మట్టిఅంతా జాగ్రత్తగా పోగుచేసి ఒకమూలకి తీసుకెళ్లాడు. అక్కడొకచోట కూజాపెంకుతో చిన్న గొయ్యి తవ్వి సిమెంటుపొడి అందులోపోసి మళ్లీ పైన మట్టిని సమానంగా మెత్తేశాడు. తరవాత మళ్ళీ కంత దగ్గరకొచ్చి తవ్వడం మొదలెట్టాడు.

మర్నాడు ఉదయం రాతిని కంతలో పెట్టి మూసేసి పక్క వేసి పడుకున్నాడు. జైలర్ వచ్చి రొట్టె ఇచ్చాడు.

"అయితే ఇంకో మూకుడు తేలేదన్నమాట" అన్నాడు డాంటే.

"లేదు" అన్నాడు జైలర్. "నువ్వు కూజా బద్దలుకొట్టావు. మూకుడు దారిలోపెట్టావు. దాన్ని నేను తొక్కాను. ఈ పళ్లెం ను వ్వుంచుకో. అందులోనే ఆహారం పెడుతూ ఉంటాను. దీన్ని బద్దలుకొట్టలేవు." డాంటే మనస్సులో భగవంతునికి నమస్కరించాడు. జీవితంలో ఎన్నడూ ఏ వ్యక్తిపట్ల కాని భగవంతునిపట్ల కాని కలగని కృతజ్ఞతా భావం డాంటేకి ఇప్పుడీ రేకుముక్కపట్ల కలిగింది. అయితే ఇప్పుడొకటి తెలిసివచ్చిం దతనికి· తన పని మొదలెట్టిన తరవాత అవతలవైపున ఆ ఖైదీ తనపని నిలిపేశాడు. అంతమాత్రానికి తను మాన నవసరం లేదనుకున్నాడు డాంటే-పొరుగు ఖైదీ తనవద్దకు రాకపోతే, తనే అతనివద్దకు వెళ్లాలి. రోజంతా క్షణంవిశ్రాంతి తీసుకోకుండా డాంటే కృషిచేశాడు. సాయంత్రానికి పదిరాళ్లు, సిమెంటు తీసేశాడు.

మళ్ళీ జైలర్ వచ్చేసమయానికి వొంగిన పళ్లెంకాడ చేతనైనంతవరకు వంకరతీసి మామూలుచోట ఉంచాడు. జైలర్ ఆహార మిచ్చి వెళ్ళిపోయాడు. జైలర్ వెళ్ళిన తరవాత డాంటే శ్రద్ధగా చెవి ఒగ్గి విన్నాడు. నిజంగా పొరుగునున్న ఖైదీ తన పని మానేశాడా? తెలుసుకోవా లనుకున్నాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. డాంటే నిశ్వాసం విడిచాడు. తనని తన పొరుగు ఖైదీ నమ్మడం లేదు. అయినా డాంటే నిరుత్సాహపడలేదు. రెండుమూడు గంటలు శ్రమపడి తవ్విన తరవాత ఏదో అడ్డు తగిలినట్లయింది. చేత్తో తడిమి, తట్టిచూశాడు. అది ఒక దూలం. సరిగ్గా డాంటే తవ్విన కన్నాన్ని కప్పుతోంది. ఇప్పు డింక దూలానికి పైనకాని కిందకాని తవ్వాలి. డాంటే ఇటువంటి ఆటంకం వస్తుం దనుకోలేదు.

"అయ్యయ్యో! చివరి కిదేనా! ఈశ్వరుడు నా ప్రార్థన ఆలకించా డనుకున్నానే! నా స్వేచ్ఛని అంతం చేశాడు. మృత్యువులో సర్వం విస్మరించా లనుకుంటే అది నిరాకరించి నాకు మళ్ళీ ప్రాణం పోశాడు. అయ్యో! భగవంతుడా. నాపైన దయరాదా? నన్నిలా నిస్పృహలో ముగ్గిపోనిస్తావా?" అని నిరాశ చెందాడు డాంటే


కాని ఇంతలోనే నేల కిందనుంచి కాబోలు ఒక స్వరం వినవచ్చింది. అది గోడ మందాన్ని దాటి రావడంవల్ల ఎవరో గోరీలోనుంచి మాట్లాడుతున్నట్లుంది. "ఇటువంటి సమయంలో నిస్పృహచెందేవా రెవరు?" అన్న దా స్వరం.

డాంటే మోకాళ్ల పైకూచో బడ్డాడు. ఒళ్లంతా గగుర్పొడిచింది. "మనిషి గొంతుక" అని గొణిగాడు.

జైలర్ గొంతుక తప్ప మరొకనిమాటలు డాంటే విని నాలుగైదేళ్లు కావస్తోంది. జైలర్ మనిషనే భావమే అతనికి లేదు. వొణుకుతున్న కంఠంతో ఇలా అన్నాడు: "మీరెవరు? మీగొంతుకవింటే భయంవేసింది. కాని చెప్పండి, మీరెవరు?"

"మీరెవరో చెప్పండి" అన్న దా కొత్తగొంతుక.

"నిర్భాగ్యుడైన ఖైదీని. నా పేరు ఎడ్మండ్ డాంటే. నావికుణ్ని."



కథకుడు: మీపత్రికలో ఉత్త పనికిమాలినకథలు ప్రచురిస్తున్నారుగదా, నా కథ ప్రచురించ లేదేం?
ఎడిటరు: కాస్త నిదానించండి, సార్. మీ కథవంతుకూడా త్వరలోనే వస్తుంది.

"ఎన్నాళ్లనించి ఉంటున్నావు ?"

"1815 ఫిబ్రవరి 28 నించి."

"నీ నేరమేమిటి ?"

"చక్రవర్తి తిరిగి రావడానికి తోడ్పడ్డానని."

"ఏమిటి ? చక్రవర్తి తిరిగి రావడానికా ? అంటే ? చక్రవర్తి కాదా ఇప్పుడు పరిపాలిస్తున్నది ?"

"ఆయన 1814 లో ఫాంటెన్‌బ్లూలో రాజ్యాన్ని త్యజించాడు. ఆయన్ని దేశంనించి బహిష్కరించి ఎల్బాద్వీపానికి పంపారు. ఇదంతా మీకు తెలియనే తెలియదా ? మీరెన్నాళ్లనించి ఇక్కడుంటున్నారు ?"

"1811 నించి."

డాంటే కంపించిపోయాడు. తనకంటె ఇతను నాలుగేళ్లు ముందునుంచి చెర అనుభవిస్తున్నాడు !

ఈమారు అవతల వ్యక్తి గబగబా అన్నాడు : "సరే మీపని ఆపుచేసి చెప్పండి. మీరు తవ్విన కన్నం నేల కెంతెత్తు నుంది ?"

"సరిగ్గా నేల మట్టాన ఉంది, పడకచాటున."

"మీగది దాటితే అవతల ఏముంది ?"

"వరండా."

"అపైన ?"

"మధ్య ఆవరణలోకి వరండా దారితీస్తుంది."

"అయ్యో !" అన్నదా గొంతుక. "చివరికి మోసపోయాను. దిక్సూచి లేకపోడంవల్ల నే దారి తప్పాను. ఒక చిన్న వంకరగీత వల్ల పదిహేనడుగులు తవ్వినది వ్యర్థమైపోయింది. మీరు తవ్వుతున్న ఆ గోడే ఖైదు-చివరిగోడనుకున్నాను."

"చివరిగోడయితే, అది సముద్రంలోకి దారితీస్తుందే!"

"నాకు కావలసింది అదే. సముద్రంలోకి దూకి ఇఫ్ కోటకి దగ్గిరలో ఉన్న ఏ చిన్న ద్వీపానికో ఫ్రాన్సు తీరానికో ఈదుకుపోవచ్చు ననుకున్నాను. ఆ తరవాత క్షేమంగా వెళ్లిపోయేవాడిని. కాని ఇప్పుడదంతా నష్టమైపోయింది. సరే జరిగిందేదో జరిగింది. మీరు తవ్వినగొయ్యి పూడ్చెయ్యండి. నేను మళ్లీ చెప్పేవరకు పని మానెయ్యండి."

"మీ రెవరో చెప్పలేదు."

"నేనా ? నేను ఇరవైయేడో నంబరు."

"అంటే మీరు నన్ను నమ్మడంలే దన్నమాట." అన్నాడు డాంటే బిగ్గరగా. తన్ని విడిచిపెట్టి పారుగుతూ[?]ది వెళ్లిపోతున్నాడనుకున్నాడు. ఇలా అన్నాడు : "నే నీ విషయాన్ని ఆ కిరాతకులకు చెప్పి రహస్యం బైటపెట్టడంకంటె నా ప్రాణాలైనా సరే విడిచిపెడతాను. మనం ఇద్దరం కలుసుకునే ఈ అవకాశాన్ని విడిచిపెట్టకండి. ప్రార్థేయపడుతున్నాను. నామాట నమ్మండి. మీ గొంతుక వినిపిస్తేచాలు. ఆ భాగ్యంకూడా లేకుండా చెయ్యకండి. నా కింక ఓపిక పోయింది. తల గోడకేసి కొట్టుకుని చచ్చిపోతాను. తరవాత మీవల్లనే చచ్చిపోయానని మీరు బాధపడవలసి వస్తుంది."

"నీకెన్నేళ్లు? నీ గొంతుక వింటే చిన్నవాడ వనిపిస్తోంది."

"నాకు తెలియదు. నేనిక్కడికి వచ్చింది మొదలు రోజులు లెక్కపెట్టలేదు. నాకు తెలిసినదల్లా ఏమిటంటే, నాకు పందొమ్మిదేళ్లున్నప్పుడు, 1815 ఫిబ్రవరి 28 న నన్నిక్కడికి తెచ్చారు."

"అంటే ఇంకా ఇరవైఆరేళ్లు నిండలేదన్నమాట. సరే అయితే రా. నీ వయస్సులో ఉన్నవాళ్లు సామాన్యంగా మోసం చెయ్యరు. నాతో మాట్లాడ్డం, నన్ను నువ్వు ప్రార్థించడం మంచిదే అయింది. అసలింకొక ఉపాయం ఆలోచించాను. దాంతో నీకు దూరమైపోయేవాణ్నే. కాని నీచిన్నవయస్సువల్ల నాకు నమ్మకం కలిగింది. నే నొచ్చి నిన్ను కలుసుకుంటానులే."

"అయితే నన్ను విడిచిపెట్ట రన్నమాటేనా ? మీ రొస్తారుగా? లేకపోతే నేనే రానా? ఇద్దరం కలిసి తప్పించుకుని పారిపోదాం. తప్పించుకోలేకపోతే, ఇద్దరం కూచుని మాట్లాడుకోవచ్చు. మీ కెవరిపైన అపేక్ష ఉందో వారినిగురించి మీరు, నా కెవరిమీద ప్రేమ ఉందో వాళ్లను గురించి నేను చెప్పుకోవచ్చును. మీ రపేక్షించేవాళ్లెవరైనా ఉన్నారా?"

"నే నీ ప్రపంచంలో ఒంటరిని."

"అయితే మీరు ఆదరించడానికి నేనుంటాను. మీకూ నా వయస్సే ఉంటే మనం సహోదరుల మౌదాం. వృద్ధులైతే, మీకు నేను కొడుకువలె ఉంటాను. నాకొక తండ్రి ఉన్నాడు ఆయన ఇంకా బతికుంటే ఇప్పుడు 70 ఏళ్లుంటాయి. మర్సిదా అనే ఒక అమ్మాయి ఉంది. ఆమెని నేను ప్రేమించాను. నాతండ్రి నన్ను మరిచిపోడు. అది నాకు గట్టిగా తెలుసును. కాని ఆమె— ఇంకా నన్నుగురించి అసలు తలుచుకుంటుందో లేదో ఆ భగవంతుడికే తెలియాలి. నేను నా తండ్రిని ప్రేమించినట్లుగా మిమ్మల్ని కూడా ప్రేమించగలను."

"సరే బాగానే ఉంది. రేపు చూద్దాం" అన్నాడు గోడ అవతల ఖైదీ.

డాంటే ఇంకేమీ అడగలేదు. లేచి కన్నంలో రాళ్ళు పేర్చాడు. పడక గోడవాటున చేర్చాడు. పడుకుని ఆలోచించడం మొదలెట్టాడు. ఇంక తను ఒంటరిగా ఉండనక్కర్లేదు. అసలు తప్పించుకోవచ్చునేమో! ఇంక తన కింతకంటె కీడు కలిగేదిలేదు. ఉంటే బందీగా ఉండిపోతాడు. బందీగా ఉన్నా, ఇప్పుడు తనకి తోడొకడున్నాడు. నిర్బంధంలో తోడుండడం సగం బాధలు తొలగిపోయినట్లే.

రోజంతా డాంటే అటూఇటూ పచారుచేశాడు. హృదయం తేలికపడింది. తనకి తెలియకపోయినా, తను చూడకపోయినా తానింత గాఢంగా ప్రేమిస్తున్న ఈ కొత్తవ్యక్తి తనకిదూరమైపోడుకదా అని రెండుమూడుసార్లు అనుమానం, భీతి కలిగాయి. అలా జరిగినట్లయితే ఏంచెయ్యాలని ముందే ఆలోచించాడు. జైలర్ వచ్చి పడకెత్తి కన్నం చూసినట్లయితే, అమాంతం ఒకరాయెత్తివాడిబుర్ర బద్దలు కొట్టిచంపాలనుకున్నాడు. అప్పుడు తనకి మరణ శిక్షవిధిస్తారు. అందులో సందేహంలేదు. ఈ శబ్దమే విని

పించి ఉండకపోతే చచ్చిపోవాలనే కదా తను ప్రయత్నించినది! దానికి ఇప్పుడూ సిద్ధమే.

మామూలుగానే సాయంత్రం జైలర్ వచ్చాడు. డాంటే ఆ సమయానికి పక్కమీద పడుకుని జాగ్రత్త పడ్డాడు. జైలర్ వంక కొంత అనుమానంతో, అదోరకంగా చూశాడు డాంటే. జైలర్ అడిగాడు: "ఏం? మళ్లీ నీకు మతిస్థిరం తప్పుతోందా?"

డాంటే జవాబివ్వలేదు. నోరెత్తితే తన ఆవేశం బైటపడుతుందని భయపడ్డాడు. జైలర్ తల పంకిస్తూ వెళ్లిపోయాడు.

రాత్రి పడింది. అంతటా నిశ్శబ్దం అలుముకుంది. చీకటి వ్యాపించింది. తన మిత్రుడొచ్చి మాట్లాడతాడనుకున్నాడు డాంటే-కాని డాంటేకి ఆశాభంగమయింది. అతని కే శబ్దం వినరాలేదు. రాత్రి గడిచిపోయింది. మరునాడు పొద్దున్న జైలర్ వచ్చి వెళ్లిన తరవాత, డాంటే తన పడక ఎత్తబోతున్న సమయంలో గోడపైన మూడుసార్లు తట్టిన శబ్దం వినపడింది. డాంటే మోకాళ్లపై వొంగి కూచుని "మీరేనా? నేనిక్కడున్నాను" అన్నాడు.

"జైలర్ వెళ్లిపోయాడా?" అని అడిగింది అవతల కంఠం.

"వెళ్లిపోయాడు. మళ్ళీ సాయంత్రంవరకూ రాడు. మనకి పన్నెండు గంటలసేపు స్వేచ్ఛ."

"అయితే నేను రావచ్చునన్నమాట?"

"రావచ్చు. రండి. రండి. ఆలస్యం చెయ్యకండి."

డాంటే చేతులానినచోట కొంత మేర మన్ను ఊడింది. లేచి నిలబడ్డాడు. అతను చేసిన రంధ్రానికి కిందుగా రాళ్లు ఊడిపడ్డాయి. అక్కడింకొక రంధ్రం ఏర్పడింది. ఆ చీకటిసొరంగంలోనుంచి మొదట ఒకతల, తరవాత భుజాలు, క్రమంగా మనిషి ఇవతలకొచ్చాడు.

★

"నాన్నా! హోంవర్కుకి బోలెడు లెక్కలిచ్చారు. కాస్త చెప్పవ్?"

"ఏం లెక్కలూ అవ్వి?"

"కనిష్ఠ సామాన్య ప్రమాణం కనుక్కోమన్నారు మా మేష్టారు."

"ఓరి, నీ లెక్కలు చట్టుబండలు గానూ! అదింకా దొరకలేదూ? నేను చదువుకునే రోజుల్నించీ వెదుకుతూనే వున్నారు దాని కోసం."

* * * *

డాక్టరు:—మీ శరీరతత్వం చాలా బలమైంది. అందువల్లే మీకు ఈ జబ్బు నయమైంది.

రోగి:— మీరు బిల్లు పంపేటప్పుడు మాత్రం ఈ మాట జ్ఞాపకముంచుకోండి


* * * *

మేష్టారు:— రామం! నువ్వు ప్రతి రాత్రీ పడుకోబోయేటప్పుడు దేవుణ్ణి తలుచుకుని పడుకుంటావా?

రామం:—అవును సార్.

మేష్టారు:—మరి తెల్లవారి లేచాక కూడా తలుచుకుంటావా?

రామం:—లేదండి. పగటిపూట నాకు భయం వెయ్యదు.



బలే జవాబు

"జయశ్రీ"

చీకటి రాతిరి నొకగుడ్డి దాసరి
లాంతరు పట్టుకు నడచుచుండగా,
చూచిరి కొందరు కొంటెబాలురు;
గొల్లున నవ్వుచు చప్పట్లు కొట్టిరి.


"గుడ్డివానికీ దీపం ఎందుకు?
తాతా! తాతా! దారి తెలుసోఁగా
లాంతరు పట్టుకు బయలు దేరితివి!"
అంటూ బాలురు హేళన చేసిరి.

"మంచి ప్రశ్నసుమీ, బాబుల్లారా!
నా కిది ఉన్నా ఒకటే, లే
కున్నా ఒకటే — మీకొరకే ఈ
లాంతరు తెచ్చితి" నన్నాడాతడు.

"ఈ లాంతరు మాకెందుకు తాతా!"
"కళ్లులేని కబోదినే గద!
కానక నాపై పడతారేమో;
దీపము చూస్తే తొలగి పోగలరు."

కొంటెబాలురీ జవాబువిని
సిగ్గున తలలను వంచుకుపోయిరి,

బొమ్మరిల్లు సీరియల్:



టామ్ సాయర్

మార్క్ ట్వేన్

దొరికింది, దొరికింది," అని హక్ పరమానందంతో అరిచాడు. మకిలిపట్టిన డాలర్ నాణాలని గుప్పిళ్లతో ఎత్తి జారవిడుస్తూ, "అబ్బ! మన కెంత డబ్బుందో! టామ్, ఇప్పుడు మనం ధనవంతుల మయ్యాం," అన్నాడు.

"హక్! నాకు తెలుసు, చివరి కెలాగయినా సంపాదించితీరతా మని. ఇంత డబ్బు దొరికిందంటే నమ్మటానికి కూడా శక్యంగాకుండా వుంది. కాని దొరికిన మాట నిజం— ఇక ఇక్కడ ఆట్టేసేపు తారట్లాడ కూడదు. బయటికి చేరవెయ్యాలి. పెట్టెని ఎత్తగలమేమో చూద్దాం."

టామ్ పెట్టె నెత్తిచూశాడు. దాదాపు యాభై పౌనుల బరువుండవచ్చు. కష్టపడి టామ్ ఎత్తగలిగాడు. కాని ఆట్టేదూరం మొయ్యలేకపోయాడు.

"ఆ రోజున దెయ్యాల ఇంటి దగ్గిర, వాళ్లు కూడా కొంచెం కష్టం మీదే మోసుకెళ్లారు; నేను చూశాగా. ఆ సంచులు తీసుకురావటం మంచిదే అయింది."

డబ్బంతా సంచీల్లోకి గుమ్మరించారు. "శిలువ" రాయిదాకా వాటిని చేరేశారు.

"ఆ తుపాకుల్ని, మిగతా వాటిని కూడా తీసుకొచ్చేద్దాం," అన్నాడు హక్.

"వద్దు, హక్! ఇక్కడే ఉంచుదాం. దోపిడీలకు పోయేటప్పుడు ఇవి మనకు ఉండితీరాలి. వాటి నిక్కడే ఎప్పుడూ ఉంచుదాం. ఇక్కడే మనం విజయోత్సవాలు కూడా చేసుకుందాం. చాల బావుంది యీ ప్రదేశం."

"విజయోత్సవా లంటే?"

"నాకూ తెలియదు. దొంగలు మాత్రం ఎప్పుడూ విజయోత్సవాలు చేసుకుంటూ వుంటారు. అందుచేత మనంకూడా చెయ్యాల్సిందే— ఇక పోదాం, హక్! చాలాసేపయింది మనం వచ్చి. నాకు ఆకలిగా వుంది. పడవలోకి వెళ్లాక కాస్త తిని, చుట్టలు కాలుద్దాం."

పొదల్లోంచి తొంగిచూశారు నదీతీరం నిర్మానుష్యంగా వుంది. పడవలో కూర్చుని విందారగించారు. తృప్తిగా చుట్టపొగ వదులుతూ, ఆవులించారు. సూర్యుడు పశ్చిమదిశకు తిరగ్గానే, పడవ కదిల్చి తిరుగుముఖం పట్టారు. గ్రామసమీపాన ఒడ్డు చేరేసరికి చీకటి పడింది.

"హక్! అమ్మగారి కొయ్య షెడ్డులో అటక వుందే, దానిమీద

డబ్బు దాచేద్దాం. పొద్దున్నే వచ్చి అంతా లెక్కపెట్టి, సమానంగా పంచుకుందాం. తరవాత అడవిలో ఎక్కడ దాస్తే జాగ్రత్తగా వుంటుందో వెదుకుదాం. నువ్విక్కడే కాపలా వుండు. నేను బెన్నీటేలర్ బండి "ఎరువు" తెస్తాను. ఇప్పుడే - ఈ ఉమ్మి ఆరే లోగా వచ్చేస్తా."

టామ్ మాయ మయ్యాడు. రెండు నిమిషాల్లో బండితో సిద్ధమయ్యాడు. రెండు సంచుల్నీ దాని మీద కెక్కించి పైన కొన్ని పాత గుడ్డలు కప్పారు. బండిని లాక్కుంటూ బయల్దేరారు. వేల్సు దేశీయుడిఇంటి దగ్గిర కొచ్చేసరికి, కాస్త అలసట తీర్చుకుపోదామని ఆగారు. మళ్ళీ బయల్దేరబోయే సమయానికి వేల్సు దేశీయుడు బయటి కొచ్చాడు.

"ఏయ్, ఎవ రక్కడ ?"

"హాక్, టామ్‌సాయర్."

"ఓ, మీరా ? రండి రండి నాతో. మీకోసం అంతా కాచుకు కూర్చున్నారు. ఊ - గబగబా— మీరు ముందు నడవండి. ఆ బండిని నేను లాక్కొస్తాను. ఏమిటి?— బరువుగానే వుందే? ఏ ముంది బండి మీద? ఇటికలా? పాత ఇనుమా?"

"పాత ఇనుము," అని టామ్ జవాబిచ్చాడు.

"అదే అనుకున్నాను. ఈ ఊళ్లో పిల్లలు ఎక్కడెక్కడో కష్టపడి వెదికి, నాలుగు పాత ఇనప ముక్కలు సంపాదించుకొస్తారు, ఫ్యాక్టరీకి అమ్మటానికి. అవి అమ్మితే ఏ మొస్తుంది, నాలుగు చివ్వలు—దానికి బదులు కష్టపడి పని చేసి రెట్టింపు సంపాదించుకో వచ్చుగా - ఉహూ-అది చెయ్యరు.. దానికి మనసొప్పదు - హూఁ ఏం చేస్తాం ? మానవబుద్ధి - పదండి, గబగబా."

'ఏమిటీ తొందర' అని పిల్లలడిగారు.

"మీ కిప్పుడు చెప్పను. డగ్లస్ అమ్మగారింటికి వెళ్లగానే మీకే తెలుస్తుంది."

హాక్‌కి కంగారు పుట్టింది. ఉట్టి పుణ్యానికి చివాట్లు తినడం అతనికి మామూలు.

"జోన్సుగారూ! మే మేం తప్పు చేశామండి?"

వేల్సుదేశీయుడు నవ్వాడు హాక్ కంగారు చూసి.

"నాకు తెలియదబ్బాయ్, నువ్వేం తప్పు చేశావో! అమ్మగారికి నువ్వంటే ఇష్టమేగా?"

"నే నంటే ఆవిడకి చాలా దయ అండి."

"అయితే నీకు భయ మెందకూ?"

ఈ ప్రశ్నకి సమాధానం హాక్ ఆలోచించుకునేలోగానే అమ్మగారి ఇంటి కొచ్చేశారు. బండిని వాకిట్లోనే వదిలి, పిల్లలిద్దరినీ లోపలికి తోసి వేల్సు దేశీయుడు ఇంట్లో ప్రవేశించాడు.

అమ్మగారి భవనం ధగద్ధగాయమానంగా దీప తోరణాలతో అలంకరించ బడింది. ఊళ్లో ప్రముఖులంతా వచ్చేశారు. థాచర్లు, హార్పర్లు, రోజర్సులు, పోలీపెద్దమ్మ, సిడ్, మేరీ, చర్చిఅధికారి, పత్రికా సంపాదకుడు, ఇంకా ఎందరో వున్నారు. అంతా మచ్చైన దుస్తుల్లో ముస్తాబై వచ్చారు.

డగ్లస్ అమ్మగారు టామ్, హాక్ లని ఆదరంతో ఆహ్వానించింది. ఇద్దరిబట్టలూ బురద, మట్టి, కొవ్వొత్తి మసీ కొట్టుకుని ఎంతన్నా ఇదిగా వున్నాయి. టామ్ వాలకం చూసి పోలీపెద్దమ్మ ముఖం అవమానంతో ఎర్రబడింది. టామ్ కేసి "నీపని ఇప్పుడు కాదు," అన్నట్టు చూసి తల ఊపింది. అయితే అందరికంటే ఎక్కువగా టామ్, హాక్ లే తమ దుస్తుల్ని చూసి సిగ్గుపడ్డారు. వేల్సు దేశీయుడిలా గన్నాడు:

"టామ్ ఇంటిదగ్గిర లేడు. అందుచేత నే నొక్కణ్ణే రాబోతున్నాను. ఇంతలో మా వాకిట్లోనే ఈ ఇద్దరూ ఎదురుపడ్డారు. వెంటనే వాళ్లని తోలు కొచ్చాను."

"రండర్రా ఇల్లా," అన్నది అమ్మగారు.

లోపల గదిలోకి తీసుకెళ్ళింది ఆమె వాళ్లని.

"ఇదుగో, శుభ్రంగా ఒళ్లంతా కడుక్కోండి. మీ కిద్దరికి కొత్త చొక్కా లాగూ లివిగో. మేజోళ్లు, జేబు రుమాళ్లు అన్నీ వున్నాయి. దబ్బున ముస్తాబుకండి. మేము ఎదురు చూస్తూవుంటాం," అని వెళ్లిపోయింది.

ఆమె వెళ్లగానే హాక్ అన్నాడు:

"ఏదన్నా తాడు వుంటే ఆ కిటికీ లోంచి కిందికి దిగిపోవచ్చు. నేల కాస్త ఎత్తు లేదు కిటికీ."

"ఛా. వెళ్లిపోవట మెందుకూ?"

"నాకు ఆ జనాన్ని చూస్తే భయంగా వుంది. అలాంటి సభలు నాకలవాటు లేదు. నేను వెళ్ళిపోతాను."

"అరె భాయీ! ఏం ఫరవా లేదు. చూడు. నే నేమన్నా భయపడుతున్నానేమో? నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం వేస్తాను, రా."

ఇంతలో సిడ్ వచ్చాడు.

"టామ్! పెద్దమ్మ నీ కోసం మధ్యాహ్నం నుంచీ ఎదురు చూస్తోంది. నీ ఆదివారంబట్టల్ని మేరీ సిద్ధంచేసి వుంచింది కూడాను. మీ బట్టలనిండా ఆ బురద, మసి ఏమిటీ?"

"ఏయ్ సిడ్డీ! నీ కనవసరం ఆవిషయం...

అయితే సరేగాని, ఏమిటీ ఈ గొడవంతా?"

"అమ్మగారు ఎప్పుడూ విందులు చేస్తూ వుంటుందిగా, వాటిల్లో ఇదొకటి. తన్ను ఆ రాత్రి రక్షించినందుకు వేల్సు దేశీయుడికీ, ఆయన కొడుకులకీ విందు చేస్తోంది ఈసారి. ఏయ్, నాకో విషయం తెలిసింది. చెప్పనా?"

"ఏమిటది?"

"వేల్సు దేశీయుడు ఈరాత్రి ఒక గొప్ప రహస్యాన్ని బయటపెడతాడట. కాని ఆయన పెద్దమ్మకి చెబుతుంటే నేను చాటునించి విన్నాను. ఇప్పుడా రహస్యం అందరికీ తెలిసిపోయింది. అమ్మగారికి కూడా తెలిసిపోయింది. కాని తెలవనట్టు నటిస్తోంది. హక్ కూడా వుంటేగాని, ఆ రహస్యం చెప్పనని వేల్సు దేశీయుడు అంటున్నాడు."

"ఏమిటా రహస్యం, సిడ్?"

"అమ్మగారింటిదాకా హక్ ఆ రాత్రి దొంగల్ని వెంబడించలా? అది హఠాత్తుగా ఈ రహస్యం బయట పెట్టి అందరికీ ఆశ్చర్యం కలిగించాలని వేల్సు దేశీయుడు పాపం ఉబలాటపడుతున్నాడు. కాని అది అందరికీ తెలిసిపోయింది. కనక ఆయన పప్పు ఈ సారి ఉడకదు."

ఈమాటలని సిడ్ చాలా గొప్పపని చేసినవాడల్లే ముసిముసిగా నవ్వుకున్నాడు.

"సిడ్! నువ్వేనా ఆ రహస్యం అందరికీ చెప్పేసింది?"

"ఎవరైతే నీకెందుకూ? ఎవరో ఒకరు చెప్పారు."

"సిడ్! ఇంత నీచమైన పని చేసే వెధవ ఒక్కడే ఉన్నాడీ ఊళ్లో-నువ్వే. నువ్వేగనక హక్‌వైతే ఆ రాత్రి కొండకిందికి దౌడుతీసి, దొంగల విషయం ఎవరికీ చెప్పకుండా ముసుగుతన్ని పడుకునేవాడివి. నీది కుక్కబుద్ధి. నువ్వు చేసేవన్నీ వెధవపనులే. ఎవరన్నా మంచి పనులు చేస్తే పొగడటం చూసి ఓర్వలేవు--ఇదిగో, ఇది తీసుకో-ఇంకోటి, ఇంకోటి కూడా......'' అంటూ టామ్ తమ్ముణ్ణి చెవులు మెలేసి తన్నులు తగిలిస్తూ గదిబయటికి గెంటాడు.

"చెప్పుకో, చెప్పుకుంటే నాకేం భయమా? పెద్దమ్మతో చెప్పుకో, కావలిస్తే. రేపొద్దున వుంటుంది నీ పెళ్లి.''

తరవాత కొంతసేపటికి భోజనశాలలోకి అతిథులంతా వచ్చారు. పెద్దవాళ్లంతా ఒక పొడుగాటి బల్లవద్ద కూర్చున్నారు. చిన్న పిల్లలకి పక్కగా చిన్న మేజాబల్లలు వేశారు. సమయం కనిపెట్టి వేల్సు దేశీయుడు లేచాడు. అమ్మగారు తనకీ, తన కొడుకులకీ ఇంత గౌరవం, మర్యాద చూపిస్తున్నందుకు కృతజ్ఞత చెప్పాడు. కాని అసలు మనిషి ఇంకోడున్నాడని, అతనిదే ఈ గౌరవమంతా అనీ, చాలాసేపు బయట పెట్టకుండా ఉపన్యసించాడు. చివరికి 'ధన్' మని తన రహస్యంకాస్తా బయటపెట్టాడు. కాని ఆ "అసలు మనిషి" హక్ అని ఇదివరకే తెలిసిపోవడంవల్ల ఎవ్వరికీ నిజంగా ఆశ్చర్యం కలగలేదు. కాని మర్యాదకోసం ఆశ్చర్యపోయినట్టు నటించారు. ముఖ్యంగా అమ్మగారు మరీ ఆశ్చర్యం నటించి, హక్‌ని తెగపొగడింది. ఈ పొగడ్తల సముద్రంలో హక్ మునిగిపోయాడు. ఎప్పుడూ అలవాటు లేని విలువైన దుస్తులు తొడుక్కోవటంవల్ల ఇందాకటినుంచీ పడే ఇబ్బందిని కూడా మర్చిపోయాడు. అందరూ తనకేసే తేరిపార చూస్తుంటే, భూమి బద్దలై తను లోపలికి దిగిపోతే బావుండు నన్నంత ఇబ్బంది పడ్డాడు.

హక్‌ని తన ఇంట్లోనే ఉంచుకుంటాననీ, శుభ్రంగా చదువుసంధ్యలు చెప్పిస్తాననీ, తనకు కాస్త వెసులుబాటుగా వున్నప్పుడు కొంత డబ్బిచ్చి ఏదన్నా వ్యాపారంలో ప్రవేశపెట్టిస్తాననీ అమ్మగారు ఉపన్యాసం దంచింది.

టామ్‌కు బంగారంలాంటి అవకాశం లభించింది. ఇలా అన్నాడు: "హక్‌కు మీరు డబ్బివ్వక్కర్లేదు. అతడు చాలా ధనవంతుడు."

మర్యాదగా ఉండదని ఊరుకు

న్నారుగాని, లేకపోతే అతిథులు ఈ "వేళాకోళానికి" పొట్ట పగిలేట్టు నవ్వేవాళ్ళే. ఎంత నవ్వితే బావుంటుందో అంతే నవ్వి ఊరుకున్నారు. తరవాత వచ్చిన నిశ్శబ్దం చాలా ఇబ్బందిగా వుంది. టామ్ మళ్లీ అన్నాడు:

"హక్ దగ్గిర చాలా డబ్బుంది. మీరు నమ్మకపోవచ్చు. అంత మాత్రాన అతని ధనం లేకుండా పోదు.... మీరేం నవ్వక్కర్లేదు లెండి. కావలిస్తే ఈక్షణంలో మీకు చూపించగలను..."

టామ్ బయటికి పరిగెత్తాడు. అతిథులు ఒకళ్ల మొహాలు ఒకళ్లు తెల్లపోతూ చూసుకున్నారు. హక్ కేసి చూశారు. అతడు నోటికి తాళం బిగించి కూర్చున్నాడు.

"సిడ్! టామ్ కేమన్నా జ్వరం తగ్గలేదు గదా! అలా పిచ్చి మాటలు మాట్లాడుతాడేం? అమ్మమ్మమ్మ!! ఈ పిల్లడితో వేగలేకుండా ఉన్నానమ్మా," అంది పోలీ పెద్దమ్మ.

పెద్దమ్మ తన వాక్యం పూర్తి చేస్తూండగానే టామ్ ప్రవేశించాడు, రెండు చేతులా సంచీలు మోసుకుని, ఆ బరువుకి కాళ్లు అడ్డదిడ్డాలుగా వేస్తూ.

దీపాల వెలుతురులో బంగారు నాణాలు నిగనిగ మెరిసిపోతుండగా, టామ్ వాటి నొక బల్లమీద గుమ్మరించాడు.

"హే!! నేను చెబితే మీరు నమ్మరు. ఇప్పుడేమంటారు? ఇందులో సగం నాది; సగం హక్ ది"

ఈ దృశ్యం చూసేసరికి అతిథులు ఎక్కడివాళ్లక్కడ బిగుసుకుపోయారు. అందరూ కళ్లప్పగించి, నోళ్లు తెరిచి చూడ్డమే గాని, మాట్లాడ్డం లేదు. కాస్సేపటికి తేరుకున్నారు ఈ అవస్థనుంచి.

'వెంటనే "ఈ డబ్బు మీ కెక్కడిది" దని గద్దించారు. చెబుతానాగండని, టామ్ సవిస్తరంగా మొదటినుంచీ చెప్పుకొచ్చాడు తమ కథ. టామ్ చెప్పటం కూడా చాలా బాగుండటంవల్ల, కథ ముగిసేదాకా ఎవరూ నోరు మెదల్చలేదు. చివరికి వేల్సు దేశీయుడిలా గన్నాడు:

"మీకు ఆశ్చర్యకరమైన రహస్యం బయట పెట్టాలని ఎంతో సరదాపడ్డాను. కాని ఈ అద్భుత దృశ్యం ముందు అది ఏమూలకి?"

ధనం లెక్కపెట్టారు. పన్నెండు వేల డాలర్ల పైగా, ఇంకా కొంచెం వుంది. అంత డబ్బు ఒక్కచోట కుప్పగా పడివుండటం అక్కడ వున్న అతిథుల్లో ఒక్కళ్లూ ఇప్పటి వరకూ చూడలేదు! (వాళ్లలో కొందరికి అంతకంటే ఎక్కువ డబ్బే ఆస్తిరూపంలో ఉన్నప్పటికీ.)

*   *   *   *

టామ్, హక్ లకు లభించిన నడమంత్రపు సిరి సెంట్ పీటర్సు బర్గ్ గ్రామంలో అపూర్వమైన సంచలనం కలిగించింది. అంత పెద్ద మొత్తం, గలగలలాడే బంగారు నాణాల రూపంలో ఇద్దరు ముక్కుపచ్చలారని పిల్లలకు లభించిందంటే ఎవరూ మొదట నమ్మలేకపోయారు. దాన్ని గూర్చి రోజుల తరబడి చర్చలు జరిగాయి; జనం గుటకలు మింగారు; పిల్లల సాహసాన్ని కీర్తించారు. చివరికి ఈ అద్భుత విషయాన్ని గూర్చే అస్తమానం ఆలోచించటంలో చాలామంది మతిపోయే స్థితికి కూడా వచ్చారు.

సెంట్ పీటర్సు బర్గులోనూ, చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఉన్న "దెయ్యాల ఇళ్ల" లో ఒక్కదాన్ని కూడా వదిలిపెట్టకుండా, అన్నిటినీ పునాదులతో సహా తవ్వేశారు, "గుప్తధనం" దొరుకుతుందనే ఆశతో. పిల్లలు కాదు పెద్దవాళ్లే; గడ్డాలు, మీసాలు నెరిసిన "పెద్ద మనుషులు" కూడా సిగ్గులేకుండా ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.

టామ్, హక్ లు కనిపించిన చోటల్లా వాళ్లకు అత్యుత్సాహంగా స్వాగతాలు, సత్కారాలు, మర్యాదలు జరిగేవి; ఇక పొగిడేవారి సంఖ్య లెక్కపెట్టడానికే వీల్లేదు. వాళ్లు రోడ్డుమీద పోతుంటే అమాయకులైన పిల్లలు నోళ్లు తెరుచుకుని అలా చూస్తూ నిలబడిపోయేవారు.

ఇదివరకు తాము మాట్లాడిన మాటల నెవరూ అంత లెక్కచేసినట్టు టామ్, హక్ లకు జ్ఞాపకం లేదు. ఇప్పుడు మాత్రం వాళ్ల నోటి వెంట ఏమాట వచ్చినా దాన్ని అతిశ్రద్ధగా విని, తల వూపి, మెచ్చుకుని, వాళ్లు లేనప్పుడు మరోచోట ఆమాటే పలికేవాళ్ల సంఖ్య జాస్తి అయింది. టామ్, హక్ లు ఏ పని చేసినా అది అద్భుతంగా వున్నదనుకునేవాళ్ల సంఖ్య కూడా జాస్తి అయింది. అసలు వాళ్లకి "మామూలుపనులు"

చేయటం, "చవకబారు మాటలు" మాట్లాడటం కూడా చేతకాదేమో నన్నంత గొప్పవాళ్లయిపోయారు. కొందరు "చరిత్రపరిశోధకులు" ఈ పిల్లలిద్దరి పూర్వజీవితాలని పరిశీలించి అందులో చాలా గొప్పతనాన్ని కూడా కనిపెట్టగలిగారు. గ్రామంలో వెలువడే పత్రిక వీళ్ల జీవితచరిత్రలు సంగ్రహంగా ప్రకటించింది.

హాక్ ధనాన్ని అమ్మగారు 6 రూపాయిల వడ్డీచొప్పున బ్యాంకిలో దాచింది. పోలీపెద్దమ్మ కోరిక మీద టామ్ ధనాన్ని కూడా జడ్జి థాచర్ గారు అలాగే బ్యాంకులో దాచారు. వాళ్ల కిప్పుడు చాలా పెద్ద ఆదాయం ఉంది. వారానికొక డాలరు, ఆదివారంనాడు మరో అర్ధ డాలరు వాళ్ల కిస్తారు. ఆ డబ్బు వాళ్లిష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టుకో వచ్చు. చర్చి అధికారికి కూడా వారానికి వచ్చే ఆదాయం అంతే. (అసలు ఆ ఆదాయం ఆయనదాకా ఎప్పుడూ రాదు. పౌరులు ఊరికే ఇస్తామని అంటారుగాని చాలామంది ఎగేస్తారు.) ఆ రోజుల్లో డాలరుంబావుతో ఒక పిల్లడికి ఉండేందుకు గది, భోజనం, స్కూలుచదువు అన్నీ వచ్చేవి. ఆ మాటకొస్తే బట్టలికి కూడా సరిపోయేది.

జడ్జిథాచర్ గారికి టామ్ అంటే విపరీతమైన అభిమానం ఏర్పడింది. మరొక కుర్రాడెవడైనా అయితే బెకీని ఆరోజున గుహలో నుంచి రక్షించలేక పోయేవాడే నని ఆయన అన్నాడు. పైగా బెకీ తండ్రితో రహస్యంగా మరో విషయం కూడా చెప్పింది: ఒక రోజున తనకు స్కూల్లో దెబ్బలు తగిలేవే నన్నీ, కాని టామ్ అబద్ధమాడి తన దెబ్బలు అతనే తిన్నాడనీ. జడ్జి థాచర్ గారికి దీంతో టామ్‌మీద ప్రేమ ఇంకా ఎక్కువైంది. టామ్ ఆడిన అబద్ధం చాలా ఉదారం, ఉన్నతం అయినదనీ, టామ్ పేరు అమెరికా దేశ మూలపురుషుడైన జార్జి వాషింగ్టన్‌తోపాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదనీ కూడా చెప్పారు. తండ్రి హాల్లో అటూ యిటూ పచార్లు చేస్తూ ఈమాటలు అంటూంటే బెకీ ఆయ న్నెంతో మెచ్చుకుంది. వెంటనే ఆమె పోయి టామ్‌తో ఈ ముక్కలు వాగేసింది.

టామ్ గొప్ప లాయరో, సోల్జరో అవ్వాలని జడ్జిగారు ఆశపెట్టుకున్నారు. టామ్‌ని ముందు మిలిటరీ స్కూల్లో చేర్పించాలనీ, తరవాత దేశంలోకల్లా గొప్ప లాకాలేజిలో చేర్పించాలనీ ఆయన అనుకున్నారు.

హాక్ ఫిన్ ఇప్పుడు ధనవంతుడవటంమూలాన, అమ్మగారి ఇంట్లోనే నివసిస్తూఉండటంవల్ల, అతనికి కొన్ని ఇబ్బందులు కలగటం ప్రారంభించాయి. అమ్మగారి నౌకర్లు హాక్‌ని రోజూ శుభ్రంగా స్నానం చేయించి ఇస్త్రీబట్టలు తొడిగేవారు. నున్నగా దువ్వేవారు. చలవచేసిన తెల్లటి దుప్పట్లు పరిచిన మెత్తటి పరుపులమీద పడుకోబెట్టేవారు. ఆదుప్పట్లమీద ఎక్కడన్నా, పొరపాటుగానైనా మాపుగాని, మసిగాని కనిపిస్తుందేమో, మురుద్దుబెట్టుకోవాలని హాక్ వెదికేవాడు; కాని ఎప్పుడు చూసినా అవి తెల్లగానే ఉండేవి. భోజనందగ్గిర చాకు, ఫోర్కు, చిన్న రుమాల, ప్లేటు, కప్పు ఇన్ని వస్తువులు ఉపయోగించాల్సివచ్చేది. ఇది కాక పుస్తకాలు చదవటం, చర్చికి పోవటం, ఎవరితోనన్నా మాట్లాడేప్పుడు మితంగా, మర్యాదగా మాట్లాడటం మొదలైన అనేక ఇబ్బందులు సంభవించేవి. పాపం ఎటు తిరిగినా, నాగరికత అనే సైలుగోడలు అతనికి ప్రత్యక్షమయ్యేవి.

రు 10,000/- బహుమతి.

అమృతసర్ లో బంగారుతులం రు3/-

క్రింది విషయాలు అబద్ధమని రుజువుచేసినవారికి రు. 10,000/-ల బహుమతి యివ్వబడును.

ధరంశాలనుండి బట్టలవర్తకులు శ్రీ ఎల్. మన్షీరాం వ్రాసినది : "మీరు పంపిన 12 తులాల అమెరకన్ న్యూగోల్డు పార్సెలు చేరినది. ఈ బంగారానికిని అసలు బంగారానికినీ తేడా యేమీలేదు. ఈ బంగారం తయారుచేసి మీరు ప్రజలకు గొప్ప మహోపకారం గావించారు. తిరుగు టపాలో యింకను 12 తులాల బంగారం పంపండి. తరువాత ఆర్డర్లు యింకనూ పంపుతాను" మా క్రొత్తబంగారం గీటురాయిమీద అసలు బంగారువలె గీయును. దీనిని కరిగించి నిజమైన బంగారంవలె నగలను చేయించుకొనవచ్చును. ఈ బంగారానికి నిజమైన బంగారానికి ఎంత తెలివిగల నగలవర్తకుడుగూడ తేడా కనిపెట్టలేడు. ఈ బంగారం మార్కెటులో వ్యాప్తిపరచడానికిగాను తులం రు 3-0-0 లకు రేట్లు నిర్ణయించాము. 3 తులాల ఖరీదు రు 8/-లు, 6 తులాలు రు 15/-లు, 12 తులాలు రు 28/-లు. ముఖ్య గమనింపు: 3 తులాల బంగారం ఆర్డరుకు, ఉచితంగా 2 బొంబాయి ఫ్యాషను ఉంగరాలు. 6 తులాల ఆర్డరుకు, 2 బొంబాయి ఫ్యాషను ఉంగరాలు, ఒకజత చెవుల కమ్మలు, ఒకజత గాజులున్ను. 12 తులాల ఆర్డరుకు, 2 బొంబాయి ఫ్యాషను ఉంగరాలు, 2 జతలగాజులు, గొలుసులో ఒక పతకమున్ను ఉచితంగా యివ్వబడును. మీకు నచ్చకపోతే డబ్బు వాపసు చేయబడును. ఈ అవకాశం పోగొట్టుకొనకుండ నేడే ఆర్డరు యివ్వండి.

AMERICAN CORPORATION
Putlighar, AMRITSAR.

మూడు వారాలపాటు ఈ జైలులో ఓపికపట్టాడు హాక్. ఒక రోజున హఠాత్తుగా మాయమయ్యాడు. 48 గంటల కాలం అమ్మగారు హాక్ కోసం అన్నిచోట్లా వెదికించింది. గ్రామస్థులు కూడా గాబరాపడ్డారు. నదిలో పడ్డాడేమోనని గాలించారు.

మూడోరోజు పొద్దున టామ్ సాయర్ హాక్ మామూలుగా అలవాటుపడిన చోట్లన్నీ వెదికి, చివరికి కసాయిదుకాణం వెనకవున్న ఒక ఖాళీ పెద్దులో మన కాందిశీకుణ్ణి పట్టుకున్నాడు.

హాక్ అంతకు ముందే నిద్రలేచాడు; ఎక్కడో ఎత్తుకువచ్చిన రొట్టెతుంపులు, మాంసంముక్కలు భోజనం చేశాడు. ఇప్పుడు తృప్తిగా, కాళ్లు చాచుకుని చుట్ట కాలుస్తున్నాడు. జుట్టు చిందరవందరగా వుంది; వళ్లంతా మట్టి, దుమ్ము; పూర్వంతను స్వతంత్రంగా, సంతోషంగా ఉన్న రోజుల్లో ధరించే శిథిలవస్త్రాలనే ధరించాడు. టామ్ అతన్ని జబ్బ పట్టకు లేవనెత్తి, గ్రామంలో అంతా ఎంత కంగారుపడుతోందీ చెప్పి, ఇంటికి రమ్మన్నాడు. హాక్ ముఖంలో ఇప్పటిదాకా వున్న ప్రశాంతి పోయి, విచారం వచ్చింది. ఇలా అన్నాడు:


"టామ్! ఇంటి సంగతి ఎత్తకు. నేను ప్రయత్నించాను, కాని లాభం లేదు. ఇల్లు అనే పదార్థం నాకోసం కాదు. నాకది అలవాటు లేదు. అమ్మగారు మంచిదే; నేనంటే దయే. కాని ఆవిడపద్ధతులు నాకు నచ్చవు. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్ర లేపుతుంటుంది. రోజూ స్నానం చెయ్యాలి; చచ్చేట్టు తల దువ్వించుకోవాలి; కొయ్యపెద్దులో పడుకోగూడదు; ఆ వెధవ శుభ్రమైన బట్టలు తొడుక్కోవాలి; వాటిల్లో ఉంటే నాకు ఊపిరాడదు; ఆ బట్టలు తొడుక్కొని కింద కూచోకూడదు; పడుకోగూడదు; ఆఖరికి దొర్లటానికి కూడా వీల్లేదు; చర్చికి పోయి ఆ చెమటలో కూచోవాలి. ఆ ప్రార్థనలు వింటుంటే గంగవెర్రు లెత్తుతుంది; అక్కడ ఈగలు పట్టుకోటానికి, ఆఖరికి బిస్కట్లు నమలటానికి కూడా వీల్లేదు; ఆదివారమంతా బూట్లు తొడుక్కుని ఉండాల్సిందేగదా! అమ్మగారు టైమ్ ప్రకారం తింటుంది; టైమ్ ప్రకారం నిద్ర లేస్తుంది; టైమ్ ప్రకారం పడుకుంటుంది; ఇక నాలాంటివాడు ఏమైపోతాడు చెప్పు ఆ పరిస్థితుల్లో."

"హాక్! ప్రతివాడూ అలాగే చేస్తాడు."


"లాభంలేదు టామ్! నేను ప్రతివాణ్ణీ కాదుగా. నేనక్కడ బతకటం కష్టం. చేపలు పట్టడానికీ, ఈతకొట్టడానికీ అన్నిటికీ అమ్మగార్ని అడిగి మరీ పోవాలి. మర్యాదగా అందంగా మాట్లాడాలి. అందుకే రోజూ ఒకసారి మేడమీదికి పోయి ఒక్కణ్ణే బూతులు మాట్లాడుకు వాణ్ణి; లేకపోతే నోరంతా తిమ్మిరెక్కినట్టుండేది. అమ్మగారు నన్ను చుట్ట కాల్చనివ్వదు; కేకలెయ్యటం ఆవులించటం, మెటికలు విరవటం ఒళ్లు విరుచుకోటం ఏమీ పనిరాదు; ముఖ్యంగా "పెద్దమనుషులున్నప్పుడు—(పెద్ద మనుషులు అనేమాట మహాకోపంగా అన్నాడు హాక్.) ఇక కొద్ది రోజుల్లో స్కూలు తెరుస్తారు. నేను రోజూ పోయి చదువుకోవాలి. అంతకంటే చచ్చిపోటం మంచిది. ధనవంతుడు కావటమంటే ఏమిటో అనుకున్నాను టామ్! అంతా బాధే! అంతా చెమటే! చూడు ఈ బట్టలు నాకు నచ్చాయి, సరిపోయాయి. ఈపెద్దు నాకు బావుంది; దీన్ని నేను వదిలిపెట్టను. అసలు నాకు డబ్బే లేకపోతే ఈఅవస్థంతా వచ్చేదికాదు. టామ్! నా వాటా

ALL REAL LEVER WATCHES AT LESS THAN HALF PRICE
ONLY FOR 2 WEEKS
GTD. 10 YEARS


POSTAGE Rs. 1/ EXTRA — FREE ON ORDER FOR TWO



4 JEWELS CHROME CASE ~~38/-~~ 18/-
" " CENTRE SECOND ~~43/-~~ 21/-
15 JEWELS CHROME CASE ~~72/-~~ 3.
" " ROLLED GOLD ~~90/-~~ 4.



7 JEWELS CHROME CASE ~~62/-~~ 28/-
" " ROLLED GOLD ~~72/-~~ 34/-
15 JEWELS CHROME CASE ~~90/-~~ 41/-
" " ROLLED GOLD ~~100/-~~ 46/-



7 JEWELS CHROME CASE ~~65/-~~ 30/-
" " ROLLED GOLD ~~75/-~~ 35/-
15 JEWELS CHROME CASE ~~90/-~~ 42/-
" " ROLLED GOLD ~~100/-~~ 46/-

FREE INDIA WATCH Co.
POST BOX No. 6724 CALCUTTA

డబ్బుకూడా నువ్వే తీసుకో. ఎప్పుడన్నా పది రాగిడబ్బులు పారేస్తూ వుండు; మాటిమాటికీ యివ్వద్దు. ఎంతో తంటాలుపడితేగాని దొరకని వస్తువులంటే నాకిష్టం. నన్ను వదలిపెట్టమని అమ్మగారితో చెప్పు."

"ఓ, హక్! ఏమిట్రా అలా గంటావ్. నే నెప్పుడూ అలా చెయ్యను. కొంతకాలం పోతే ఇవన్నీ నీకు అలవాటైపోతాయి."

"అలవాటా? అవును, అలవాటవుతాయి; కాని కుంపటిమీద చాలాసేపు మనిషిని కూచోపెడితే ఆ వేడి అలవాటైనట్టుంటుంది. టామ్! నాకు డబ్బక్కర్లేదు. ఆ మేడల్లో బతకలేను. నాకు అడవులు,నది, పెద్దులు ఇష్టం. అక్కడే ఉంటాను నేను. చూడు. మనం తుపాకులు, గిపాకులు అన్నీ రెడీ చేసుకున్నాం, దోపిడీలకోసం. ఇంతలో ఈ అవస్థ వచ్చిపడింది."

"హక్! నేను ధనవంతుడినైనా దోపిడీలు మానను."

'నిజంగానా?"

"నేను చచ్చినంత ఒట్టు. నువ్వు గౌరవస్థుడివి కాకపోతే మా ముఠాలో చేర్చుకోం." హక్‌కి గాబరా పుట్టింది.

"ఎందుకని టామ్! అప్పుడు నన్ను సముద్రపు దొంగ కానివ్వలేదా?"

"అది వేరు. సముద్రపు దొంగకంటే బందిపోటుదొంగ గొప్పవాడు. అసలు చాలా దేశాల్లో వాళ్లు మంత్రులుగానూ, జమీందార్లుగానూ ఉంటారు."

"టామ్! మనిద్దరం జతకాదూ. నన్ను వదిలేస్తావా? వదిలెయ్యవు కదూ? వదిలెయ్యవు కదూ?"

"వదిలెయ్యటం నాకూ ఇష్టం లేదు. కాని అందరూ ఏమనుకుంటారు? 'హు! టామ్ సాయర్ ముఠాలో అంతా చెత్తాకాసీ మనుషులే' అని వెక్కిరిస్తారు. నిన్ను చూసే అలా వెక్కిరిస్తారు. మరి అప్పుడు ఎల్లా?"

హక్ చాలాసేపు మౌనంగా ఉన్నాడు. అంతరాత్మతో కుస్తీలు పడుతున్నాడు.

"సరే, అమ్మగారింటికి వస్తాను. ఒక నెలరోజులు ఎల్లా వుంటుందో చూస్తాను. కాని నీ ముఠాలో చేర్చుకునేట్టయితేనే—"

"ఆల్ రైట్ హక్! పద. అమ్మగారితో చెబుతాలే, నిన్ను కొంచం స్వేచ్ఛగా వదలిపెట్టమని."

"టామ్! చెబుతావా? నిజంగా- నిజంగా? కొన్ని మరీ కష్టమైనవాటిల్లో నన్ను వదిలేస్తే చాలు. నేను చాటుగా చుట్టలుకాలుస్తాను; చాటుగానే బూతులాడతాను.. కాని,ముఠా ఎప్పుడు మొదలెడతావ్? ఎప్పటినుంచీ దొంగతనాలు?"

"వెంటనే. మనవాళ్లందర్నీ సమావేశంచేసి ప్రారంభోత్సవం చేద్దాం."

"ఏమిటీ అది?"

"ప్రారంభోత్సవం."

"అంటే?"

"ఏంలేదు. ఒకళ్లనొకళ్లు కాపాడతామనీ, ముఠారహస్యాలు వెల్లడించమనీ, ఒకవేళ ఎవరన్నా చెబితే వాణ్ణి, వాడికుటుంబాన్ని హత్య చేస్తామనీ ప్రమాణం చెయ్యాలి."

"బలేగా వుంది టామ్ బలే."

"ఈ ప్రమాణం అర్ధరాత్రివేళ, ఒంటరిగా, భయంకరమైనచోట చెయ్యాలి. దెయ్యాల ఇళ్లయితే మరీ మంచిది. కాని వాటి నన్నిటినీ పెల్లగించేశారు."


"ఫరవాలేదు. అర్థరాత్రి పూట చేస్తే చాలు."

"అవును. శవాన్ని ముట్టుకుని చెయ్యాలి ప్రమాణం. తర్వాత నెత్తురుతో సంతకాలు చెయ్యాలి".

"అదీ, అల్లా వుండాలి బందిపోటుముఠా అంటే. సముద్రపు దొంగతనం కంటే ఇదే బాగా వుంది. ఇదిగో టామ్! నేను చచ్చేదాకా అమ్మగారి ఇంట్లో నే వుంటాను. నేను గొప్ప గజదొంగనయ్యాక ఆవిడకూడా నన్ను మెచ్చుకుని, అంత కష్టపెట్టదనుకుంటా."



సమాప్తము



కాకిసాయం

హాసన్ ఆ రాణికి ఓడ నంతా చూపెట్టాడు. ఆమె ఆ ఓడలోని అందాన్ని, దాని వస్తుసామగ్రి యొక్క నైపుణ్యాన్ని చూచి ఆనందంతో మురిసిపోతోంది.

రాణి గది తర్వాత గది చూచుకుంటూ వచ్చి స్నానాల గది వద్దకు వచ్చి దాని అందానికి అమితంగా ఆనందించి అందులో స్నానం చేయటానికి అనుమతించవలసినదిగా హాసన్‌ను ప్రార్థించింది.

రచన :

శ్రీ చిట్టూరి శ్రీరామ కోటేశ్వరరావు

మొట్టమొదట హాసన్ కొంచం బింకం చూపించినా తర్వాత అనుమతించాడు, కాకి అంతకు ముందే ఇచ్చిన సలహా ప్రకారం.

రాణి స్నానం చేయటానికని ఆ పాలరాతిగదిలోనికి వెళ్ళగానే కాకి సలహా ప్రకారం హాసన్ తెరచాపలు ఎత్తించి పడవను కదిలించి తను రాజ్యంవైపు దారితీశాడు.



రాణి స్నానం పూర్తిచేసి గది బయటకు వచ్చేసరికి ఓడ నడుస్తున్నట్లు కనుక్కుంది. ఆమెకు తన రాజ్యాయొక్క అర

(43-వ పేజీ చూడండి)



అవి వేసవి కాలపు రోజులు. పరమానందయ్య శిష్యులతో చల్లని ప్రదేశాలకు బయలుదేరాడు యాత్రల పేరుతో. షుమారు వంద మైళ్లు రెండు మజిలీలుగా నడచి చివరకొక సత్రవు చేరుకున్నారు.

అది వేసవి కాలం కావడంచేత వివాహోత్సవాలు, వసంత నవరాత్రాలు, శ్రీరామోత్సవాలు ఎక్కువగా జరిగే రోజులు. మన పరమానందయ్యగారున్న ఊరిలో కూడా శాస్త్రో కూస్త్రో జరుగుతున్నాయీ ఉత్సవాలు.

ఒక ఇంటి వద్ద వివాహం జరుగుతోంది. వంట వాళ్ళ అశ్రద్ధ చేతనో, లేక మరే కారణం చేతనో అర్ధరాత్రి వేళ ఆ వంట చావడి అంటుకున్నది. దానితోపాటు క్రమక్రమంగా ప్రక్కనున్న ఇళ్లు రెండో, మూడో తగులబడుతున్నవి. చాల గందరగోళంగా ఉంది. ఆ గల్లంతుకు పరమానందయ్య, శిష్యులు నిద్రలేచారు. ఆ గోడ వేమిటో తెలిసికొని రమ్మని ఒక శిష్యుణ్ణి పంపాడు పరమానందయ్య. వాడు దూరాన్నించే చూచి పెళ్లివారి ఊరేగింపనుకొని గురువుగారివద్దకు వస్తూ, ఎందుకైనా మంచిదని త్రోవలో ఒక మనిషి కనిపిస్తే "ఇదేమి ఉత్సవమండీ?" అని అడిగాడు.

రచన:

శ్రీ దద్దనాల వీరభద్రరావు

ఆ మనిషి వీడెవడో తెలివి తక్కువ శుంఠని "అవి పరశురామోత్సవా"లని చెప్పాడు. వెంటనే శిష్యుడు పరుగెత్తుకొని వచ్చి "గురువుగారూ! మన మున్న ఊళ్ళో ఇంత వైభవంగా పరశురామోత్సవాలు జరుగుతుంటే నిద్రపోవట మేమిటి?" అన్నాడు. దానికి గురువుగారు "అదేమిటిరా! పుల్లయ్యా! నేను వసంత నవరాత్రాలు, శరన్నవరాత్రాలు, శ్రీరామోత్సవాలు మొదలైన ఉత్సవాలు చూశాను గాని ఈ పరశురామోత్సవం చూడలేదే? చివరకు పేరుకూడా వినలేదే! ఐనా అలాంటి ఉత్సవం తప్పక చూడాల్సిందే" నని వారందరూ

కలిసి ఆ ఇళ్లు తగులబడేచోటుకి వెళ్ళారు. శిష్యుడితో పరశురామోత్సవాలని చెప్పినమనిషే అక్కడకు సిద్ధమయ్యాడు.

"ఆహా ... హా! ఏమి ఉత్సవాలండీ? ఈ ఊరి వాళ్ళ జన్మ సార్థకమైంది. ఈ ప్రదేశమంతా కాంతితో చూడ ముచ్చటగా ఉంది." అన్నాడు పరమానందయ్య. ఇంకా ఊరుకోక మొదట పరశురామోత్సవాలని చెప్పిన మనిషితో "మీకీ ఉత్సవాలంటే ఆప్యాయం కాబోలు! ఇంత హడావుడిగా జరుపుతున్నారు." అన్నాడు చాల సంతోషించినవాడి వలె.

దానికా మనిషి "మీరుకూడా మీ గురువుగారికి ఇక్కడ ఇల్లు కట్టించి, పరశురామోత్సవాలు చెయ్యండని" శిష్యులతో చెప్పాడు.

శిష్యులంతా కలసి గురువుగారికి ఈ ఉత్సవం చెయ్యలేకపోయిన తరువాత మన జన్మ ఎందుకని, అలా చేస్తే అన్నివిధాలా తరిస్తామని అనుకుంటూ సత్రవులోనికి చేరుకొని గురువుగారితో సంప్రదించారు.

ఇల్లు కట్టే నిమిత్తం గురువుగారు శిష్యులకు 5000 రూ. ఇచ్చారు. ఆ డబ్బుతో ఆ వూరికి దగ్గరగా వున్న ఖాళీస్థలంలో యిల్లు కట్టడం ప్రారంభించారు.

ఇల్లు పూర్తయింది. కాని పరశురామోత్సవం చేసే విధానం వారికి తెలియక, ఆ పెద్దమనిషిదగ్గరకు వెళ్ళి ఆ ఉత్సవం చేసే విధానం శాస్త్రయుక్తంగా చెప్పమన్నారు.


దానికా పెద్దమనిషి "నాయనలారా! మీ గురుభక్తి మెచ్చుకోతగినది. ఉత్సవం చేసే విధానమేమిటంటే, ఎవరికైతే ఉత్సవం చేయదలచారో వారిని ఆ నూతన గృహంలో కూర్చుండబెట్టి, తలుపులన్నిటికీ తాళాలు వేయండి. తరువాత ఇంటి కప్పుపై కొంత నేయి, నూనె మొదలైన చమురులు పోయండి. తరువాత ఇంటికి నాలుగు మూలలా నాలుగు కాగడాలు అంటించండి. మీరంతా ఇంటి బైట కూర్చుని భజనలు చేయండి" అని చెప్పి ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు నవ్వుకుంటూ.

గృహం పూర్తి కాగానే ఆలస్యం కూడదని, ఆనాడే గురువును పూజించి, ఇంటిలో ప్రవేశపెట్టి ఆ పెద్ద మనిషి చెప్పినట్లు మిగిలినదంతా చేసి వారంతా బైట కూర్చుని చిడతలు వేస్తూ భజన చేయటం మొదలుపెట్టారు.

ఇంటిలో నున్న గురువుగారు మంటలను భరించలేక "తలుపు తియ్యండర్రో" అని అరవటం మొదలెట్టారు. కాని, ఆ అరుపులు వాళ్లు వినిపించుకుంటేగా! భజన గొడవలో పడిపోయారు. మంటలు మిన్ను ముట్టాయి. మంటలు లేచిన కొద్దీ శిష్యులు, తన్మయులై, వీరావేశంతో చిందులు తొక్కుతూ భజన చెయ్యడం సాగించారు.

ఈ రభస నంతా చూసి ఊళ్లో వాళ్లు పోగయ్యారు. పరమానందయ్య వెర్రిఅరుపులు విని వాళ్లంతా వచ్చి తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. మంటలవేడికి గురువుగారు మూర్ఛపోయి దొర్లుతున్నారు. ఆయన్ని వసారలకు లాగి మొహాన నీళ్లు జల్లి స్పృహ తెప్పించారు.

శిష్యుల మూఢత్వానికి నలుగురూ నానా చివాట్లుపెట్టి, వీళ్లు ఊళ్లో వుంటే ఇంకా ఏమి అఘాయిత్యాలు చేస్తారోనని గురువుతో సహా ఊరవతలకి సాగనంపారు.



వ్యవసాయ శాఖాధికారి: నీకు వ్యవసాయం విషయం కొంచెమా తెలిసే? ఆ కనబడే గోధుమ చేలో నుంచి నీకు సాలుకు ఎంత ఆదాయం వస్తుంది.

రైతు: అది గోధుమ చేను కాదు బాబయ్యా, జొరిమడి.

కాకిసాయం

(40-వ పేజీ తరువాయి)

కూక కనబడుటలేదు. ఆమె హాసన్ వద్దకు వచ్చి బెదరిస్తూ తన్ను తన రాజ్యం చేర్చమని ఆజ్ఞాపించింది.

కాని హాసన్ ఆమె బెదరింపులకు బెదరలేదు. ఆమెను తమ రాజ్యానికి ఎందుకు తీసుకపోతోంది చెప్పాడు. అంటే ఈ రాణియే ఆ అందమైన పక్షియొక్క పాత యజమానురాలన్న మాట. ఆమె గనుక తనతో రాకపోయిందంటే తన ప్రాణాలు పోతాయనిగూడ చెప్పాడు హాసన్. ఇంకా ఇలా చెప్పాడు: ఆ అందమైన పక్షిచేత నీవు మాట్లాడించిన తర్వాత నీవు నీ స్వదేశానికి తిరిగి వెళ్ళిపోవచ్చు. మా రాజుగారి రాజ్యంలో మీరు చూడదగిన వింతలు అనేకములున్నాయి. వాటిని చూడవచ్చు కూడాను.

"నీవు చెప్పిందంతా నిజమేనని తలుస్తాను. ఎందుచేతనంటే కొంత కాలం క్రిందట నీవు చెప్పినటువంటి పక్షి నావద్దనుండి పారిపోయింది. అదృష్టవశాత్తు అదే గనుక నావద్ద నుండి పారిపోయిన పక్షిఅయితే దానిని నేను మాట్లాడించగలను. పాడించగలను. నీ శ్రమకు తగిన ఫలితం కలుగుతుంది. లేదా నీ శ్రమ అంతా వ్యర్థమాతుంది. దానిచేత పాడించిన తర్వాత తాను దాన్ని తన స్వదేశానికి తీసుకపోతానని గూడ చెప్పింది.

హాసన్ దీనికి తన రాజు అనుమతిస్తాడో లేదో అన్న తన సందేహాన్ని రాణికి వెల్లడి చేశాడు.

చివరకు ఓడ హాసన్ రాజధాని చేరింది. రాజుగారు హాసన్ తీసుకు వచ్చిన రాణియొక్క అందం చూచి నిర్ఘాంతపోయారు. ఆమె అందం చూస్తూ రాజుగారు సమస్త విషయం మరచిపోయారు. హాసన్ ఏ కార్యనిమిత్తం వెళ్ళాడో, ఆ రాణి ఏ పనిమీద తన రాజ్యానికి వచ్చిందో గూడ రాజుగారు మరచిపోయారు.

రాణిగూడ రాజుగారి అందాన్ని చూసి ఆయనతో సంతోషంతో సంభాషించటం మొదలెట్టింది.

"అయ్యా, మన మా దంతపు భవనానికిపోయి పక్షినిచూద్దామా? అది నాదో లేక, మరియొకరిదో. అది నాదే గనుక అయితే దానిని పాడించగలను. దాని కంఠము అది ఎంత అందముగా నున్నదో అంత మధురంగా ఉంటుంది.

రాజగారు ఆ రాణితో కలసి దంతపుగృహానికి వెళ్ళారు. రాణి ఆ భవనంలో అడుగు పెట్టిందో లేదో ఆ పక్షి చక్కగా పాడ మొదలెట్టింది. ఆ పాట వినే వాళ్ళంతా రాతి విగ్రహాల్లా కదలక, మెదలక అలా నిలబడి పోవాల్సిందే! అంత హాయిగా ఆ పక్షి గానాన్ని ఆలాపిస్తోంది.

రాణి వచ్చిన రోజు తప్పితే తర్వాత తన దీవిమాట తిరిగి ఎత్తలేదు. ఎందుచేతనంటే ఆమె ఆ రాజుగార్ని గాఢంగా ప్రేమిస్తోంది.

కొద్ది కాలానికి వారిరువురు అతి వైభవంగా వివాహం చేసుకున్నారు. ఇదంతా హాసన్ యొక్క చలవేనని రాజుగారు హాసన్ కు అమితధనాన్ని ఇచ్చి ఇదివరకటి కంటె ఎక్కువగా గౌరవించారు.

హాసన్ శత్రువుల శరీరమంతా ఈర్ష్యాజ్వరంతో కమిలి పోయింది. వారు హాసన్ ను చెరపాలని తలుస్తూంటే హాసన్ యొక్క పలుకుబడి రాజుగారియొద్ద మరీ హెచ్చిపోతుందామె మరి.

రాజుగారి వివాహానంతరం ఒక వసంతం విలాసంగా గడచిపోయింది. దురదృష్టవశాత్తు సంవత్సరం అనంతరం రాణిగారికి జబ్బు చేసింది. రాజ్యంలోని రాజ వైద్యులంతా లాభం లేదని పెదవి విరచారు. చివరకు ఆమెకు మరణం తప్పదని అందరూ నిశ్చయించుకున్నారు.

ఇది హాసన్ శత్రువులు తెలుసుకొని రాజుగారి యొద్దకు పోయి "మహారాజా! రాణిగారికి వేసే మందు ఆమె రాజ్యంలో ఉండి ఉంటుంది. అది గనుక ఆమెకు వాడితే ఆమె ఆరోగ్యవంతురాలౌతుంది. గనుక ఆమె రాజ్యానికి మందు కొఱకు పంపండి. హాసన్ ఒక్కడే ఆమె రాజ్యపు త్రోవ ఎఱిగియుండుటచే అతనిని పంపుట ఉత్తమమని, మా అభిప్రాయ"మని చెప్పిరి.

వారి యుద్దేశ్య మేమిటంటే హాసన్ తిరిగి ఆ రాజ్యం చేరగ

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిశ్శ్రాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. వి. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

ఆ రాజ్యపు ప్రజలంతా తమ రాణిని ఎత్తుక పోయాడనే కోపంతో హాసన్‌ను చీల్చి చెండాడుతారు. ఇక తమకు అడ్డం తీరిపోతుందని వారు అనుకున్నారు.

పాపం రాజుగారి దృష్టి ఇంత దూరం పోలేదు. ఎలాగో అలా తన భార్య బ్రతకటమే చాలునని తలుస్తున్నాడా రాజు. రాజుగారికీ సలహా అమూల్యమైనదిగా తోచింది. వెంటనే హాసన్‌కోసరం కబురుపంపారు. హాసన్ రాగానే రాజుగారు తన కోరికను తెలిపి వెంటనే ఆ దీవికి పోయి రాణియొక్క ఆస్థాన వైద్యుని వెంటబెట్టుకొని తక్షణం రావలసినదిగా ఆజ్ఞాపించారు.

ఈ కార్యం ఎంత అపాయకరమైందో హాసన్ తెలసికొన్నాడు. ఈ సలహా రాజుగారికి తన శత్రువులే ఇచ్చియుంటారని కూడ తెలసికొన్నాడు.

సరే, ఏమైతే అది అయింది. అని నిశ్చయించుకొని మూడవ కాకి ఈక తీసికొని గాలిలో ఎగురవేసి కాకిని పిలచాడు.

కాకి హాసన్‌ను సమీపించింది. "నీవు నన్నెందుకు పిలచావ్? మరల క్రొత్త కష్టాలేమైనా నిన్ను ఆవరించినాయా''? అని అడిగింది కాకి.

"అది కష్టమో కాదో నాకు తెలియదు. నా మనస్సు మాత్రం అది అపాయకరమని చెబుతోంది. రాజుగారు నన్ను ఆ దీవికి రాణికి మందు తెమ్మనమని పంపుతున్నారు" అని చెప్పేడు.

రాణియొక్క అస్వస్థత వినగానే కాకి ముఖంలో విచార కళలు స్పష్టంగా ప్రతిఫలించాయ్. "నీవు తప్పక వెళ్ళాలి. వెంటనే బయలుదేరాలి. ఆ రాణి సౌధంలో ఒక మందు ఉన్నది. ఆ మందును గనుక రాణి సకాలంలో పొందక పోయినట్లయితే రాణియొక్క మరణం తథ్యం. నీ వా ప్రజలవల్ల ఎట్టి కష్టములకు పాల్పడవు. నీవు వారికి రాణియొక్క అనారోగ్యాన్ని గురించి చెప్పగానే ఆ ప్రజలు నీకు మందు తప్పక తెచ్చి యిస్తారు. కాని ఆ సౌధపు ద్వారందగ్గర రెండు భయంకర సింహాలున్నాయి. వాటిని దాటి ఆ సౌధంలోని వారిని కలసికోవాలి. అవి తప్పక నిన్ను ముక్కలు ముక్కలుగా చీల్చేస్తాయి. ఇపుడు నీకు మరల నా సాయం అవసరం'' అని చెప్పింది కాకి.

''ఇటు చూడు నా కుడి రెక్కలోని ఆ వెండి ఈకను తీసుకో. దీనితో ఆ సింహాలను తాకగానే అవి సాధు మృగములై పోతాయి.'' అని గూడ చెప్పింది.

హాసన్ కాకి కుడి రెక్కలోంచి వెండి ఈకను తీసికొన్నాడు. ప్రయాణం సాగించాడు. ఏడు దినముల అనంతరం దీవి చేరి, సింహములను దాటి సౌధం చేరుకున్నాడు.

ఆ సౌధంలోని ప్రజలు ఈతడు సింహాలను జయించి లోపలికి ఎటుల రాగలిగెనా అని వింతగా చూస్తుండగా రాణియొక్క అనారోగ్యమును గురించి హాసన్ వారికి చెప్పాడు.

వారు ఆదుర్దాగా ఒక మందు తీసుకవచ్చి హాసన్‌కిచ్చి మర్యాదగా సముద్రపొడ్డుకు తీసుకవచ్చి మా రాణి ఆరోగ్యం బాగుపడవలెనను ప్రార్థనలతో హాసన్‌ను సాగనంపారు.

హాసన్ వారం రోజులలో రాజధాని చేరాడు. అంతా ఆమె పరున్న గదిలోకి పరుగెత్తారు. రాణి చైతన్య హీనమై మంచముమీద పరుండియున్నది.

"మందు తెచ్చావా?" అని రాజుగారు బిగ్గరగా అడిగారు.

హాసన్ ఆ మందును రాజవైద్యుని చేతిలో పెట్టాడు. తనకు సాయపడుతున్న కాకి తన్ను అనుసరించి ఆ గదిలోకి వచ్చియున్నట్లు హాసన్ కనిపెట్టలేదు.

వైద్యుడు ఆ ఔషధమును ఆమె పెదవులకు రాయగానే ఆమె కనులు తెరచి లేచి మంచముమీద కూర్చుని అందర్నీ చూడసాగింది.

తలవని తలంపుగా ఆమె కళ్ళు ఆ కాకిమీద పడినవి. ఆమె కాకిని సంబోధిస్తూ "ఓ కృతఘ్నురాలా, నీ యజమానురాలిని ఎంత ఆపదలో తోశావో గుర్తించలేక పోయావ్" అని అంది.

"అలాగా, నీ విపుడు దాదాపు మృత్యుమందిరం చేరావ్. ఇపుడు నే చేసిన సాయంవల్ల నీకూ నాకూ సంతోషంగానేఉంది.''అన్నది కాకి.

"మంచి పని చేశావ్. నేను నీకు కీడు చేసినా నీవు నాకు మేలు చేశావ్ నీవు ఇలా నా దగ్గరకు రా" అని అంది రాణి.

ఆ గదిలో ఉన్న వారంతా రాణీ వాయసముల సంభాషణను వింతగా వింటున్నారు. మరో వింత జరిగింది.

కాకి రాణియొక్క మంచాన్ని సమీపించగానే రాణి దగ్గరనున్న కూజాలోని నీళ్ళు కొన్ని మంత్రించి కాకిమీద చల్లింది. విచిత్రం! కాకి స్థానంలో రాణిఅంత అందంగల యువతి నిలబడిఉంది.

రాజుగారు, హాసన్ ఈ దృశ్యం చూచి చాల ఆశ్చర్యపడ్డారు. తరువాత రాణి చిరునవ్వుతో రాజుగారి వైపు తిరిగి ఇలా చెప్ప సాగింది.

"ఈ స్త్రీ నాకు చాల నమ్మకమైన సేవకురాలు. నాకు ఈమె యందుగల నమ్మకము చేత ఈమెను చాల గౌరవించెడి దానను. ఈగౌరవము వలన ఆమెకు గర్వ మతిశయించి చివరకు నన్నే తిరస్కరింప మొదలిడినది. ఆమెను శిక్షించుటకు ఆమెయొక్క రూపమును కాకిగా మార్చి వదిలి వేసితిని. కాని ఆమె హాసన్‌కు తగిన సలహాల నిచ్చి నా ప్రాణములను రక్షించుటచే ఆమెను మరల మానవ రూపమునకు మార్చితిని".

రాణి సేవకురాలు రాణి కాళ్ళమీద పడి తన తప్పిదములను క్షమించమని ప్రార్థించినది. రాణి ఆమెను లేవదీసి తన ప్రక్కన కూర్చుండ చేసింది.

హాసన్ ఆమె (సేవకురాలు) అందం చూచినప్పటి నుంచి తన నయనములను ఆమెమీద నుండి మరల్చ లేకపోయాడు. అతడు ఆమెను ప్రేమించాడు. రాజుగారియొక్కయు, రాణిగారియొక్కయు అనుమతిపై హాసన్ ఆ యువతిని వివాహమాడినాడు.

హాసన్ శత్రువు లంతా హాసన్ యొక్క అదృష్టాన్ని చూచి మనకిక ఇక్కడ తావు లేదనుకుంటూ ఆ రాజ్యాన్ని వదిలి వేరొక రాజ్యానికి వెళ్ళి పోయారు. ★

(అయిపోయింది.)

అదీ-ఇదీ

(22-వ పేజీ తరువాయి)

"సోవియట్ కూటమి యుగోస్లావియాపై దాడి చేస్తేనూ, అట్టిదాడి అమెరికా చైనాపై చేసే దాడికి ఫలితం కాకపోతేనూ యుగోస్లావియాను రక్షించవలసి ఉంటుందని ఒప్పుకుంటాను. యుగోస్లావియాకూ, దక్షిణ కొరియాకూ సామ్యం లేదు. పైనుంచి దాడి జరగనంతకాలమూ తన్ను తాను రక్షించుకోగల ప్రభుత్వం (యుగోస్లావియాలో) ఉన్నది. దక్షిణ కొరియాకు అది ఎన్నడూ లేదు. కొరియాను రెండు కీలుబొమ్మరాజ్యాలుగా విభజించటం జరిగింది కూడా పైవాళ్ళకృషివల్లనే. అదీకాక, యుగోస్లావియా యూరపులో ఉన్నది; కొరియా ఆసియాలో ఉన్నది. "ఆసియా ఆసియా వాసులది" అని నానమ్మకం. యూరపు, అమెరికాల ఆయుధబలంమీద ఆధారపడే ఏ ఆసియా ప్రభుత్వాన్నీ నేను బలపరచలేను... జర్మనీ పునరాయుధ ధారణను నేను ఒప్పుకోక పోవటానికి నాలుగు బలమైన కారణాలున్నాయి: (1) అందువల్ల జర్మను ప్రజాస్వామ్యం నశించి, జర్మన్ సైనికనాయకులు అధికారం చేపట్టగలరు; (2) రష్యాతో కొంతవరకైనా సమాధానం కుదరటానికదిప్రతి బంధకంగాఉండగలదు, (3) దీనివల్ల మరొక "కొరియా" ఏర్పడి, ఒకే దేశానికి చెందినప్రజలు కృత్రిమసరిహద్దు కిరుపక్కలా నిలబడి పరస్పరం ప్రతిఘటించవచ్చు—అదికూడా కొరియాకన్న ప్రమాదకరమైన ప్రాంతంలో; (4)దీనివల్ల త్వరలోనే పశ్చిమరాజ్యాలకు కాక, సోవియట్ యూనియనుకు కొత్త స్నేహం (ఫ్రాన్సుతో?) లభించవచ్చు.

"ఇందులోనే మిస్టర్ మోయినిహాన్ లేఖకుకూడా చాలావరకు సమాధానం చెప్పాను. నేను వర్ణించిన అమెరికను అయోమయత్వానికి ఆయన లేఖే ఒక చక్కని ఉదాహరణ... ఆయన అమెరికన్ పత్రికలెన్నడూ చదవడా? జనరల్ మకార్థరుకూ, చంగ్‌కై-షేక్‌కూ, మధ్యజరిగే గూడుపుఠాణీ గురించి ఆయన ఎన్నడూ వినలేదా?" ★

పాకిస్తాను

(7-వ పేజీ తరువాయి)

లలో నడుస్తాము," "సోవియట్ యూనియన్ వర్ధిల్లాలి," అనే నినాదాలూ కనిపిస్తాయి.

లాహోరులోని ప్రవీణ కార్మికులు ఇట్టి జీవితం గడుపుతున్నారు. వీరి కింకా సెత్తిన ఏదోకప్పంటూ ఉన్నది. అనేక వేలమంది నిర్భాగ్యులకు ఇదీలేదు. వీరు నగరం వెలపల తిరుగుతూ, పెంటకుప్పల్లో తిండి అన్వేషిస్తూ ఉంటారు. ఈదేశం చూడబోతే మంచి సూర్యరశ్మి, ఏడాదికి రెండు పంటలుపండే బంగారు పొలాలూ కలది.

పారాషూట్ ఫాక్టరీలో పనిచేసేవాళ్ల ఇళ్లు చూశాము. పెద్దభవనంలో 250 కుటుంబాలు నివసిస్తున్నారు. చినిగిన తెరలు దారాలతో కట్టి అడ్డాలు పెట్టుకున్నారు. ఎక్కడా గోడలు లేవు, కర్రసామానులు లేవు కటికగచ్చుమీద ఒకరిపక్కన ఒకరు పడుకునిఉన్నారు. మనుష్యులు ఇక్కడే పుట్టటం; ఇక్కడే రోగగ్రస్తులు కావటం, ఇక్కడే చావటం, ఇక్కడే మంటలు పెట్టి వారువంటలు చేసుకోవటం. రైల్వేకార్మికులకన్న నేత కార్మికులు తక్కువ గడిస్తారు. అయినా వారీ గోరీలాంటి ఇళ్లకు 8 రూపాయల అద్దె ఇచ్చుకోవాలి. పిల్లల్లో పదింట ఎనిమిదిమంది క్షయవాతపడి ఆ ఎనిమిదిమందీ చనిపోతూంటారు. వారి అంత్యక్రియలకు డబ్బుండదు.

లాహోరు జనాభాలో అత్యధిక సంఖ్యాకులు ఈ చెప్పినరైల్వే, నేత కార్మికులలాగే జీవిస్తారు.

గోరిషానుంచి తిరిగివచ్చేటప్పుడు ప్రభుత్వోద్యోగులుండే ప్రాంతంమీదుగా వచ్చాము. చుట్టూ తోటలు గల పెద్ద భవనాలలో వారు అద్దెలేకుండా నివసిస్తారు. వారికి ఇంటిఖర్చులూ, మోటారుకారూ కూడా ఉచితంగానే లభిస్తుంది. ఈ విధంగా ప్రభుత్వానికి అమ్ముడుపోయిన వీరు పాకిస్తాను పోలీసురాజ్యానికి విశ్వాసంతో సేవచేస్తారు. ప్రజలుమాత్రం ఒకవంక జమీందారీ, పెట్టుబడిదారీ వర్గాల దోపిడికిందా, మరోవంక ఆంగ్లో అమెరికను సామ్రాజ్యవాదుల కిందా నలిగిపోతున్నారు.

మాకు రెండు లాహోర్లు కనబడ్డాయి. ఒకలాహోరు రోజులు తీరిపోతున్న ధనికవర్గానిది. కరొకటి పీడితక్షుధార్తులది. కాని వీరికి బలమూ, ఉన్నత జీవితం కొరకు పోరాడే దీక్షా ఉన్నది. వీరి గొంతుక మాకు వినిపించింది. వీరి కళ్ల మెరుపు కనిపించింది. భవితవ్యం వీరిదే. వీరే భావిపాకిస్తాను. ★

ప్రభుత్వాలు, ఆయవ్యయాలు

(3-వ పేజీ తరువాయి)

చ్ఛక్తి, ఆంధ్రదేశంలో మొత్తం ఉత్పత్తిలో సగానికి పైగా ఉంది. దక్షిణాదిని విద్యుచ్ఛక్తి ఉన్న గ్రామాలు వందలమీదున్నాయి. కాని ఆంధ్రదేశంలో పట్టణాలకే విద్యుచ్ఛక్తి లోటుగా ఉంది. మొదటినుంచీ ఉమ్మడిధనం వెచ్చించి వృద్ధిచేసుకున్న దక్షిణాది హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల వల్ల విద్యుచ్ఛక్తి చవగ్గా ప్రజలకు పరిశ్రమలకు సప్లై అవుతోంది. థెర్మల్ స్టేషన్ల ద్వారా సరఫరా అవుతున్నందువల్ల ఆంధ్రదేశంలో విద్యుచ్ఛక్తి సప్లై రేటు ఎక్కువయింది. సప్లైచేసేది ఒక్క ప్రాంత ప్రభుత్వమే కాబట్టి (త్వరలోనే మిగిలిన కంపెనీలు కూడా ప్రభుత్వపరమౌతాయి. అదీ కాక రేట్లు నిర్ణయించే అధికారం ఎప్పుడూ ప్రభుత్వానిదే.) రాష్ట్రమంతటికీ ఒకే ధర నిర్ణయించడం న్యాయం. ఉభయప్రాంతాలూ ఇప్పుడు వస్తున్న రాబడి ప్రకారమే రేటు నిర్ణయించవచ్చును. దక్షిణాదిని మూడు పైసలు హెచ్చించినట్లయితే ఆంధ్రదేశంలో రేటుని అణా తగ్గించెయ్యడానికి వీలుపడుతుంది. కాని ఇటువంటిది భక్తవత్సలం గారికి నచ్చక పోవచ్చును. అయినా తెలుగు శాసనసభ్యులున్నారు. కాబట్టి, ఇది అడగడం వారి కర్తవ్యం.

ఆంధ్రదేశాన్ని విడగొట్టాలని ఆందోళన జరుగుతున్నప్పుడు, ప్రభుత్వ పాలనలో అన్యాయం జరుగుతున్నదని ప్రజలు భావిస్తున్నప్పుడు, ప్రజల సందేహం తీర్చడం ప్రభుత్వ కర్తవ్యం. ఆంధ్రదేశంలో అభివృద్ధి స్కీముల నిమిత్తం ఇంతవరకూ (కాంగ్రెస్ 1946లో ప్రభుత్వాధికారంలోకి వచ్చినప్పటినుంచి) ఎంతెంత ఖర్చులు మంజూరైనవీ, ఎంత ఖర్చు పెట్టబడిందీ, వీనిలో న్యాయాన్యాయాలెంతవరకు ఉన్నదీ విచారణ జరిపించడం మేలు. భక్తవత్సలం ప్రభృతులు పక్షపాతం మాని, తెలుగు మంత్రులు తమ కర్తవ్యాన్ని గుర్తించకపోయినట్లయితే, ఈ పరిస్థితులికి కారకులైన తెలుగుమంత్రుల్ని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరిచిపోరు.



శ్రీ చింతామణి దేశముఖ్

కేంద్రప్రభుత్వం పన్నుల హెచ్చింపు

రైల్వే ప్రయాణపు ఛార్జీల హెచ్చింపు వల్ల రైల్వేశాఖవారు రు 19 కోట్లకు పైగా రాబట్టడానికి ప్రయత్నిస్తున్నారు. పన్నులు కొన్ని హెచ్చించి కేంద్ర ఆర్థికశాఖా మంత్రిగారు అదనంగా రు 31 కోట్లు పైగా రాబట్టడానికి యత్నిస్తున్నారు. రాబడి పన్ను, కార్పొరేషన్ టాక్సు, సూపర్ టాక్సు, ఎగుమతి పన్నులు, దిగుమతి పన్నులు హెచ్చుతాయి. అయితే దిగుమతి చెయ్యబడే సరుకులో ప్రజల కతి ముఖ్యమైన రకాలు ఇతరదేశాలతో వాణిజ్యపు టొడంబడికల్లో చేరిఉన్నందువల్ల, ఈ పన్నుల పెరుగుదల అవసర వస్తుసామగ్రికి అంటే తగలదు. పెట్రోల్, కిరసనాయిల్ ధరలు కొద్దిగా పెరుగుతాయి. ఎగుమతి సరుకుల్లో మిరియాలు, వేరుసెనగపప్పు, ప్రత్తి, వస్త్రాలపై పన్నులు హెచ్చించబడతాయి. అయితే వేరుసెనగపప్పు కంటె నూనిపైన ఎగుమతి పన్ను దట్టించినట్లయితే బాగుండేది. మనదేశంలో నూనెల ధరల పెరుగుదలకి కారణం వేరుసెనగనూని ఎగుమతి. వేరుసెనగనూని వ్యాపారులికి విదేశాల్లో విపరీతంగా లాభాలు గడించి పెడుతున్నాయి. వారి ఎగుమతి పన్నుకి తట్టుకోలేకపోరు. పప్పుపైన ఎగుమతి పన్ను విధించడంవల్ల ప్రభుత్వానికి ఏపాటి రాబడి వస్తుందో చెప్పడం కష్టం. సిగరెట్లు పొగాకుల పైన పన్నులు పెంచబడుతున్నాయి.

ఖర్చు

పన్నుల హెచ్చింపు ప్రజల్లో వివిధ వర్గాల మధ్య పెంచబడిందనే చెప్పవచ్చును. పన్నుల విధింపు విధానాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దేశముఖ్ గారు వివరించారు. వస్తువుల ధరలు పెరుగుతున్న స్థితిలో, ప్రభుత్వం ఋణాలుగా తీసుకుని గాని, పన్నుల ద్వారా వసూలు చేసి గాని, ప్రజల వద్ద ఉండే ధనాన్ని కొంత తగ్గించగలిగినట్లయితే, ధరలు మరింత పెరక్కుండా నిరోధించవచ్చును. కాని ప్రభుత్వ ఋణాలు తీసుకునే కార్యక్రమం తృప్తిగా సాగడం లేదు. వడ్డీ రేటు పెంచితే గాని ధనవంతులు ప్రభుత్వానికి ధనాన్ని ఋణమివ్వరు. కాబట్టి ధరల పెరుగుదలని అరికట్టే నిమిత్తం పన్నులు పెంచవలసి వస్తోందని దేశ్‌ముఖ్ గారన్నారు. ధనాన్ని తీసుకోడం వరకూ బాగానే ఉంది. ఈ పన్నుల హెచ్చింపు వల్ల ఇంకొక తెర్న ధరలు పెరగ వచ్చని కొందరంటున్నారు. నిజానికి పన్నులు హెచ్చినా హెచ్చకపోయినా, కొరియా యుద్ధం మూలంగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కాబట్టి, ఈ పన్నుల వల్లనే ధరలు పెరుగుతాయని చెప్పడానికి లేదు. కాని ఇలా రాబట్టిన ధనాన్ని ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి స్కీముల నిమిత్తం వెచ్చించడం

న్యాయం కాదు. ఈ సంవత్సరం పన్నుల ద్వారా తీసుకుంటున్న ధనాన్ని, ఈ సంవత్సరం ప్రయోజన మివ్వగల స్కీములపై ఖర్చు పెట్టాలి. అయిదా రేళ్ళకి ప్రయోజన మివ్వగల స్కీముల్ని, వడ్డీ ఇచ్చి తీసుకుని వాయిదాలమీద తీర్చే ఋణాల ధనంతో నిర్వహించాలి. ఈ పద్ధతిని మార్చి, ఈ సంవత్సరం ప్రజలవద్ద వసూలు చేసిన సొమ్మును ముందెప్పుడో ప్రయోజనకారి కాగల ప్రాజెక్టుల నిమిత్తం ఖర్చు పెడుతున్నారు.

ఋణాలు

ప్రభుత్వం తమ స్కీముల నిమిత్తం ధనం తెచ్చుకోలేక పన్నుల ధనం తీసుకుంటున్న దంటే, ధనవంతులు, ద్రవ్య వ్యాపారుల్ని లొంగతియ్య లేక పోయిం దన్న మాట. ఈ సంవత్సరం ధరల పెరుగుదల తరవాత ప్రభుత్వం ఋణాలు తీసుకునే వడ్డీ రేటు హెచ్చించక తప్పని సరి రావచ్చును. అంటే దానితో ప్రభుత్వం ఓటమి పూర్తవుతుంది.

నారవస్త్ర పరిశ్రమలు

పాకిస్తాన్ రూపాయిమారకానికి భారత ప్రభుత్వం తలొగ్గవలసి వచ్చిందంటే, అది పాకిస్తాన్‌కి గెలుపు కాదు. భారతదేశంలోని నార, వస్త్రపు మిల్లర్ల చేతుల్లో భారత ప్రభుత్వం పొందిన ఓటమికి ఫలితం. ఇండో-పాకిస్తాన్ వ్యాపార రంగంలో ఓటమితోపాటు, ద్రవ్య వ్యాపారంలో కూడా ఓటమిని అంగీకరించి భారత ప్రభుత్వం తమ ఋణాల రేట్లని ఇప్పుడే పెంచేస్తే మేలుగా ఉండేది. స్కీములకి కావలసిన పెట్టుబడి వ్యాపారుల వద్దనుంచే లభించేది.

వస్త్రోత్పత్తిని పరిగణించినట్లయితే అన్ని రంగాలలోనూ అభివృద్ధి ఉందనీ, నార, వస్త్రం, పంచదార పరిశ్రమల్లో మాత్రం ఉత్పత్తి తగ్గిందనీ మంత్రిగారు చెప్పారు. ఉత్పత్తి తగ్గినా పారిశ్రామికులు వ్యాపారుల లాభాలు తగ్గలేదు. పని తక్కువైనందువల్ల కార్మికులు మాత్రం బాధపడుతున్నారు. నిర్వృత్తిఅధికమయింది. ప్రపంచంలో వస్త్రానికీ, నార సంచులికీ గిరాకీ ఎక్కువైంది. భారతప్రభుత్వం కంట్రోల్‌ని సమర్థతతో నిర్వహించలేకపోతున్నందువల్ల, నార మిల్లర్లు, వ్యాపారులు లైసెన్సు లేకుండా విపరీతంగా నార సంచుల్ని, నూలుని అక్రమంగా ఎగుమతిచేసి లాభాలు గడించారు. లైసెన్సు లున్నవారు కూడా విదేశాల్లో ధరలు పెంచేసి విపరీతంగా లక్షలకిలక్షలు లాభాలు గడించారు. ప్రభుత్వం చివరి రోజుల్లో కాని మేలుకోలేదు. రెండు మాసాలకిందటనే నార ఎగుమతిపైన పన్ను పెంచారు.

దేశంలో వస్తూత్పత్తి, విదేశాలతో వ్యాపారం ఒక్క నార, పత్తి సప్లైలవల్ల వచ్చిన లోటు తప్ప, ఇతరత్రా అభివృద్ధి పొందిందని ప్రభుత్వం గమనించింది. ఈ అభివృద్ధి చెప్పుకోవలసినంత లేదు. అందువల్ల నార పత్తి సప్లైలు వృద్ధయితేగాని దేశం ఆర్థికపరిస్థితి కోలుకోదని ప్రభుత్వం భావించినట్లు కనిపిస్తుంది. అందువల్ల ఇంక ప్రతిష్ఠకు నీళ్లువొదిలి భారతప్రభుత్వం పాకిస్తాన్‌తో బేరానికి దిగింది.

ఈ సంవత్సరం పాకిస్తాన్ సప్లై చెయ్యగల నార, పత్తి, ఆహారం ఉప్పు మొదలైన సరుకుల ధరలు హెచ్చుగా ఉంటాయి. వస్త్రం, నార పరిశ్రమల ఉత్పత్తితో పాటు ఆ సరుకుల ధరలు పెరక్కమానవు.

కేవలం అధిక లాభాల ఆర్జనకోసం పారిశ్రామికులు, వ్యాపారులు మన దేశానికి చేసిన అపకారాన్ని ప్రజలు మరవకూడదు. ప్రభుత్వాన్ని ఏ విధంగా వంచనచేసి లక్షలాది లాభాలు ఆర్జిస్తున్నారో, ప్రభుత్వం ఈ ఆర్థికస్థితికి ఏ విధంగా తలొగ్గవలసి వస్తోందో, ఈ మూడేళ్ళ బడ్జెట్లే తార్కాణాలు. భారతదేశాన్ని పాకిస్తాన్ ముందు మోకరింపజేసిన ఘట్టం వారు దేశభక్తికి అణాపైసలతో కట్టే మూల్యానికి తార్కాణం.

★

ఉత్తమ శైవమతగ్రంథము

పండితారాధ్యచరిత్ర

వెల రు 5-0-0 లు

ప్యాకింగిపోస్టేజి రూ. 1-4-0.

ఆంధ్ర గ్రంథ మాల

పోస్టుబాక్సు 212, మదరాసు 1.

గృహిణి

(5-వ పేజీ తరువాయి)

లేచి వెళ్లి కసురుకుంటే పెద్దవాళ్లు వచ్చారు. చిన్నాళ్లని జవానులచేత పట్టి తెప్పించి ఒకచేత్తో పట్టుకొని, ఒకచేత్తో తలలు దువ్వేను. మా ఎడ పిల్లడు పట్టుకొన్నానన్న కోపం కొద్దీ గిజాయించుకుని పారిపోతూ నూనెగిన్నె తన్నేశాడు.

చంటిపిల్లాడికి పనిమనిషి సరిగా పోయలేదని నేనే వాడికి నీళ్లుపోసి పడుకోపెట్టమని బంట్రోతుకిచ్చి, తక్కిన పిల్లలకు నీళ్లు పోయమని పనిమనిషికి అప్పచెప్పి నేను వంటకు కూర్చున్నాను. ఇక స్నానాల దగ్గర పిల్ల రాద్ధాంతం యింతా అంతా కాదు. ఒకడ్ని పిలుచుకొచ్చి నీళ్లు తొగుపుకొనే టప్పటికల్లా వాడు పారిపోవటం మళ్లీ పట్టుకొచ్చేటప్పటికల్లా, దాక్కోవటం, నేను రెండు కేకలు వేసేటప్పటికి ఏమీ ఎరగనట్లు బాతురూములో దూరటం జరిగింది. కాని అక్కడనుంచి పనిమనిషి, పిల్లలు కూడా ఒకటే కేకలు.

"నీళ్లుసరిగా పోయించుకోవడం లేదమ్మా నా మీదంతా చల్లేస్తున్నా" రని అది. సరిగా సబ్బు రుద్దడం లేదమ్మా అనీ, కంట్లో సబ్బు పోయిందని ఏడ్పు, నీళ్లు వేడిగా పోసిందని గంతులూ, జరుగుతున్నాయి. ఎప్పుడూ ఉండేగోలే కదా అని నేను కదలలేదు. అక్కడనుండి బట్టలకు పేచీలు. లాగూ కనబడలేదనీ, బాడీ దొరకలేదనీ గౌను చిరిగిపోయిందనీ—అన్నదీ వరుస.

నేను వంటింట్లోనే కూర్చుని, పొయ్యిమీద గిన్నెలో చమురు పోసి వంకాయ తాళింపు పెడదామని చూస్తున్నా. ఇంతట్లోకే గొల్లది వెన్న తెచ్చిందండమ్మా అన్న కేక. ఇన్నాళ్లెందుకు ఆలస్యం చేసిందా అని బయటికి ఒక్క గంతు వేశా. "అబ్బ పెళ్లిళ్ళమూలాన్ని పాలు ఖర్చయినయిండమ్మా లేకపోతే తేను—మీకు-తప్ప యింకెవరికిస్తానూ" అని సాగతీసింది. చమురు మాడిపోయిన వాసన ముక్కుకు తగలగానే, కూరగిన్నె దింపలేదన్న జ్ఞాపకం వచ్చి పరుగెత్తి గిన్నె దించి తాళింపు పెట్టా. మా పెద్దపిల్ల వచ్చి "అదేంటమ్మా కాలికి నెత్తు"రన్నదాకా, నా బొటనవ్రేలికి, ఎదురుదెబ్బ తగిలిందని తెలుసుకోలే. "తొరగా రండమ్మా" అన్న వెన్నదాని కేక విని బయటకొచ్చి, తూయించుకొని దాన్ని పంపేసి స్త్రీలకి పెట్టి పుట్టిన స్థలంలో కూలబడ్డా. కొబ్బరిపచ్చడికి అపురుచ్చుకుంటూండగా

"కళ్లెలవాళ్లు పిల్చానండమ్మా చూడండి ఎంతకు బేర మాడమంటారో" అన్న పిలుపు. సరే అని బయటకు వెళ్ళా. ధరసరిగా కుదర్లే. వాడ్ని పొమ్మని లోపల కొచ్చే. ఇంత లోకే చాకలివాడి దర్శనం. "పనివేళప్పుడు రావద్దని నీ కెన్నిసార్లు చెప్పాలి. మాటక్కడపెట్టిపో"అని వాణ్ణిపంపించేశా.

పదకొండే సేశారు. వంట గబగబా ముగించి, చదువులు బొత్తిగా సాగటంలేదని (ఈ ఊళ్లో స్కూల్లో అంతా మరాఠీయె గనుక చేర్పించలేదు) పెద్ద పిల్లల్నిద్దరిని పిలిచి లెక్క లిచ్చాను. పెద్దపిల్లకి రూ-అ-పై పెంచడం, కుర్రాడికి మామూలు పెంచడం యిచ్చా. కాస్సేపటికి యిద్దరూ చేసి చూపించారు. పెద్దావిడ ఎనిమిది రెండ్లు పదహారు పైసలు, ఎనిమిది నాలుగులు 32 అణాలు అని వేసింది. "ఎన్నిసార్లు చెప్పాలే, పైసల్ని అణాలకి తీసుకు రావాలని". దానికి నచ్చచెప్పి, కుఱ్ఱాడి లెక్క చూసేటప్పటికి నాలుగు ఎనిమిదులు ముప్పైఆరు అని వాడు చేశాడు. ఏడ్చినట్లే ఉంది నీ ఎక్కాలని, యిద్దరూ మళ్ళీ తరువాతచేసి చూపించండని, డిక్టేషను చెపితే, యిక సరే ధీర్ఘాలు లేనిచోట్ల దీర్ఘాలు, వత్తులున్నచోట్ల తీసేయడమున్నూ. విసుగెత్తి చూచి వ్రాత వ్రాయండని, పన్నెండవడం చేత వడ్డించుదామని లేస్తున్నా. ఇంతలోనే కొంప మునిగిపోయినట్లు రెండో కుఱ్ఱాడు పడిపోయానని మోకాలు పట్టుకొని ఏడుస్తూ వచ్చాడు. "నువ్వే పడిపోతే ఏడ్పెందుకురా, ఎవరన్నా పడేస్తే ఏడవాలికాని" అని వాడ్ని ఓదార్చడానికి చూశాను. నెత్తురొస్తూంది చూడని ఏడ్పు రెట్టించాడు. చూతును కదా, మోకాలు కాస్తంత కొట్టుకుపోయి రక్తం చిమ్మింది. కాస్త వెన్నులీను అయింటుమెంటు తడివి పొమ్మంటే పోడు. పట్టీ కట్టూ అని ఏడ్పు. పట్టీ కడితేకాని నొప్పి ఉపశమింపదురా బాబూ అని కాస్త దూదిపెట్టి పాత బట్టపేలిక కట్టాను.

ఇకసరే భోజనాలదగ్గర మామూలు అల్లరేను. మంచినీళ్లు వలకపొయ్యడమూ, అన్నం చిమ్మడమూ ఒకటి కాదు. ఎట్లాగో అట్లాగ భోజనాలు ముగించుకొని నౌకర్లందరూ ఇళ్లకు పోయినందున చంటోడ్నేసుకొని మంచంమీద నడుము వాల్చా.

పోస్టు బంట్రోతు ఉత్తరాలు తెచ్చిచ్చాడు. ఏముంది? అమ్మ దగ్గరనుండి, చెల్లెలు దగ్గరనుండీని. ఉత్తరాలు వ్రాయడం లేదు, నీ క్షేమం తెలియడంలేదనిన్నీ. అమ్మ ఉత్త కంగారుమనిషి. టెలిగ్రాం యిద్దామనుకొందిట గాని రెండు రోజులు చూసి యిద్దామని మానుకుందిట. అన్నంత పనీ చేస్తుందిరా బాబూ అని వెంటనే లేచి ఒక కార్డుముక్క గిరికేసి వచ్చిపడుకున్నా. విజయా సతీషు లిద్దరూ ప్రక్కన చేరారు. నేను నీ దగ్గరంటే, నేను నీ దగ్గరనీ. తగువు తీర్చలేక, చంటోడ్ని కడుపుమీద వేసుకొని యిద్దర్నీ చెరోప్రక్క వేసుకొన్నా. కాస్త కునుకు పడుతోంది. పిల్లలు రన్నింగు రేసులు, హై జంపులు, తలుపులు ఎవరు గట్టిగా మూస్తారో నని పందాలతో పూర్తిమెలుకువ వచ్చింది. "అరే కాస్త నిశ్శబ్దంగా ఉండండిరా" అంటే, వాళ్లబుర్రల్లో కెక్కుతుందా? చూసుకుంటే ప్రక్కన సతీషు మాయమయ్యాడు. లేచి చూచేటప్పటికి స్టోరురూములో బియ్యములో గోధుమలు, గోధుములలో బియ్యము కలబోస్తున్నాడు. చొక్కాఅంరా తడిసిఉందేం చపామ్మ అని బయటికివచ్చి చూచేటప్పటికి మంచినీళ్ల కుండమీద మూతలేదు. సగంనీళ్లు ఖాళీ. "ఇందాకణ్ణుంచీ మీ కేం చేస్తున్నాగు, వాడేంచేస్తుండేది చూడలేదూ" అని పిల్లల మీద కసురుకున్నా.

టైముచూస్తే $3\frac{1}{2}$ అయింది. ఆఫీసునుండి వచ్చేటైమయింది. వంకాయ బజ్జీలు చేసి టీ పెట్టాలని లేచా. నాలుగున్నరకి ఆయన వచ్చారు. అంతా టీలు ముగించాము. తీరా ఆయన బయటకు వెళ్లేటప్పటికి ఎవరో తెలిసినవారు యిద్దరు రాగా, రెండు కప్పులు టీ కోసరం కబురుచేశారు. మళ్లీ స్టౌ వెలిగించి టీ నీళ్లు పెట్టా. నీళ్లు కాగుతూ ఉండేటప్పటికి మరొకరొచ్చారుట. ఇంకొక కప్పు ఎక్కువ కావాలని కబురు. ఇంకొన్ని నీళ్లు పోసి టీ తయారుచేసి కప్పుల్లో పోసేటప్పటికి నాలుగో ఆయన తయారయారు. "అమ్మసాబ్ చార్ కప్ చా లావ్ బోల్ రే" అని తురకజవాన్ ఏడ్చేడు. కప్పుల్లోచా అంతా మళ్లా డేగిసాలోకి దిమ్మరించి రెండు చమ్చాల చెక్కెర వేసి కొన్నిపాలు పోసి అన్ని గ్లాసుల్లోకి సదిరి పంపించా.

పిల్లలందరికీ మొఖాలు కడిగి, బట్టలు వేసి బయటకు పంపించా. మా వారుకూడ క్లబ్బుకు వెంచేశారు. రాత్రితొమ్మిదీ, తొమ్మిదన్నరయితేనే కాని రారు. నా రాత్రి వంట తొందరగానే ముగించుకొని ఆ వేళ పేపరు చదువుదామని కూర్చునే టప్పటికి పిల్లలు తయారైయారు. ఊరికినే వస్తే బాగానే ఉండును. ఒకరుఏడుస్తూ, ఒకరు మూలుగుతూ ఒకరు బట్టలంతా దుమ్ముచేసుకొని దిగారు. కూడా వెళ్లినబంట్రోతును "నీవేమి చేస్తున్నావురా" అంటే "నేనేమి చేసేదమ్మా, గబగబా పరుగెత్తారు పడిపోయారు"అన్నాడు. వాడినని ఏంలాభమని ఊరుకున్నా.


అందరికీ భోజనాలుపెట్టి బయిటికి వచ్చేటప్పటికి జవానులు పక్కలు తయారుచేశారు. ఇకమొదలు పిల్లి మొగ్గలు, కుస్తీలు, తలగళ్లు ఒకళ్లమీద ఒకళ్లు విసురుకోవడం.. అన్నీ పక్కలమీదే. 10నిముషాలలో దుప్పటొక మూల,బ్లాంకెటొకమూల, గదంతటా తలగళ్లూను. రెంకుతిక్లేటప్పటికి సద్దణిగారు. నౌకరు మూలుక్కుంటూ, మళ్లీ పక్కలు సరిచేశాడు. కాస్సేపు చదవండర్రా అంటే నిద్దరొస్తుందంటారు. పడుకోండంటే కాలు నొప్పెడుతుందని ఒకడూ, కడుపులో నొప్పని ఒకళ్లు తీపులు తీయడం ఆరంభించారు. ఆడినంతసేపు కనబ..లేదా అని ...మయించి పుస్తకాలు తీయమనేటప్పటికి పెద్దవాళ్లు దొంగ నిద్ర నటించారు. విజయ నాన్న యింకా రాలేదూ అని ఏడ్పు మొదలెట్టింది. వస్తారుండమ్మా అని ఎంత బ్రతిమిలాడినా వినదు. "త్వరగా రమ్మనూ" అని యింకా గట్టిగా ఏడ్పు.

ప్రొద్దుటినుంచి వీళ్లతో విసిగిపోయి చేతికర్రతీసి కొడతానని బెదిరించా. దానితో వెక్కి వెక్కి ఏడ్పుమొదలెట్టి, ఒక అరగంటసేపటికి ఏడుస్తూనే నిద్దుర పోయింది. పడుకున్నాక జాలివేసింది, ఎందుకు కసురుకున్నా నా అని.


తొమ్మిదింపావు...ంది. నా వారి జోరు చప్పుడైంది. లోపలకొస్తార... వచ్చుతే అని చంటివాడ్ని పక్క నేసుకునిపడుకున్నా. ఒక పావుగంటసేపు రేడియో న్యూసు విని నెమ్మదిగా వళ్లు విరుచుకుంటూ "అబ్బా"అని లోపలికి దయచేశారు. ఏమంత కష్టపడిపోయారనడిగా. "నేను కష్టపడకపోతే నువ్వు కష్టపడ్డావా ఏంటి" అని అడిగారు. ఎవరు కష్టపడ్డారో దేవుడుకే తెలియాలని సణుక్కుంటూ, కాళ్ళీడ్చుకుంటూ వచ్చి వడ్డించి ఇద్దరం భోజనంచేసివచ్చాం. నేను మాత్రం యింక కూర్చోక పడక వేశాను. ఆయన యింకా పేపరుచదువుకుంటూనే వున్నారు. నాకు నిద్రవచ్చేసింది.

ఈ అవస్థలన్నీ పడుకుంటూ నేను కష్టజీవినో, లేక "ఆవిడకేం తక్కువమ్మా హాయిగా కాలక్షేపం చేస్తూంది" అని అందరూ అనుకుంటున్నట్లు సుఖజీవినో తెలియడంలేదు.


గనోక్వెల్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వరఫార్మసి, రాజమండ్రి.



విశాఖ జిల్లా కాంగ్రెస్ రైతుసంఘమును స్థాపించుటకు ముందుకు విజయ నగిరిలో సమావేశమయిన రైతులు సమావేశము సభా మంటపము (1) గౌ. నీలం సంజీవరెడ్డి. (2) శ్రీ కళా వెంకటరావు. (3) టి. చెంగల్వరాయన్ ప్రముఖులు ఆసీనులై వున్నారు.



1950 సం॥ కాకినాడలో జరిగిన 16 వ ఆంధ్రనాటక కళాపరిషత్తు మహాసభలలో శ్రీ పినిశెట్టివారి 'పల్లెపడుచు' నాటకము ప్రదర్శించి వుత్తమ బహూకృతి నందిన సందర్భమును పురస్కరించుకొని సదరు మండలికి పాలకొల్లు పౌరులు 18-2-51 వ తేదీని చేసిన సన్మాన సందర్భమున తీసిన ఫోటో.



కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి 25-2-'51 వ తేదీ కాకినాడలో జరిగిన మహాకవి సమ్మాన సందర్భమున తీయబడిన ఛాయాపటము.

Regd. No. M. 4479

ఖర నామ సంవత్సర

ఆంధ్రపత్రిక ఉగాది సంచిక

★

రచయితలకు విన్నపము:

ఆంధ్రపత్రిక ఖరనామసంవత్సర ఉగాదిసంచికను ఉగాదినాటికే ప్రకటించగలందులకై ప్రయత్నములో నున్నాము.

★

ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలు, సాంస్కృతిక, సాంఘిక, సారస్వత, రాజకీయాది సర్వవిషయములలోను విజ్ఞానప్రబోధకములై, చిరంతన ప్రయోజనకరమైన విలువగలిగియుండు సంప్రదాయము, ఆంధ్ర పాఠక లోకమునకు సుపరిచితమైన విషయమే.

తదనుగుణ్యముగ రచయితలు, చిత్రకారులు, తమతమ ఉత్తమ వ్యాసములను, చిత్రములను, ఎప్పటి యభిమానముతోనే సంచికకు పంపి, మా కృషిని సఫలీకృత మగునట్లు చేయ ప్రార్థన.

సంచికను ఉగాదినాటికే వెలువర్చుటకు మీరు వ్యాసములు, కథలు, చిత్రములు మొదలైనవి మా కార్యాలయమునకు వెంటనే చేర్చకున్న మా కృషి సుకరము కాదు కాన, త్వరలో రచనలను మా కట్లు పంపవలసినదిగా రచయితలకు విన్నవించుకొనుచున్నాము.

ఇట్లు,

సంపాదకుడు.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChettySt, Madras.